25-12Pg1exHNMWJQEB 1 ONG_25-12Pg1exHNMWJQEB.qxd 24/Dec/25 11:40 PM Page 1

సాహితీ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఒంగోలు

: fb.com/vaartha Digital

కపిల్ చిట్స్‌తో బంధం ఆనందాల అనుబంధం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
45 years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-12-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 324 పేజీలు: 12 వెల: 6.50



**వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుకు ప్రాధాన్యం**

**ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**

# ఆర్డీఎస్ఎస్ పనులు ముమ్మరం

**తిరుపతి,డిసెంబరు 24ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడీసీఎల్ పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుకు ప్రాధాన్యతనివ్వాలని ఎస్పీడీసీఎల్ సిఎండి శివ శంకర్ లోతేటి సూచించారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొ ేట్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండి మాట్లా డుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 45 వేల వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేయడం జరిగిం దని, ఈ డిసెంబర్ 31వ తేదీలోగా మరో 5 వేల వ్యవసాయ విద్యుత్ సర్వీసులను విడుదలచేయడం ద్వారా 50 వేల సర్వీ సుల మార్కును చేరుకోవాలని అధికారులకు సూచించారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ పంపిణీ పునర్వ్యవస్థీకరణ పథకం (ఆర్డిఎస్ఎస్) పనులను వేగవంతం చేయాలని అధికా రులను ఆదేశించారు. ఈ పథకం కింద అభివృద్ధి పనులను త్వరితగతన పూర్తి చేయడం ద్వారా వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా రూఫ్ టాప్ సోలార్ సిస్టంపై వినియోగదారుల్లో అవగాహనను పెంపొందించాలని శివశంకర్ సూచించారు. కేవలం ఎస్సీ,ఎస్టీ గృహ వినియోగదారులకు మాత్రమే కాకుండా, ఎస్సీ ఎస్టీయేతర వినియోగదా రులు కూడా సోలార్ విద్యుత్ వైపు మొగ్గు చూపే విధంగా అధికా రులు ప్రణాళికను రూపొం దించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి. అయూబ్ ఖాన్, కే.గురవయ్య, కే. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జే.రమణాదేవి, కె. ఆదిశేషయ్య, పీహెచ్ జానకిరామ్, ఎం. మురళి కుమార్, పి. సురేంద్ర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.





## ఎల్‌వీఎం-3 ఎం6 రాకెట్‌ద్వారా నాలుగో ప్రయోగం కూడా సక్సెస్

**అమెరికాకు చెందిన ఉపగ్రహం రోదసిలోకి**

**వాణిజ్య ప్రయోగాలకు రాచబాట వేసిన ఇస్రో**

**సూళ్లూరుపేట, డిసెంబరు 24 ప్రభాతవార్త:** ఇస్రో అంతరిక్ష ప్రయోగాల్లో మరో భారీ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించి సత్తా చాటింది. ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్‌ద్వారా అమెరికాకు చెందిన వాణిజ్య ఉపగ్రహం బ్లూబర్డ్ బ్లాక్-2ను నిర్దేశించిన కక్ష్యలోకి ప్రవేశపెట్టి మరోసారి గగనతలంలో కీర్తిపతాకం ఎగుర వేసింది. బుధవారం శ్రీహరి కోటలోని రెండవప్రయోగ వేదికనుంచి 8.55.30 నిమిషాలకు నిప్పులుచెరుగుకుంటూ ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ నింగికి ఎగిసింది. షార్‌లోని శాస్త్రవేత్తలు, సందర్శకుల కరతాళ ధ్వనుల మధ్య రాకెట్ గమ్యస్థానం వైపు దూసుకెళ్లింది. నింగిలోకి >>2

# పిపిపి విధానంపై ముందుకే



**పేదలకు నాణ్యమైన వైద్యంలో రాజీలేదు**

**కేంద్ర మార్గదర్శకాల ప్రకారం విజిఎఫ్‌కు నిర్ణయం**

**ఆదోని మెడికల్ కాలేజ్ నిర్మాణానికి ముందుకొచ్చిన సంస్థతో ఒప్పందం**

**వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు**

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** పేదలకు నాణ్యమైన మెడికల్ విద్యను, వైద్యాన్ని అందించే విషయంలో ఎక్కడా రాజీ పడేది, వెనక్కి తగ్గేది ఉండదని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వైద్యా రోగ్యశాఖపై సచివాలయంలో బుధవారం సీఎం సమీక్షి ంచారు. ఈ సందర్భంగా పీపీపీ విధా నంలో మెడికల్ కాలేజీల నిర్మాణం ప్రస్తావనకు వచ్చింది. దేశ వ్యాప్తంగా పీపీపీ విధానం అమల్లో ఉందని పేద వర్గాలకు నాణ్యమైన, కార్పొరేట్ వైద్యం అందించే విషయంలో పీపీపీ విధానంలో ముందు కువెళ్లాలని సీఎం అధి కారులకు సూచించారు.

**పీపీపీలకు వయబులిటీ గ్యాప్ ఫండింగ్:** సమీక్ష సందర్భంగా పీపీపీ విధానంలో ఆసుపత్రులు, మెడికల్‌కాలేజీల నిర్మాణం, మౌలిక వసతులపై కేంద్ర ప్రభుత్వ సూచనలను, మార్గదర్శకాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పీపీపీ ప్రాజెక్టుల అమలును ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం, ఆర్థిక వ్యవహారాల విభాగం, ఆర్థిక మంత్రిత్వశాఖ ద్వారా పలు విధానపరమైన ఆర్థికసహాయ పథకాలను ప్రవేశపెట్టిందని అధికా రులు చెప్పారు. ఈ క్రమంలో అమలులో ఉన్న వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద సామాజిక-ఆరోగ్య రంగానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ పీపీపీ ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద అందించే ఆర్థిక చేయూతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాలని కేంద్రం సూచించిందని అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా వైద్యరంగంలో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద ఇచ్చే 60శాతం ఆర్థిక మద్దతులో చెరో 30శాతం చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలని సూచించినట్లు అధికారులు తెలిపారు. వీజీఎఫ్ >>2

# పాస్టర్లకు క్రిస్మస్ కానుక

## 8,418 మందికి రూ.50.50కోట్లు విడుదల

**శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఫరూక్**

**విజయవాడ డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** పాస్టర్లకు కూటమి ప్రభుత్వం క్రిస్మస్ కానుకను అందించింది. మైనార్టీశాఖా మంత్రి ఫరూక్ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు.క్రైస్తవ సోదరులకు బుధ వారం ఆయన ఒక ప్రకటనలో ఈ విషయం తెలుపుతూ క్రీస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.పాస్టర్లకు నెలవారీ అందించే గౌరవవేతనాలను జమ చేసింది. 24వ తేదీ సాయంత్రంలోపు గౌరవ వేతనాలు చెల్లిస్తామని సెమీ క్రిస్మస్ రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇచ్చినమాట ప్రకారం రాష్ట్రంలోని 8,418 మంది పాస్టర్లకు గౌరవ వేతనం నిధులు బుధవారం విడుదలచేశారు. 2024డిసెంబర్ నుంచి ఈ ఏడాది నవం బర్‌వరకు మొత్తం రూ.50,50,80,000ను రాష్ట్ర ప్రభుత్వం పాస్టర్ల ఖాతాలో వేసింది. >>2

# గ్రామాల్లోను అన్న క్యాంటీన్లు

## సంక్రాంతి నుంచి ప్రారంభం

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ప్రజలకు సంక్రాంతి కానుకగా ఏపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఒకేసారి 70 అన్న క్యాంటీన్లు ప్రారం భించనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం వివిధదశల్లో ఉన్న క్యాంటీన్ల నిర్మాణ పనులు జనవరి 10లోగా పూర్తి చేయనుండగా, జనవరి 13నుంచి 15మధ్య క్యాంటీన్లు ప్రారంభించే >>2

# గిరిజన ప్రాంత ఆసుపత్రులకు డ్రోన్ల ద్వారా మందులు

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** మారుమూల గిరిజన ప్రాంతాలకు అత్యవసర వైద్య సేవలను చేరువ చేసే లక్ష్యంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ "రెడ్ వింగ్" సంస్థతో కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంగా దూరప్రాంతాల్లోని ఆసుపత్రులకు డ్రోన్ల ద్వారా మందులు, >>2



25-12pg2exHMNWJQE 2_25-12pg2exHMNWJQE.qxd 24/Dec/25 11:35 PM Page 1





రాకెట్ ప్రయోగం విజయవంతం అవడంతో ఆనందోత్సాహాలలో చైర్మన్ నారాయణ, ఇతర శాస్త్రవేత్తలు

# కక్ష్యలోకి 'బ్లూ బర్డ్'

>> ఎగిసిన అనంతరం 500 కిలోమీటర్ల దూరాన్ని 15 నిమిషాల 30 సెకన్లలో చేరుకుని అత్యంత బరువైన 610 టన్నుల ఉపగ్రహాన్ని లియో ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది.

**రాకెట్ గమనం ఇలా..** రాకెట్ ప్రయోగాల్లో గతంలో నాలుగు దశలు ఉండగా, ప్రస్తుత ప్రయోగం మూడు దశల్లో ముగిసింది. మొదటి దశలో స్ట్రాపాన్ బూస్టర్లలో ఉన్న 400 టన్నుల ఘన ఇంధనం మండుకుని 105.98 సెకన్ల పాటు రాకెట్‌ను నింగిలోకి తీసుకెళ్లింది. అక్కడి నుంచి రెండో దశ ప్రారంభమైంది. 110 టన్నుల ద్రవ ఇంధనంతో రాకెట్ 301.70 సెకన్లపాటు మండుతూ రాకెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లింది. మూడో దశలో కీలకమైన క్రయోజనిక్ దశ ప్రారంభమై 304.36 సెకన్ల పాటు రోదశిలోకి బ్లూబర్డ్ బ్లాక్2 ఉపగ్రహాన్ని లియో ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఎఎస్‌పి స్పేస్ మొబైల్ సంస్థతో ఇండియాకు చెందిన ఎన్ఎస్ఐఎల్ చేసుకున్న వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఈ ప్రయోగం జరిగింది. రోదశి రంగంలో ప్రపంచ దేశాల్లో ప్రప్రథమంగా భారీ ఉపగ్రహ ప్రయోగం నిర్వహించి ఇస్రో మరో మైలురాయిని అధిగమించింది.

**భళారే బాహుబలి:** ఇస్రో బాహుబలి రాకెట్‌గా పేరొందిన ఎల్‌విఎం3-ఎం6 అత్యంత బరువైన బ్లూబర్డ్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపి బాహుబలి పేరును సార్థకం చేసుకుంది. ఎల్‌విఎం సిరీస్‌లో ఇప్పటికి 8 ప్రయోగాలు సక్సెస్ కాగా, 9వ ప్రయోగం అమెరికాకు చెందిన బ్లూబర్డ్ భారత ఉపగ్రహం కావడంతో కొంత ఉత్కంఠ నెలకొంది. ఈ ఉత్కంఠకు తెరదించుతూ ఆశించిన దాని కన్నా ఈ ప్రయోగం విజయవంతమైంది. ఇస్రో శాస్త్రవేత్తల కృషికి మంచి ఫలితం అందినట్లయింది. ఇస్రోకు ఇది 104వ ప్రయోగం. ఈ ప్రయోగ విజయంతో వాణిజ్య ప్రయోగాలకు ఇస్రో రాచబాట వేసినట్లయింది. ఎల్‌విఎం3-ఎం6 రాకెట్ ద్వారా ఇప్పటివరకు మూడు వాణిజ్య ప్రయోగాలు జరిగి ఉన్నాయి. ప్రస్తుతం నాలుగవ ప్రయోగం కూడా విజయవంతం కావడంతో భవిష్యత్‌లో మరెన్నో ప్రయోగాలు ఇస్రో వాణిజ్యపరంగా చేసేందుకు ఈ ప్రయోగం దోహదపడుతుంది. ప్రపంచ దేశాల్లో భారీ ప్రయోగాలు చేసే సంస్థగా ఇస్రో గుర్తింపు తెచ్చుకుంది.

**ప్రయోగ విజయం స్ఫూర్తినిచ్చింది:ఇస్రో చైర్మన్ వి.నారాయణన్:** ఎల్‌విఎం3-ఎం6 ప్రయోగ విజయం భవిష్యత్ ప్రయోగాల నిర్వహణకు నమ్మకంతో పాటు స్ఫూర్తినిచ్చిందని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. బుధవారం ఎల్‌విఎం3-ఎం6 ప్రయోగ విజయం అనంతరం ఆయన శ్రీహరికోటలోని మీడియా సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎల్‌విఎం3-ఎం6 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్2 వాణిజ్య ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టామని తెలిపారు. చంద్రయాన్-4, 5తో పాటు వీనస్ మిషన్, మరెన్నో ప్రయోగాలు, గగన్‌యాన్, మానవరహిత ప్రయోగం, ఎయిర్ స్పేస్ స్టేషన్ ప్రయోగాలకు ఈ రాకెట్ ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రస్తుతం జరిగిన ప్రయోగం అత్యంత కఠినమైనదని, భారత భూభాగం నుంచి అత్యంత బరువైన ఉపగ్రహాన్ని రోదశిలోకి పంపడం ఇదే ప్రథమమని చెప్పారు. నవంబర్ 2వ తేదీన ప్రయోగం జరిగిన తర్వాత 52 రోజుల్లో తిరిగి భారీ ప్రయోగం చేపట్టి అది విజయవంతం చేయడం ఇస్రో శాస్త్రవేత్తల కృషికి నిదర్శనమన్నారు. నాసా, ఇస్రో సంయుక్త ఆధ్వర్యంలో 10,300 కోట్ల రూపాయలతో బ్రాడ్‌బ్యాండ్ సేవలను విస్తరించేందుకు ప్రత్యేకమైన యాంటెన్నా నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధమైనట్లు నారాయణన్ చెప్పారు.

## ప్రభాకర్‌రావు పెన్‌డ్రైవ్, హార్డ్‌డిస్క్ స్వాధీనం

### ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో మలుపు

**హైదరాబాద్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు బుధవారం కీలక మలుపు తిరిగింది. ప్రభాకర్ రావు ను ంచి ఫోన్ ట్యాపింగ్ సమాచారం వున్న పెన్ డ్రైవ్‌తో పాటు హార్డ్ డిస్క్‌ను సిట్ బృందం స్వాధీనం చేసుకుందని సమాచారం. ఇందులో ఫోన్ ట్యాపి ంగ్‌కు సంబంధించిన కీలక సమాచారాన్ని సిట్ అధికారులు వెలికితీసినట్లుగా తెలిసింది. ఈ సమాచారం ఆధారంగా మరికొందరు బ్యూరోక్రాట్లతో పా టు బిఆర్ఎస్ ముఖ్యులకు సిట్ తాఖీదులు జారీచేసి విచారించే వీలుంది. మరోవైపు ప్రభాకర్ రావు కస్టడీ గురువారంతో ముగియనుండడంతో పాటు శుక్రవారం ఉదయం విడుదల చేయాల్సి న తరుణంలో ఆయన కస్టడీని మరోదఫా పొడిగించాలని లేదా లై డిటెక్టర్ పరీక్షలకు అనుమతివ్వాలని సర్కా రు సుప్రీం కోర్టులో పిటిషన్ వేయనుందని తెలిసింది.

రాష్ట్రంలో రాజకీయంగా దుమారం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు చివరి దశకు చేరింది. రెండు వారాలుగా పోలీసు కస్టడీలో వున్న ప్రభాకర్ రావు పె ద్దగా ఎలాంటి సమాచారం పోలీసులకు వెల్లడించలేదని తెలిసింది. అయితే ఆయన వద్ద ఫోన్ ట్యాపింగ్ సమాచారం వున్న పెన్ డ్రైవ్‌తో పాటు హా ర్డ్ డిస్క్‌ను సిట్ అధికారులు బుధవారం ఉదయం జప్తు చేసినట్లు తెలిసింది. ప్రభాకర్ రావు మిత్రుడు ఒకరి వద్ద నుంచి వీటిని జప్తు చేసినట్లు తెలి సింది. వీటిని వెంటనే విశ్లేషించిన సిట్ అధికారులకు అందులో కీలక సమాచారం లభ్యమైనట్లు తెలిసింది. ఇందులో ఫోన్ ట్యాపింగ్ జరిగిన సమ యంలో ఏం జరిగిందనే విషయంతో పాటు ఎవరెవరి ఫోన్లు ట్యాపింగ్ జరిగాయి...? ఎంతకాలం జరిగాయి..? దీనివల్ల ఎవరికి లబ్ది చేకూరింది ...? ట్యాపింగ్‌లో పాల్గొన్న అధికారులు ఎవరు...? ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ జరిగింది...? అనే సమాచారం వుందని తెలిసింది. ఈ సమాచారం అంతా ప్రభాకర్ రావు స్నేహితుడి వద్ద లభ్యమైన పెన్ డ్రైవ్, హార్డ్ డిస్క్‌లో వుందని తెలిసింది. ఈ సమాచారం ఫోన్ ట్యాపింగ్‌కు సం బంధించిన విచారణలో సిట్ అధికారులకు మరింత ఉపయోగపడుతుందని తెలిసింది. ఈ సమాచారం ఆధారంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిన సమయ ంలో పోలీసు శాఖతో పాటు సచివాలయంలో కీలక స్థానాల్లో వున్న బ్యూరోక్రాట్లను విచారించేందుకు సిట్ సమాయాత్తమవుతోంది. వీరిన విచారిం చిన తరువాత అప్పట్లో పాలకులుగా వున్న బిఆర్ఎస్ ముఖ్యులకు తాఖీదులు జారీ చేసి విచారించే వీలుంది. వీరు వెల్లడించే అంశాల ప్రకారం త రువాత ఏం చేయాలనే దానిపై సిట్ నిర్ణయించే వీలుంది.

**మరోదఫా కస్టడీ లేదా లై డిటెక్టర్ పరీక్షలు కోరనున్న సర్కారు:** ఇదిలావుండగా ప్రభాకర్ రావు పోలీసు కస్టడీ గురువారం సాయంత్రంతో ముగియనుండడంతో ఆయనను మరో దఫా కస్టడీ లేదా లై డిటెక్టర్ ప రీక్షలకు పిటిషన్ వేయాలని సర్కారు భావిస్తున్నట్లు తెలిసింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు రెండు వారాలుగా ఆయన పోలీసు కస్ట డీలో వుండడం తెలిసిందే. మొదట వారం రోజుల పాటు ప్రభాకర్ రావును విచారించిన పోలీసు అధికారులు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మరో వారం రోజులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. మొదటి దఫా విచారణకు ఎసిపి స్థాయి అధికారి నేతృత్వంలో విచారణ సాగగా రెండవ దఫా విచారణ సిటీ కొత్వాల్ సజ్జన్నార్ నాయకత్వంలోని సిట్ బృందం విచారించింది. ఇందులో ముగ్గురు ఐపిఎస్ అధికారులతో పాటు సాంకేతిక అం శాలపై పట్టువున్న మరో ఐదుగురు అధికారులున్నారు. అయితే రెండవ దఫా విచారణలో ఆయన నుంచి పెన్ డ్రైవ్, హార్డ్ డిస్క్ వంటివి లభ్యమవ డం మినహా పెద్దగా సమాచారం రాకపోవడంతో ఆయనను మరోదఫా కస్టడీకి ఇవ్వాలని పోలీసు శాఖ తరపున సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలయ్యే వీలుందని తెలిపింది. ఒకవేళ ఇందుకు సుప్రీం కోర్టు అంగీకరించకుండే లై డిటెక్టర్ పరీక్షలకు అనుమతించాలని కోరే వీలుంది,

## 15 గ్రామాల్లో మహిళలు స్మార్ట్‌ఫోన్ వినియోగంపై నిషేధం

### రాజస్థాన్ జాలోర్ జిల్లాలో గ్రామపెద్దల 'ఫోన్' పంచాయితీ

**జాలోర్(రాజస్థాన్), డిసెంబరు 24:** ప్రపంచం మొత్తం 6జివైపు దూసుకుపోతుంటే రాజస్థాన్‌లోని జాలోర్ జిల్లాలోని 15 గ్రామాలు మాత్రం స్మార్ట్‌ఫోన్ వినియోగంపై ఆంక్షలు పెట్టాయి. గ్రామాల్లోని మహిళలు కేవలం కీప్యాడ్‌ఫోన్లు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. సంధమాత పట్టి పంచాయత్‌లోని చౌదరి కమ్యూనిటీ ఈమేకు మహిలలు, బాలికలు స్మార్ట్‌ఫోన్లు వినియోగించకూడదని నిషేధం విధించింది. దీనివల్ల మొబైల్‌ఫోన్లకు బానిసలవుతున్నారని గ్రామపెద్దలు ఆరోపిస్తు చిన్నారుల్లో కంటిచూపులోపాలు కూడా పెరుగుతున్నట్లు చెప్పారు. వచ్చేనెల 26వ తేదీనుంచి ఈ నిషేధం నిర్ణయాలు అమలులో ఉంటాయి. మహిలలు కేవలం కీపాడ్‌ఫోఢ్ల మాత్రమే వినియోగించాలి. అలాగే పెళ్లిళ్లు ఇతర శుభకార్యాలయాలకు ఫోన్లు కూడా తీసుకువెళ్లకూడదు. ఇరుగుపొరుగు ఇళ్లకు వెళ్లినా వెంట ఫోన్లు తీసుకెళ్లకూడదని ఆంక్షలు విధించారు. ఇందుకు సంబంధించిన పంచాయతీ తీర్మానం చదువుతున్న పెద్దతోపాటు ఇతర పెద్దల విడియో ఆన్‌లైన్‌లో వైరల్ అయింది. కెమేరా ఉన్న ఫోన్లు మహిలలు వాడకూడదు. మాట్లాడేందుకు కెమేరాలేని కీపాడ్‌ఫోన్లుమాత్రమే వాడాలి. విద్యార్థినులు ఇళ్లనుంచి వెళ్లేటపుడు బయటకు ఫోన్లు తీసుకెళ్లకూడదు. పాఠశాల వెళ్లే బాలికలు మాత్రం ఇంట్లో ఫోన్లు వాడుకోవచ్చు. బయటి ఫంక్షన్లకు వీటిని తీసుకెళ్లకూడదు. మహిళలకు స్మార్ట్‌ఫోన్లు ఉండటం వల్ల పిల్లలు వాటిని తీసుకుని బానిసలవుతున్నారని అందువల్లకంటిచూపు లోపిస్తోందని పెద్దలు చెపుతున్నారు. గాజిపూర్‌గ్రామంలోజరిగినీ పంచాయతీలో తీర్మానం చేసారు. పట్టి కులానికి చెందిన అద్యక్షుడు సుజన్‌రామ్ చౌదరి ఈ తీర్మానం ప్రతిపాదించారు. ఈ కులపెద్దల నాయకత్వం ప్రకారం పంచ్ హిమమ్మతరం ఈ తీర్మానాన్ని చదివి వినిపించారు. ఈ నిర్ణయం ఇతర గ్రామాల్లోకూడా అమలుచేస్తున్నారు. భిన్మల్ ప్రాంతంలోని ఘాజిపూర్, పావాలి, కల్డా, మనోజ్‌ఉయావాస్, రాజికవాస్, దాట్లవాస్, రాజ్‌పుర, కోడి, సిద్‌రోడి, ఆల్డి, రోప్సి, ఖండేల్వాల్, సావిధర్, హత్మికి ధని, ఖాన్‌పూర్ తదితర పంచాయితీల్లోకూడా ఈతీర్మానం అమలవుతోంది. సోషల్‌మీడియాలో తీవ్రస్థాయి విమర్శలు వెల్లువెత్తాయి.మహిళా హక్కుల సంఘాలు కూడా విమర్శించాయి. మహిళా వ్యతిరేకిగా ఈ తీర్మానం ఉందని, మహిళలపై ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు పెరిగాయి.

# పిపిపి విధానంపై ముందుకే

>> ద్వారా అరుణాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఆసుపత్రులు, వైద్య కళాశాలు నిర్మించేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ఇప్పటికే అనుమతులు ఇచ్చిందని చెప్పారు. ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రం పీపీపీ విధానాన్ని ప్రోత్సాహిస్తోందని అధికారులు వివరించారు. దీని ద్వారా వైద్య కళాశాలలు, ఆసుపత్రుల వంటి కీలక ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతం కావడమే కాకుండా, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కేంద్రం అభిప్రాయ పడినట్లు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు.

**ఆదోని మెడికల్ కాలేజ్ నిర్మాణానికి టెండర్ల దాఖలు**

రాష్ట్రంలో ప్రభుత్వం పీపీపీ విధానంలో నిర్మించ తలపెట్టిన మెడికల్ కాలేజీలను ముందుకు తీసుకువెళ్లేందుకు అవసరమైన కార్యాచరణతో పనిచేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏపీలో పీపీపీ విధానంలో చేపట్టిన మెడికల్ కాలేజీల నిర్మాణానికి కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా వీజీఎఫ్ సహ ఇతర ప్రోత్సాహకాలు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వం తొలి విడతగా ఆదోని, మదనపల్లి, పులివెందుల, మార్కాపురం మెడికల్ కాలేజీలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను అధికారులు సీఎంకు వివరించారు. నాలుగు మెడికల్ కాలేజీలకు పీపీపీ విధానంలో నిర్మించి, నిర్వహించేలా సెప్టెంబరు 18న ప్రభుత్వం టెండర్లు పిలిచిందని... అక్టోబర్ 6వ తేదీన నిర్వహించిన ప్రీబిడ్ సమావేశానికి 6 జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పాల్గొన్నాయని అధికారులు తెలిపారు.

క్షేత్ర స్థాయిలో బిడ్డర్ల పర్యటన..

కొందరు బిడ్డర్లు ప్రాజెక్ట్ స్థలాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను అంచనా వేసుకునేందుకు కొంత సమయం కావాలని కోరారన్న విషయాన్ని అధికారులు సీఎం చంద్రబాబు దృష్టికి తెచ్చారు. కొందరు రెండవ ప్రీబిడ్ సమావేశాన్ని నిర్వహించాలని కూడా అభ్యర్థించారని... బిడ్డర్ల అభ్యర్థన మేరకు అధికారులు ఆయా సంస్థల ప్రతినిధులకు సైట్ విజిట్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం అక్టోబర్ 23న నిర్వహించిన రెండవ ప్రీబిడ్ సమావేశంలో కూడా బిడ్డర్లు పాల్గొన్నారని... రెండు దశల ప్రీబిడ్ సమావేశాల అనంతరం నాలుగు సంస్థలు మరింత సమాచారం కోరాయని అధికారులు వివరించారు. ప్రతి ప్రాజెక్టుకు గరిష్టంగా 50 ఎకరాల కేటాయింపు, డిజైన్ల వివరాలు వంటి అంశాలపై చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని... వీలీది నిబంధనలు అనుసరించి, భూమిని సమర్థవంతంగా వినియోగించుకునేలా డిజైన్లను రూపొందించుకునే స్వేచ్ఛ ఇవ్వాలని, కన్సార్టియం సభ్యుల సంఖ్యను 2 నుండి 3కి పెంచాలని కూడా బిడ్డర్లు కోరితే అంగీకరించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఇదే సందర్భంలో ఆదోని మెడికల్ కాలేజ్ నిర్మాణానికి ఓ సంస్థ ముందుకు వచ్చిందని తెలిపారు. ముందుకు వచ్చిన సంస్థతో ఒప్పందం చేసుకుని కాలేజ్ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను సూచించారు. అలాగే మిగిలిన కాలేజీలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు.బిడ్డర్లతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**సంజీవిని ప్రాజెక్టుపై సమీక్ష..**

కుప్పంలో పైలెట్ గా చేపట్టిన సంజీవని ప్రాజెక్టు అమలు పైనా సీఎం అధికారులతో చర్చించారు. త్వరలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టును అమలు చేసేలా అధికారులు ఎలాంటి కసరత్తు చేస్తున్నారని సీఎం ఆరా తీశారు. కుప్పంలో ఎదురైన అవరోధాలను అధిగమిస్తూ... వాటికి పరిష్కారం చూపేలా చిత్తూరు జిల్లాలో సంజీవని ప్రాజెక్టును అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులు ఇచ్చేలా రూపొందించిన ఈ ప్రాజెక్టును ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకుంటూ వెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు.

# గ్రామాల్లోను అన్న క్యాంటీన్లు

>> యోచనలో ప్రభుత్వం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లో 205 అన్న క్యాంటీన్లు ప్రారంభించి కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. వీటిలో రోజూ మూడు పూటలా కలిపి 2 లక్షల మందికిపైగా ప్రజలు భోజనం చేస్తున్నారు. ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని పూటకు రూ.5కే అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్యేల విజ్ఞప్తి నేపథ్యంలో ప్రభుత్వం మరో 70 క్యాంటీన్లను మంజూరు చేసింది. పట్టణాలు, నగరాల్లో కొనసాగుతున్న 205 అన్న క్యాంటీన్ల ద్వారా ఇప్పటి వరకు 7.20 కోట్ల మందికిపైగా పేదలకు ఆహారం అందించారు. వీరిలో 3.16 కోట్ల మంది మధ్యాహ్న భోజనం చేయగా, 2.62 కోట్ల మంది ఉదయం అల్పాహారం, 1.42 కోట్ల మంది రాత్రి అల్పాహారం పొందారు. విశాఖపట్నం, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో అన్న క్యాంటీన్లకు అత్యధిక స్పందన లభిస్తోంది.

## గిరిజన ప్రాంత ఆసుపత్రులకు డ్రోన్ల ద్వారా మందులు

### నెలాఖరు నుంచి ప్రారంభం

>> బ్లడ్ యూనిట్స్ పంపిణీ చేసేందుకు వీలుగా ఈ ఒప్పందం జరిగింది. ఇప్పటికే అరుణాచల్ ప్రదేశ్‌లో విజయవంతంగా సేవలు అందిస్తున్న సదరు సంస్థ, రాష్ట్రంలో ఖిప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్‌ఖి కింద మొదటి 67 నెలల పాటు ఉచితంగా సేవలు అందించడానికి అంగీకరించింది. ఈ ఒప్పందం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండ్యన్, సదరు సంస్థ ప్రతినిధి కుందన్ మాదిరెడ్డి మధ్య కుదిరినట్లు వైద్య ఆరోగ్య శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

**పాడేరు కేంద్రంగా కార్యకలాపాలు:** పాడేరును ప్రధాన కేంద్రం (హబ్)గా చేసుకుని, 60 నుంచి 80 కిలోమీటర్ల పరిధిలోని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు డ్రోన్ సేవలు అందుతాయి. ఈ డ్రోన్లలో మందులు మరియు వ్యాక్సిన్లు పాడవకుండా ఉండేలా కోల్డ్ చైన్ సదుపాయం కూడా ఉంటుంది. ఒక్కో డ్రోన్ సుమారు 2 కిలోల బరువును మోసుకెళ్ళే సామర్థ్యంతో పనిచేస్తుంది. ఈ డ్రోన్లు కేవలం మందులు తీసుకెళ్లడమే కాకుండా, తిరిగి వచ్చేటప్పుడు రోగుల నుంచి సేకరించిన రక్త, మల, మూత్ర నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు తీసుకొస్తాయి. వచ్చే నెలాఖరు నుంచి ఈ సేవలు ప్రారంభమవుతాయని కమీషనర్ వీరపాండ్యన్ తెలిపారు.

**త్వరలో కెజిహెచ్ నుండి పాడేరుకు:** గిరిజన కొండ ప్రాంతాల్లో రోడ్డు మార్గాల ద్వారా మందులు పంపడం సమయంతో కూడుకున్న పని. అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా డ్రోన్ల వినియోగంపై కూటమి ప్రభుత్తం దృష్టి పెట్టింది. భవిష్యత్తులో ఈ సేవలను విశాఖ కేజీహెచ్ నుంచి పాడేరుకు మందుల రవాణాకు కూడా విస్తరింపచేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

## అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ టెండర్‌పై పిల్.. కొట్టివేసిన హైకోర్టు

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటు కోసం ఖరారు అయిన టెండర్ పై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఆ పిల్‌ను విచారించిన హైకోర్టు కొట్టేసింది. నోటిఫికేషన్ జారీ చేసిన ఏడాది తరువాత అందులోని నిబంధనలను సవాల్ చేయడం ఏమిటని పిటిషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ఎల్ 1గా నిలిచిన బీఎస్సార్ సంస్థతో పాటు మొత్తం మూడు సంస్థలు బిడ్డింగ్‌లో పాల్గొన్నాయని ధర్మాసనం గుర్తుచేసింది ఎల్ 1గా నిలిచిన బీఎస్సార్ ఇన్‌ఫ్రాటెక్‌కు టెండర్ కేటాయిస్తే తప్పేముందని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వం తరుపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. పిటిషనర్ తరుపున న్యాయవాది మెట్ల చంద్రశేఖర్ వాదించారు. నచ్చిన వారిని ఎంపిక చేసుకునే విధంగా టెండర్ నోటిఫికేషన్‌లో నిబంధనలు పెట్టారని పిటిషనర్ తరుపు న్యాయవాది మెట్ల చంద్రశేఖర్ పేర్కొన్నారు. పిల్ దాఖలు చేసే ముందు పిటిషనర్ కనీసం అధ్యయనం చేయలేదని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు.. టెండర్ నిబంధనలపై అభ్యంతరం ఉంటే పాల్గొన్న సంస్థలు కోర్టును ఆశ్రయించాలి కాని, అడ్వకేట్ ముసుగులో పిల్ వేయ డానికి వీలులేదని దమ్మాలపాటి వాదించారు. దీంతో హైకోర్టు ఆ పిల్‌ను కొట్టేస్తూ తీర్పునిచ్చింది.

## అరుణాచల్‌పై చైనా రాజీలేని ధోరణి

### యుఎస్ రక్షణ వ్యవస్థ పెంటగాన్ నివేదిక

**ఇటానగర్, డిసెంబరు 24:** అరుణాచల్ ప్రదేశ్ తమకెంతో ముఖ్యమని, రాజీపడని ప్రయోజనాల్లో ఒకటిగా చైనా భావిస్తోందని అమెరికన్ కాంగ్రెస్‌కు సమర్పించిన నివేదికలో పెంటగాన్ పేర్కొంది. 2049 నాటికి జాతీయ పునరుజ్జీవనాన్ని సాధించాలనే లక్ష్యంతో చైనా ఉందని నివేదిక వెల్లడించింది. చైనా తన నాయకత్వ పరిధిని విస్తరించాలని భావిస్తున్నట్లు పెంటగాన్ అభిప్రాయపడింది. తైవాన్, సెంకాకు ద్వీపాలతో పాటు అరుణాచల్ ప్రదేశ్ కూడా బీజింగ్ యొక్క విస్తృత జాతీయ భద్రతా ప్రణాళికల్లో భాగమని తెలిపింది. ఈ భూభాగాలు చైనా జాతీయ పునరుజ్జీవనానికి కీలకమని డ్రాగన్ భావిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. చైనా కమ్యూనిస్టు పాలనను వ్యతిరేకించిన హాంగ్‌కాంగ్, టిబెట్, తైవాన్ రాజకీయ నాయకులను వేర్పాటువాదులుగా ముద్ర వేసినట్లు కూడా నివేదిక తెలిపింది. వాస్తవాధీన రేఖ వెంబడి ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ భారత్, చైనా మధ్య కుదిరిన గస్తీ ఒప్పందం గురించి పెంటగాన్ తన నివేదికలో ప్రస్తావించింది. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగించడానికి చైనా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పెంటగాన్ నివేదిక పేర్కొంది. అమెరికా, భారత్ మధ్య సంబంధాలు మరింత బలపడకుండా ఉండేలా చైనా జాగ్రత్త పడుతోందని వివరించింది. జాతీయ పునరుజ్జీవనానికి బీజింగ్ మూడు ప్రధాన ప్రయోజనాలను లక్ష్యంగా పెట్టుకుందని, చైనా కమ్యూనిస్టు పార్టీపై నియంత్రణ, దేశ ఆర్థికాభివృద్ధి, సార్వభౌమాధికారం, ప్రాదేశిక వాదనలు కొనసాగించడం వంటివి ముఖ్యంగా భావిస్తున్నట్లు పెంటగాన్ నివేదికలో విశ్లేషించింది.

## తైవాన్‌లో తీవ్రస్థాయి భూకంపం: రిక్టర్‌స్కేలుపై 6.1గానమోదు

**తైపేయి, డిసెంబరు 24:** తైవాన్ లో భారీ భూకంపం సంభవించింది. ఆగ్నేయ తీరప్రాంత కౌంటీ అయిన టైటుంగ్ లో బుధవారం భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 6.1గా నమోదైంది. ఈ ప్రభావంతో రాజధాని తైపీ లో భవనాలు కుప్పకూలిపోయాయి. అయితే, ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ ప్రకారం భూకంపం భూమికి 11.9 కిలోమీటర్ల లోతులో నమోదైంది.



బుధవారం స్వర్ణాంధ్ర-2047, 10 సూత్రాల అమలుపై నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

# పది సూత్రాలే స్వర్ణాంధ్ర సాధనకు కీలకం

### 20 లక్షల ఉద్యోగాల కల్పనకే మొదటి ప్రాధాన్యత

### స్వర్ణాంధ్ర-2047, 10 సూత్రాల అమలుపై నోడల్ అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష

**విజయవాడ డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి** స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సులో భాగంగా పౌరులకు మెరుగైన సేవలు వేగంగా అందించేందుకు ప్రతీ ప్రభుత్వ శాఖ ఇండికేటర్లను సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధన కోసం రూపొం దించిన పది సూత్రాలను పది మిషన్లుగా నిర్దేశించుకుని పనిచేయాలని సీఎం సూచించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు, పది సూత్రాల అమలుపై సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయా శాఖల నోడల్ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. మిషన్ ఫ్రేమ్ వర్క్ రూపకల్పన, ఆయా ప్రభుత్వ శాఖలు మెరుగైన పనితీరు కోసం ముఖ్యమైన ఇండికేటర్లను గుర్తించి వాటికి అనుగుణంగా పనిచేయాలని సీఎం సూచించారు. జీరో పావర్టీ మిషన్లో భాగంగా పీ4 విధానాన్ని ముందుకు తీసుకెళ్లటంతో పాటు వాటి అమలును విజన్ మానిటరింగ్ యూనిట్ల ద్వారా పర్యవేక్షి ంచాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతీ కుటుంబమూ సాధికారిత సాధించాలని అలాగే వ్యక్తులకు ఆర్థిక భద్రత కల్పించటమే ఈ మిషన్ ముఖ్య లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టే వివిధ సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రంలో ఉన్న దాదాపు 30 లక్షల బీపీఎల్ కుటుంబాలకు ఎంత ప్రయో జనం కలిగిందో అంచనా వేయాలని సూచిం చారు. పాపులేషన్ మేనేజ్మెంట్ కు సంబంధించి ఓ విధానాన్ని రూపొందించాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. నైపుణ్యాలు ఉద్యో గాల కల్పన అనేది అత్యంత ప్రాధాన్యత అం శంగా తీసుకోవాలని సూచించారు. మొట్టమొదటి ప్రాధాన్యతగా 20 లక్షల ఉద్యోగాలను కల్పించటమే లక్ష్యంగా పని చేయాలన్నారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో ఉంచాలని సూచించారు. పది సూత్రాలకు సంబంధించిన అంశాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని అన్నారు. కీలక మిషన్ గా నీటి భద్రత అంశంపైనా ప్రధానంగా దృష్టి పెట్టాలన్నారు. నీటి వనరుల సమర్ధ వినియో గంతో పాటు నీటి ఆడిట్ నిర్వహించాలని సూచించారు. నీటి వినియోగంలో ఎక్కడా వివాదాలు లేకుండా చూడాలని.. రెండు తెలుగు రాష్ట్రాలూ సస్యశ్యామలంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. టెక్నాలజీ వినియోగంతో సాగు వ్యయం తగ్గేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. డిమాండ్ ఆధారిత పంటల ఉత్పత్తి, కోల్డ్ చైన్, ఫుడ్ ప్రాసెసింగ్ లాంటి అంశాలపై దృష్టి పెట్టి రైతులకు ప్రయోజనం కలిగేలా చూడాలన్నారు.

**ఇండికేటర్లు ఆధారంగా లక్ష్యాలు:** రాష్ట్రంలో రవాణా వ్యయాన్ని గణనీయంగా తగ్గించేలా లాజిస్టిక్స్ రంగాన్ని తీర్చిదిద్దాలని సీఎం స్పష్టం చేశారు. రోడ్లు, రైలు, అంతర్గత జలరవాణా, సీ కార్గో, ఎయిర్ కార్గో లాంటి అంశాలతో పాటు కోల్డ్ చైన్ లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు లాజిస్టిక్స్ మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. విద్యుత్, ఇంధన వ్యయాల తగ్గించే అంశంపై కూడా దృష్టి పెట్టాలని ఉత్పత్తిదారు వినియోగదారు అనే విధానంలో అలోచన చేయాలని సూచించారు.

రాష్ట్రంలో తయారయ్యే ఉత్పత్తుల నాణ్యత అనేది కీలకమైన అంశమని ప్రాడెక్టు పర్ఫెక్షన్ తో పాటు మేడ్ ఇన్ ఆంధ్రా బ్రాండ్ ను ప్రపంచవ్యాప్తం చేసేలా స్పష్టమైన విధానం ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అలాగే స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సంబంధించి కేంద్ర నిధుల్ని సమర్ధంగా వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఆర్గానిక్ కూరగాయల ఉత్పత్తి చేయాలని ఆలోచన చేస్తున్నట్టు సీఎం వెల్లడించారు.

ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్, సహా నోడల్ ఆఫీసర్లుగా ఉన్న వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డైట్ కళాశాలలో విషాదం

# వసతిగృహంలో ఉరి వేసుకుని మహేష్ బలవన్మరణం

### ఆర్థిక సమస్యలే కారణం?



కూనేటి మహేష్(ఫైల్)

**నెల్లిమర్ల (విజయనగరం జిల్లా), డిసెంబరు 24 ప్రభాతవార్త:** స్థానిక వేణు గోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాల విద్యార్థి కూనేటి మహేష్(24) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కళాశాల సమీపంలో ఉన్న వసతిగృహంలోని రీడింగ్ రూమ్‌లో ఉరి వేసుకుని చనిపోయాడు. మంగళవారం అర్ధ రాత్రి చనిపోగా, బుధవారం ఉదయం 6 గం టలకు తోటి విద్యార్థులు గమనించారు. విజ యనగరం రూరల్ ఎస్సై అశోక్ కుమార్, విద్యార్థులు అందించిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు మండలం జిల్లేడువలస గ్రామానికి చెందిన మహేష్ డిగ్రీ పూర్తిచేసిన అనంతరం 2024లో ఉపాధ్యాయ శిక్షణ నిమిత్తం డైట్ కళాశాలలో చేరాడు. డైట్ క్యాంపస్‌లోనే ఉన్న బాలుర వసతిగృహంలో తోటి విద్యార్థులతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం రాత్రి వసతిగృహంలో ఉన్న రీడింగ్ రూమ్‌లో సహ విద్యార్థులతో కలిసి చదువుకున్నాడు. అందరూ గదుల్లోకి వెళ్లిపోయినా మహేష్ మాత్రం అక్కడే ఉండిపోయాడు. రాత్రంతా రూమ్‌కు రాకపోవడంతో ఉదయం 6 గంటలకు ఆయన రూమ్మేట్స్ రీడింగ్ రూమ్‌కు వెళ్ళి చూశారు. అప్పటికే మహేష్ ఉరి వేసుకొని చనిపోయి ఉన్నాడు. సమాచారం అందుకున్న విజయనగరం రూరల్ ఎస్సై అశోక్ కుమార్ తన సిబ్బందితో కలిసి వసతిగృహాన్ని సందర్శించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఆర్‌జె డి విజయ్ భాస్కర్, డీఈఓ మాణిక్యం నాయుడు, రిటైర్డ్ డీఈఓ డాక్టర్ ఎన్ టి నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిపై ఆరా తీశారు. మహేష్ మృతి పట్ల ప్రిన్సిపల్ రామకృష్ణారావు, అధ్యా పకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా మహేష్ మృతికి స్పష్టమైన కారణాలు తెలియరాలేదు. మహేష్ సూసైడ్ నోట్ రాసినట్లు తెలిసింది. ఆ నోట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కుటుంబ, ఆర్థిక సమ స్యలు కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లుతెలుస్తోంది. విషయం తెలుసుకున్న తల్లి,బంధువులు డైట్ కళాశాలకు చేరుకుని బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజన ఆసుపత్రికి తరలించి, అనంతరం మృతదేహాన్ని బంధువులు స్వగ్రామానికి తరలించారు.

## పాస్టర్లకు క్రిస్మస్ కానుక

>> దీంతో ఒక్కో పాస్టర్‌కు నెలకు రూ.5,000 చొప్పున ఒకొక్కరికి 12 నెలల మొత్తం రూ. 60,000 అందించింది.

## వారం - వర్జ్యం

25-12-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
పంచమి మ.1.39
ధనిష్ఠ ఉ.8.17, మూల కార్తె
వర్జ్యం : మ.3.41-5.20
దు.ఉ.10.17-11.02, 2) మ.2.44-3.29
శుభసమయం :ఉ.8.15-9.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:**తప్పుకు తిరగకుండా ప్రతి సవాలును ధైర్యంగా ఎదుర్కొని అనుకూల ఫలితాలు సాధిస్తారు. మీలో దాగివున్న నైపుణ్యం వెలుగులోనికి వస్తుంది.

**వృషభం:**అన్ని పనులు మీరే స్వయంగా చూసుకోవలసి వస్తుంది. మీకు అనుకూలాంశాలు ఎక్కువగా ఉంటాయి.

**మిథునం:** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వివాహ యత్నాలు లభిస్తాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం:**నూతన కాంట్రాక్టులకు సంబంధించి ఒప్పందాలు చేసుకుంటారు. విహార యాత్రలు చేస్తారు.

**సింహం:** నూతన పెట్టుబడులకు అనుకూల కాలం. ఉద్యోగులకు పదో న్నతులు పొందుతారు. ప్రయాణాలు జాగ్రత్త.

**కన్య :**విద్యావకాశాలు పొందుతారు. సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కుంటారు. వస్త్రలాభం.

**తుల :** ఆస్తి వివాదాలు తీరి లబ్ది పొందుతారు. పదవులలో, హెూదాలు లభించటానికి సమయం పడుతుంది.ఇంటా బయటా ప్రోత్సాహం.

**వృశ్చికం:** పాతబాకీలు వసూలవుతాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. వివాహ యత్నాలు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**ధనుస్సు:** పెద్దల శ్రేయోభిలాషులు ఇచ్చిన సలహాలు పాటించటానికి కాలం కలిసి రాదు. క్రయ విక్రయాలకు దూరంగా వుండండి.

**మకరం:** విదేశాలలోని మీ సన్నిహితుల క్షేమ సమాచారం ప్రశాంతతకు కారణం అవుతుంది. ధన లాభం.బంధువుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

**కుంభం:** సంక్షేమ సంఘాల వలన లాభ పడతారు. మీ మేధస్సుతో ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుంటారు.ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మీనం:** చాలాకాలంగా పరిష్కారం కాని కుటుంబ సమస్యలు ఈ రోజు పరిష్కారమవుతాయి.వాహన సౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

25-12Pg3exHMNWJQELKC 3 OG_25-12Pg3exHMNWJQELKC.qxd 24/Dec/25 11:51 PM Page 1



## హోల్డ్ వాహనాల ఫిట్‌నెస్ చార్జీల పెంపు

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం రూ.1,300 ఉన్న ఫిట్‌నెస్ ఛార్జీలను ఒకేసారి రూ.33 వేలకు పెంచుతూ జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం హోల్డ్‌లో పెట్టడంతో లారీ యజమానులకు భారీ ఊరట లభించిందని ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వైవి ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిట్‌నెస్ ఛార్జీలు రాష్ట్రంలో అమలు చేయొద్దని తాము సిఎం చంద్రబాబు, మంత్రి, రవాణాశాఖ అధికారులను ఇటీవల కలిసి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు తమ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

## దూడపై దాడి చేసి చంపిన రేసు కుక్కలు

**గుడిపాల, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా గుడిపాల మండలం వెప్పాలమానుచేను గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఓ దూడను తీవ్రంగా గాయపరచి చంపివేయడంతో ఆ గ్రామస్తులకు చిరుత భయం వెంటాడింది. అయితే అటవీశాఖ అధికారులు వచ్చి దూడను చంపినది రేసు కుక్కలను నిర్ధారించడంతో అప్పటి వరకు భయాందోళనలు చెందిన గ్రామస్తులు స్థిమితపడ్డారు. వివరాలిలా వున్నాయి. గ్రామానికి చెందిన శివశంకర్ అనే రైతు దూడ బుధవారం తెల్లవారుజాము మేతకు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంకు వెళ్ళింది. ఈ క్రమంలో అటవీ సమీపంలోని పొలంలోకి ఎదో ఒక మృగం ప్రవేశించి గడ్డి మేస్తున్న దూడపై తీవ్రంగా దాడి చేసి చంపివేసింది. ఆ మృగం దూడ శరీరంలోని సగం మాంసంను భుజించివేయడంతో అక్కడికి చేరుకున్న గ్రామస్తులు తమ ప్రాంతానికి చిరుత వచ్చి దూడపై దాడి చేసి దాని శరీరంను తినివేసిందని ఆందోళన చెందిన సమాచారంను ఫారెస్టు అధికారులకు అందజేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కుసుమ సంఘటనా స్థలం చేరుకుని మృతి చెందిన దూడ ప్రక్కన వున్న కాళ్ళ గుర్తులను పరిశీలించి తనకు సైతం అనుమానం రావడంతో పశుసంవర్ధకశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు అక్కడికి చేరుకున్న పశుసంవర్ధకశాఖ అధికారులు దూడను చంపింది చిరుతపులి కాదని, రేసు కుక్కలని నిర్ధారించారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కుసుమ మాట్లాడుతూ అటవీ పరిసరాల్లో గ్రామం వుండటంతో గ్రామస్తులు నిత్యం అప్రమత్తంగా వుండాలని, రాత్రి సమయాల్లో పశువులను పొలాల వద్దకు వెళ్ళనీయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# నకిలీ దర్శన టోకెన్లతో వస్తే కేసులు తప్పవు



ఇ డిప్ టోకెన్లుంటేనే దర్శనానికి అనుమతి

డ్రోన్‌కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ

తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీసుబ్బరాయుడు

**తిరుమల,డిసెంబర్ 24ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఇప్పటికే టిటిడి ఆన్‌లైన్‌లో జారీచేసిన ఇడిప్ దర్శన టోకెన్లు పొందిన భక్తులను మాత్రమే ఆలయంలోనికి అనుమతిస్తామని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్,జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు స్పష్టం చేశారు. టోకెన్లు లేని భక్తులు డిసెంబర్ 30,31,జనవరి 1తేదీల్లో తిరుమలకు వచ్చినా ఆలయంలోనికి వెళ్ళేందుకు అవకాశం లేదని తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి సంయమనంతో, నిబంధనల మేరకు తిరుమలకు చేరుకున్నా పవిత్రంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే, నకిలీ దర్శన టోకెన్లతో తిరుమలకు వస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి పోలీసుశాఖ పరంగా తీసుకున్న చర్యలు, భద్రత, క్యూలైన్ల నియంత్రణపై బుధవారం ఉదయం తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మీడియాతో పలు అంశాలపై చర్చించారు. తొలిమూడురోజులు 30వతేదీ వైకుంఠ ఏకాదశి, 31న ద్వాదశి పర్వదినాలతోబాటు జనవరి 1న దర్శన టోకెన్లు ఉన్న భక్తులనే ఆలయంలోనికి అనుమతించడంజరుగుతుందన్నారు. ఈ విషయాన్ని భక్తులు అందరూ తెలుసుకుని తిరుమలకు చేరుకోవాలని కోరారు. జనవరి 2 వతేదీ నుండి 8వరకు సాధారణ సర్వదర్శనంలో భక్తులను అనుమతించడం జరుగుతుందన్నారు. పోలీసుశాఖ పరంగా భక్తుల భద్రతకు చర్యలు తీసుకున్నామన్నారు. కొందరు దళారులు, ట్యాక్సీడ్రైవర్లు, ట్రావెల్స్‌నిర్వాహకులు నకిలీ టోకెన్లు తయారుచేసి భక్తులకు అందించేందుకు చూస్తురన్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వాటిని భక్తులు నమ్మవద్దని, నకిలీ టోకెన్లు ఇచ్చినా, తీసుకున్నా చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. నకిలీ టోకెన్లు తీసుకుని భక్తులు కూడా మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. భక్తులు ఎలాంటి మధ్యవర్తులు, దళారుల మాటలు నమ్మకుండా నకిలీ టోకెన్లకు మోసపోవద్దని హెచ్చరించారు. తిరుమలతోబాటు తిరుపతి జిల్లాలోని ఇతర దేవాలయాలలో భక్తుల సౌకర్యార్థం, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లుచేపట్టినట్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో మూడువేలమంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. తిరుమలలో రియల్ టైమ్ కమాండ్ కంట్రోల్ కేంద్రంద్వారా సిసికెమెరాలతో, తిరుపతిలోని ఆర్టీసి బస్టాండ్, అలిపిరి,శ్రీవారిమెట్లు నడకమార్గాల్లో డ్రోన్‌కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ సాగుతుందని ఎస్పీ చెప్పారు. మొదటిమూడు రోజులకు ఇడిప్ దర్శన టోకెన్లు ఉన్న భక్తులను మాత్రమే దర్శనాలు ఉంటాయనేది పోలీసులు కూడా అలిపిరి, శ్రీవారిమొట్టుమార్గాల్లో అవగాహన కల్పిస్తారన్నారు. దళారుల మాటలు నమ్మవద్దని, టిటిడి అధికారిక మాధ్యమాల ద్వారా మాత్రమే సమాచారం తెలుసుకోవాలన్నారు. టోకెన్లు కలిగిన భక్తులు తప్పనిసరిగా ఆయా రోజుల్లో, సూచించిన నిర్ధిష్టసమయానికి ఆ ప్రాంతానికి చేరుకుని క్యూలైన్లలో ప్రవేశించాలని సూచించారు. ఎవరైనా తప్పుడు సమాచారం ప్రచారం చేసినా, భక్తులను తప్పుదోవపట్టించినా చట్టపరమైన చర్యలు. ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహర చారి, శ్రీనివాసులు, డిఎస్పీలు వెంకట నారాయణ, భక్తవత్సలం, రామకృష్ణమా చారి, రమణారావు (డిసిఆర్‌బి), చంద్రశేఖర్, సిఐలు మద్దయ్యాచారి, విక్రమ్,ఆర్ఐ హరికృష్ణ పాల్గొన్నారు.

# మరో సారి మాట నిలుపుకున్న డిసిఎం పవన్

- అభిమాని నాగేశ్వరమ్మ కిచ్చిన మాట కోసం ఇప్పటం వెళ్లిన ఉప ముఖ్యమంత్రి - అండగా ఉంటానని భరోసా.. - రూ. 50 వేల ఆర్థిక సాయం - మనుమడి చదువులకు రూ. లక్ష అందజేత - నాగేశ్వరమ్మ పోషణకు తన జీతం నుంచి ప్రతి నెలా రూ. 5 వేలు



అక్కున చేర్చుకుని తన బాధలు చెబుతున్న అభిమాని నాగేశ్వరమ్మ

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరో సారి తన మానవత్వాన్ని చాటుకున్నారు.ఇప్పటంలో తన అభిమాని,వృద్ధురాలు నాగేశ్వరమ్మ ఇంటికి స్వయంగా వెళ్ళారు."అమ్మా నీ పెద్ద కొడుకుని వచ్చా.. నిన్ను చూడడానికి వచ్చా.. బాగున్నావా.. నీ ఆరోగ్యం ఎలా ఉంది.. నాలుగు రోజులుగా నిన్ను చూసేందుకు వద్దామంటే ఆధికారిక కార్యక్రమాల వల్ల వీలుపడలేదు.. నీకిచ్చిన మాట కోసం ఈ రోజు పనులన్నీ వాయిదా వేసుకుని నీ కోసం వచ్చా." అంటూ మంగళగిరి నియోజకవర్గం, ఇప్పటం గ్రామానికి చెందిన వృద్ధురాలు ఇండ్ల నాగేశ్వరమ్మ ఇంటికి వెళ్లిన సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆమెను ఆప్యాయంగా అక్కున చేర్చుకుని పలకరించారు. గత ప్రభుత్వ హయాంలో జనసేన పార్టీ ఆవిర్భావ సభకు భూములు ఇచ్చారన్న అక్కసుతో ఇప్పటంలో ఇళ్ల కూల్చివేతల సమయంలో గత పాలకుల ఎదురు నిలచిన నాగేశ్వరమ్మ నా బిడ్డ ( పవన్ కళ్యాణ్ వస్తారు.. మీ బెదిరింపులకు భయపడం అంటూ రోడ్డెక్కారు. పవన్ కళ్యాణ్ స్వయంగా ఆ గ్రామానికి వెళ్లి అందరికీ భరోసా ఇచ్చారు. శ్రీమతి నాగేశ్వరమ్మ గారి ఇంటి కొడుకుగా అండగా నిలుస్తాను అని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఆ సందర్భంలో – గెలిచిన తరవాత తన ఇంటికి రావాలని నాగేశ్వరమ్మ కోరారు. ఆమెకు ఇచ్చిన మాట మేరకు బుధవారం నాగేశ్వరమ్మ ఇంటికి వెళ్లి ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులందరినీ పేరుపేరునా పలుకరించారు.సంక్రాంతికి చీర, ఖర్చులకు రూ. 50 వేల ఆర్థిక సాయం ఆ ఇంటికి కుమారుడిగా శ్రీమతి నాగేశ్వరమ్మ గారికి సంక్రాంతి పండుగ కానుకగా చీర బహూకరించారు. ఖర్చుల నిమిత్తం మరో రూ. 50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మాటల మధ్యన ఈ రోజుకీ కుటుంబ పోషణ నిమిత్తం పొలం పనులకు వెళ్తున్నట్టు శ్రీమతి నాగేశ్వరమ్మ గారు చెప్పారు. ప్రతి నెలా తన జీతం నుంచి పిఠాపురంలో అనాథ చిన్నారులకు ఇచ్చిన విధంగా రూ. 5 వేలు పోషణ నిమిత్తం ఇంటికి పంపనున్నట్టు తెలిపారు. దివ్యాంగుడైన నాగేశ్వరమ్మ మనుమడు మనోజ్ సాయి చదువుల నిమిత్తం రూ. లక్ష సాయం చేశారు. ఆమె కుమారుడు శ్రీ కొండయ్య క్యాన్సర్ తో బాధపడుతున్న విషయం తెలుసుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 3 లక్షలు ఇచ్చారు.

# తిరుమల సమాచారం

## 30 తెల్లవారుజామున తెరచుకోనున్న వైకుంఠద్వారం - 30న ఏకాదశి, 31న ద్వాదశి



**తిరుమల,డిసెంబర్ 24ప్రభాత వార్తప్రతి నిధి:** పవిత్రమైన ధనుర్మాసం ఈనెల 30వతేదీ మంగళవారం వైకుంఠ ఏకాదశి,ద్వాదశి ఘడియల సందర్భంగా కలియుగవైకుంఠం ఏడకొండల్లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వారాలు మంగళవారం వేకువజామున 1.30గంటలకు తెరవనున్నారు. వైఖానస ఆగమోక్తంగా విశేష పూజాదికార్యక్రమాలు, కైంకర్యాలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు, అధికారులు తెల్లవారుజామున 1.40గంటలకు బంగారువాకిలికి సమీపంలో ఉన్న వైకుంఠద్వారాలను తెరిచి,ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం తెల్లవారుజామున 2గంటల నుండి రాజ్యాంగపరిధిలోని ప్రముఖులుకు దర్శనం కల్పిస్తారు. ఆ తరువాత ఉదయం 5గంటల నుండి ఆన్‌లైన్‌లో డిప్‌లో టోకెన్లు పొందిన భక్తులను దర్శనానికిఅనుమతించేలా ఏర్పాట్లు చేపట్టారు. రెండురోజుల వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో తిరుమలలో విశేష ఉత్సవాలు జరుగుతాయి. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు,టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వయం పర్యవేక్షణలో ఈ ద్వార దర్శనాలు చేయించేలా ఏర్పాట్లు చేపట్టారు.

**-తొలిరోజు స్వర్ణరథం:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన మంగళవారం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు స్వర్ణరథం ఆలయ మాఢవీధుల్లో జరగనుంది. విశేష అలంకరణలో మలయప్పస్వామి స్వర్ణరథాన్ని ఉభయదేవేరులతో అధిరోహించి ఆలయ మాఢవీదుల్లో భక్తులను కటాక్షించనున్నారు.

**- రెండోరోజు చక్రస్నానమహోత్సవం:** ద్వాదశి పర్వదినాన పవిత్రపుష్కరిణిలో వేకువజామున చక్రత్తాళ్వార్‌కు చక్రస్నాన మహోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు కూడా పవిత్ర స్నానాలాచరిస్తారు.

## శ్రీవారి సేవలో లక్ష్మీంద్రతీర్థస్వామి



**తిరుమల,డిసెంబర్ 24ప్రభాత వార్తప్రతి నిధి:** కర్నాటక బెంగుళూరు కుందాపురం వ్యాసరాజమఠం పీఠాధిపతి లక్ష్మీంద్రతీర్థ స్వామికి టిటిడి చిన్నమర్యాద చేసింది. బుధవారం ఉదయం శిష్యులతో కలసి ఆలయంవద్దకు విచ్చేసిన స్వామివారికి ఆలయ పేష్కార్ రామకృష్ణ ,అర్చకులు ఇస్తికఫాలత్‌తో స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన స్వామి ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి ఆశీస్సులతో మనసు ఆనందం: ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 24ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం ఏడుకొండల వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే మనసు ఆనందంగా ఉంటుందని ప్రముఖులు విశ్వాసం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం స్వామివారి నైవేద్యవిరామసమయంలో సింగపూర్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ రమేష్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు, పారిశ్రామికవేత్త గల్లా జయదేవ్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం లోపలకు చేరుకున్న ప్రముఖులు శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమలలో మీడియాకు దూరంగా ఉన్నారు.

# రుషికొండ ప్యాలెస్ వినియోగంపై త్వరలో నిర్ణయం

- ప్రజలకు ఉపయోగపడేలా, ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా రుషికొండ ప్యాలెస్‌ను వినియోగించాలని భావిస్తున్నాం.. - హాస్పిటాలిటీ ఇండస్ట్రీకి ఇస్తే బాగుంటుందని చర్చించామని వెల్లడి - 28న మరోసారి భేటీ.. కేబినెట్ దృష్టికి ప్రతిపాదనలు: మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడకుండా ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా, ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా విశాఖలోని రుషికొండ ప్యాలెస్ ను వినియోగించాలని భావిస్తున్నట్లు మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్ తెలిపారు. రుషికొండ ప్యాలెస్ ను ఎలా వినియోగించాలన్న అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీ మూడవ భేటీ బుధవారం సచివాలయం రెండో బ్లాక్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జరిగింది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి వర్చువల్ గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీఏ సీఈవో, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట, పర్యాటక శాఖ అధికారులు శ్రీనివాస్, ఈశ్వరయ్యలు రుషికొండ ప్యాలెస్ కు సంబంధించిన వివరాలు కమిటీకి వివరించారు. సుదీర్ఘ చర్చల అనంతరం ప్యాలెస్ వినియోగంపై వచ్చిన పలు ప్రతిపాదనలను చర్చించామని, తాజ్, లీలా ప్యాలెస్, అట్మాస్ కోర్, ఫెమా సంస్థలు ముందుకొచ్చినట్లు మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్ లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రుషికొండ భవనాలు హోటళ్లకు పూర్తి అనుకూలంగా లేవని తెలిపారు. ప్యాలెస్ లపై అదనంగా భవంతులు నిర్మిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వచ్చినట్లు మంత్రులు పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలపై మరోసారి ఈనెల 28న ఆన్ లైన్ జీవోఎం మీటింగ్ లో చర్చిస్తామన్నారు.ఆ సమావేశంలో వచ్చే తుది ప్రతిపాదనలను రాష్ట్ర కేబినెట్ ఆమోదం కోసం పంపనున్నామన్నారు. అంతిమంగా హాస్పిటాలిటీ వైపు మొగ్గు చూపుతూ వయబుల్ మోడ్ లో ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు సబ్ కమిటీ పేర్కొంది. బీచ్ ఫ్రంట్ వినియోగంలో అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ మాల్దీవులు, పుదుచ్చేరి తరహా విధానాలను అనుసరిస్తే బాగుంటుందని చర్చించామన్నారు. గత ప్రభుత్వం నిర్ణయాల వల్ల పర్యాటక శాఖకు భారీ నష్టం వాటిల్లిందని మంత్రులు విమర్శించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ రుషికొండ ప్యాలెస్ ను హాస్పిటాలిటీ ఇండస్ట్రీకి ఇస్తే బాగుంటుందని భావిస్తున్నట్లు తెలిపారు. కానీ కొంతమంది రుషికొండ కింద ఉన్న 9 ఎకరాలు హోటల్స్ కోసం అదనంగా అడిగారని తెలిపారు. సీఆర్ జెడ్ నిబంధనల ప్రకారం 7 ఎకరాల్లో ఎలాంటి నిర్మాణం చేయకూడదని తెలిసిందన్నారు. మిగిలిన 2 ఎకరాలను ఎలా వినియోగిస్తే బాగుంటుందో చర్చించామన్నారు. రుషికొండ ప్యాలెస్ లోని చివరి రెండు బ్లాక్ లు ప్రజలకు ఆర్ట్ గ్యాలరీ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం, ఇతర అవసరాల కోసం ఉంచుతామన్నారు. గత ప్రభుత్వ నిర్ణయం వల్ల ప్రజాధనం వృధా అయిందన్నారు. ఇవాళ జరిగిన భేటీలో పర్యాటక శాఖ భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఆదేశించామని నివేదిక వచ్చిన అనంతరం తదుపరి భేటీలో నిర్ణయం తీసుకుంటామన్నారు. రుషికొండ ప్యాలెస్ వైట్ ఎలిఫెంట్ లా మారిందని విమర్శించారు.

## నెల్లూరును స్మార్ట్ సిటీగా మార్చాలన్నదే నా లక్ష్యం : మంత్రి నారాయణ



**నెల్లూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త-వైద్యం :** నగరంలోని పలు డివిజ న్ల లో శంకుస్థాపన చేసి న మంత్రి ప్రభుత్వ పాఠశాలలో క్రీడామైదాన మైన కోర్టులను పరిశీ లించిన మంత్రి అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు మంత్రి వెల్లడి నెల్లూరును సుందరంగా తీర్చిదిద్ది అభివృద్ధి దిశలో ముందడుగు వేసేలా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా సిటీ నియోజవర్గ పరిధిలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు బుధవారం ఒక్కరోజే అనేక కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి చేశారు.

39 వ డివిజన్‌లో రామిరెడ్డి, ఇల్లి, రేవల పాటి కాలువల ఆధునీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. నారాయణ ఆశయాలు నెరవేరాలని ముస్లిం పెద్దలు దువా చేసి ఆశీర్వదించారు. మూలాపేట బాలికోన్నత పాఠశాలలో ఆధునీకరణ పనులు పరిశీలించి మూలాపేట చమ్మండి వారి తోట పార్కులో 15 లక్షలతో సిద్దమోతున్న వాలీబాల్ కోర్టును పరిశీలించారు .అదేవిధంగా 39వ డివిజన్ లో వాకర్స్ రోడ్ వద్ద ఉన్న వెంగన్న కాలువ పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు 42వ డివిజన్ మన్సూర్ నగర్ లో గచ్చుకాలువ ఆధునీకరణ పనులు పరిశీలించి భూమి పూజ చేశారు. అనంతరం డివిజన్ లో జరుగుతున్న అభివృద్ధి పనులకు స్థానిక హర్షం వ్యక్తం చేస్తూ అభివృద్ధి ప్రదాత నారాయణ అంటూ గుమ్మడి కాయతో దిష్టి తీశారు.48వ డివిజన్ లో ఘోషాసుపత్రి ఆధునీకరణ పనులు పరిశీలించి 49వ డివిజన్ లోని మోడల్ హైస్కూల్ లో బాస్కెట్ బాల్ బ్యాట్మెంటన్ ,త్రోబాల్ కోర్టుల పనులను పరిశీలించారు. పలు సలహాలు ఇచ్చి గ్రౌండ్ కి నాలుగు వైపులా సోలార్ ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 52వ డివిజన్ పీ ఎం అర్ హైస్కూల్ లో వాలీబాల్, బ్యాట్మింటన్ కోర్టుల పనులను పరిశీలించారు వెళ్లిన ప్రతీ చోటా మంత్రికి అడుగడుగు స్థానిక ప్రజలు నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు నెల్లూరుకు ముంపు ముప్పు తప్పించాలని సంకల్పించానని 2017 లో వర్షాలకు నెల్లూరు మునిగిపోయిందన్నారు.

## త్వరలోనే సినిమా టికెట్ రేట్లకు ఒకే జీవో ఉండేలా నిర్ణయం : మంత్రి కందుల దుర్గేష్

- సామాన్యులకు భారం లేకుండా, సినీ పరిశ్రమకు మేలు జరిగేలా త్వరలోనే నిర్ణయం..

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో సినిమా టికెట్ ధరల విషయంలో నెలకొన్న గందరగోళానికి తెరదించుతూ, అన్ని సినిమాలకు వర్తించేలా ఒకే సమగ్ర జీవోను తీసుకురావాలని భావిస్తున్నట్లు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. బుధవారం సచివాలయంలో జరిగిన సినిమా టికెట్ ధరల హేతుబద్ధీకరణ కమిటీ సమీక్షా సమావేశం అనంతరం మంత్రి దుర్గేష్ మీడియాతో మాట్లాడారు. ప్రతి సినిమా బడ్జెట్‌ను బట్టి విడివిడిగా జీవోలు ఇచ్చే పద్ధతికి స్వస్తి పలికి, ఒకే విధానం కింద టికెట్ ధరలు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. సినిమా పరిశ్రమ మనుగడ సాగించడంతో పాటు, సామాన్య ప్రేక్షకుడిపై భారం పడకుండా సమతుల్యత పాటిస్తామని, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సినీ పరిశ్రమకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. పెద్ద బడ్జెట్ సినిమా, ఆర్టిస్టుల రెమ్యూనరేషన్ పై చర్చించి ఒక నిర్ణయానికి వస్తామన్నారు. అన్నింటికీ కేటగిరీ ప్రకారం సమానంగా టికెట్ల ధరలు పెంచే విధానం పరిశీలిస్తున్నామన్నారు. త్వరలోనే డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సినీ పరిశ్రమ సమస్యలు కూడా విని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తెలుగు సినిమా పాన్ ఇండియా దాటి పాన్ వరల్డ్ అయిందని అన్నారు. పాన్ ఇండియా సినిమా వల్ల నిర్మాతలకు బడ్జెట్ విపరీతంగా పెరుగుతోందన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ఏపీలో సినిమా టికెట్ల రేట్ల హేతుబద్ధీకరణపై ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐ అండ్ పీఆర్ డైరెక్టర్, ఏపీ ఎస్ ఎఫ్ టీవీ మరియు టీడీసీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, లా డిపార్ట్ మెంట్ సెక్రటరీ, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ సమీక్షా సమావేశం ఇవాళ జరిగిందన్నారు. మల్టీప్లెక్స్ లు, సింగిల్ స్క్రీన్ల టికెట్ ధరల హేతుబద్ధీకరణపై, హై బడ్జెట్ సినిమా టికెట్ల పెంపునకు అనుసరించాల్సిన విధానాలపై కమిటీ చర్చించిందన్నారు. సమగ్రంగా చర్చించిన అనంతరం కమిటీ ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుందని వెల్లడించారు. ఇప్పటివరకు పాత జీవో ప్రకారం హోం శాఖ ద్వారా సినిమా టికెట్ రేట్లు పెంచుతున్నామని, ప్రస్తుతం లో బడ్జెట్, హై బడ్జెట్ సినిమాలకు ఎంత ధర ఉండాలనే అంశంపై కమిటీ చర్చిస్తోందన్నారు. ఎంత శాతం ఏపీలో చిత్రీకరణ జరపాలన్న అంశంపై నిబంధనలు నిర్ణయిస్తామన్నారు. షూటింగ్ లతో పాటు పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నిర్ణయాలుంటాయన్నారు. ఒక విధానపరమైన నిర్ణయం తీసుకున్న తర్వాత త్వరలోనే కొత్త జీవో జారీ చేస్తామన్నారు. అందరి అభిప్రాయాలను తీసుకున్న తర్వాత నిర్మాతలకు ప్రభుత్వం అండగా ఉండేలా కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఇండియాలో ఏపీని చలచిత్ర నిర్మాణానికి ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. చలనచిత్ర, టెలివిజన్ పరిశ్రమ వృద్ధిని ప్రోత్సహిస్తామన్నారు.

## సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు : మంత్రి బిసి జనార్దనరెడ్డి

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాత వార్తప్రతి నిధి:** గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పవిత్ర తిరుమల క్షేత్రంలో అనేక అక్రమాలు, మహాపాపాలు జరిగాయని రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలు ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి దర్శనానికి దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వారి సౌకర్యాల విషయంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా నిరక్ష్యం వహించిందని జనార్ధన్ రెడ్డి విమర్శించారు. అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పాత్రపై కూడా ఇప్పుడు ప్రజలకు స్పష్టత వస్తోందని, అయితే ఆ వ్యవహారాలు న్యాయస్థానాల పరిధిలో ఉన్నందున ఎక్కువగా మాట్లాడటం లేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమలలో ప్రక్షాళన మొదలుపెట్టామని, ప్రసాదాలకు వాడే నెయ్యితో సహా అన్ని పదార్థాకఠినపరీక్షించాకే వినియోగిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఏకాదశి రోజున 'వైకుంఠం దర్శనం' ద్వారా 90 శాతానికి పైగా సామాన్య భక్తులకు దర్శన భాగ్యం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. అసలు దేవుడిపై నమ్మకం లేని వ్యక్తికి టీటీడీ లాంటి పవిత్ర సంస్థ బాధ్యతలు అప్పగించడమే గత ప్రభుత్వపు పెద్ద తప్పిదమని ప్రజలు భావిస్తున్నారన్నారు. గత ఆరు నెలలుగా కూటమి ప్రభుత్వ పనితీరుకు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని జనార్ధన్ రెడ్డి చెప్పారు. డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ నియామకాలు చేపట్టామని, సీఐఐ సదస్సుల ద్వారా రాష్ట్రానికి వేల కోట్ల



పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు విశ్వసనీయ గమ్యస్థానంగా మారిందన్నారు. కొత్త పోర్టులు, ఐదు విమానాశ్రయాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ప్రతిపక్షం తీరు మారాలి ప్రతిపక్ష నేతలు పెట్టుబడిదారులను భయపెట్టేలా మాట్లాడటం దురదృష్టకరమని, వారి బెదిరింపులకు ఎవరూ భయపడరని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు వైసీపీని 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేసినా ఆ పార్టీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదన్నారు.

## బ్రాడ్‌గేజ్ లైన్ కోసం మరో 300 ఎకరాల భూసేకరణకు రైల్వేశాఖ నోటిఫికేషన్ జారీ

- అమరావతి మీదుగా ఎర్రుపాలెం - నంబూరు స్టేషన్ల మధ్య ఈ లైన్ నిర్మాణం

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** సుదీర్ఘకాలం స్వప్నంగా మిగిలిన ఎన్టీ జిల్లా (పశ్చిమకృష్ణా)పశ్చిమ ప్రాంత వాసులకే రైలు సదుపాయం అందుబాటులోకి రానున్నది.అమరావతి మీదుగా ఎర్రుపాలెం- నంబూరు స్టేషన్ల మధ్య నిర్మిస్తున్న బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ కోసం మరో 300 ఎకరాల భూసేకరణకు రైల్వేశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. రమారమీ నాలుగున్న దశాబ్దాలుగా ఉమ్మడి ఏపీలోను,ఇప్పటి నవ్యాంధ్రలోను రైలు లైను ఏర్పాటు ప్రతిపాదనలున్నా, కార్యచరణకు నోచలేదు.జగ్గయ్యపేటలో రైలు స్టేషన్ ఉన్నా అది గూడ్స్‌బండ్లకు పరిమితమైంది.దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా రైలు లైను ప్రతిపాదనలు ముందుకు సాగలేదు.అమరావతి మీదుగా ఎర్రుపాలెం- నంబూరు స్టేషన్ల మధ్య బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ నిర్మాణంకు కేంద్రం అనుమతినివ్వడంతో ఆ కల నెరవేరే అవకాశాలు మెరుగుపడ్డాయి.ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లాలోని వీరులపాడు, కంచికచర్ల మండలాల్లోని 8 గ్రామాల్లో 495 సర్వే నంబర్ల పరిధిలోని భూములను సేకరించాలని నిర్ణయించింది. ఇందులో ప్రైవేటు, ప్రభుత్వ, ఎసైన్డ్ భూములున్నాయి. పరిటాల గ్రామ పరిధిలో ఒక చోట 2.942 ఎకరాల గెస్ట్‌హౌస్ సైట్‌కు సంబంధించి హైకోర్టులో 3 పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపింది. ఈ భూముల సేకరణకు 2024 డిసెంబర్ 21న ప్రకటన ఇచ్చిన తర్వాత వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి సంబంధిత అధీకృత అధికారి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని, వాటన్నింటినీ పరిశీలించిన తర్వాత ఈ రైల్వే లైన్ నిర్మాణం కోసం ఈ భూములను సేకరించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. ఇందులో పేర్కొన్న భూములన్నీ ఇక మీదట కేంద్ర ప్రభుత్వానికి చెందుతాయని స్పష్టం చేసింది. అమరావతి మీదుగా ఎర్రుపాలెం నంబూరు మధ్య నిర్మించనున్న 56.53 కి.మీ. బ్రాడ్‌గేజ్ లైన్ నిర్మాణం కోసం ఇబ్రహీంపట్నం మండలం లో 77.154 ఎకరాల భూమి సేకరించాలన్నారు.



వార్త


చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందుచూపు ఎంతో అవసరం.

-ఐ.జాన్సన్

# ముదిమిలోనూ ఊరట!


వృద్ధాప్య వేగాన్ని వ్యాయామం ద్వారా తగ్గించుకోవచ్చునంటే ఓస్ ఇంతేనా!? అని అనిపిస్తుంది. అలా అనడమే తప్ప రోజూ ఓ అరగంట వ్యాయామం చేద్దామంటే అసలు తీరికే చిక్కదు. ప్రతి ఒక్కరు తమ జీవనశైలిని ఎప్పటికప్పుడు ఒత్తిడి, నిద్రలేమి, ఊబకాయాల దుష్ప్రభావాల నుంచి బయటపడే స్థాయిలోకి మార్చుకోవాలంటే కాస్త కష్టమే మరి! అలా మార్చుకోకపోతే ఆరోగ్య రీత్యా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని 'న్యూ సైంటిస్ట్' అనే శాస్త్ర విజ్ఞాన ఆంగ్ల పత్రిక ఒక అధ్యయన వ్యాసంలో ప్రస్తావించింది. ప్రపంచవ్యాప్తంగా వృద్ధాప్య ఛాయలు తమ సహజ పెరుగుదలతో నిమిత్తం లేకుండా ముందస్తుగానే హెచ్చరించే పరిస్థితి కనపడుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఒత్తిడి, వేడిమి, ఊబకాయం, హృద్రోగాలు, కేన్సర్ మనుషుల సహజ వయసుపై ప్రభావం చూపుతున్నాయన్న విషయం విదితమే. వాటి తీవ్రత తెలుసుకోకపోతే ముందస్తు మరణాలు సంభవించే అవకాశం లేకపోలేదు. ప్రపంచవ్యాప్తంగా గతంలో కంటే వేగంగా వృద్ధాప్యం తరుముకొస్తున్నట్లు వస్తున్న తాజా అధ్యయనాలు కొంత భయపెట్టేవే. అయితే ఇలాంటి ప్రమాదాన్ని తగ్గించుకోగల అవకాశాలపై శాస్త్రవేత్తల పరిశోధనలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఒకనాడు వృద్ధాప్యలో వచ్చే వ్యాధులు ఇప్పుడు అంతకన్నా చిన్న వయసులోనే సంక్రమిస్తున్నాయని వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలో తాజాగా జరిగిన అధ్యయనంలో తేలింది. 1965కి ముందు జన్మించిన వ్యక్తులలో, ఇటీవలి దశాబ్దాలలో పుట్టిన వారిలో కంటే నిదానంగా వృద్ధాప్యపు ఛాయలు కనిపిస్తున్నాయి. 1965 తర్వాత జన్మించిన వారు ఎక్కువ ప్రభావానికి లోనవుతున్నారని, వీరికే వార్ధక్య లక్షణాలు కనపడుతున్నాయని గుర్తించింది. వృద్ధాప్యం, వృద్ధాప్య బాధలు, వ్యాధుల లక్షణాలు, సంక్రమిస్తున్న వ్యాధులపై జరిగిన అధ్యయనంలో ఎన్నో విషయాలను శాస్త్రజ్ఞులు గుర్తించారు. 2016లోఊబకాయంపై అధ్యయనం చేస్తున్న స్పెయిన్ వైద్య పరిశోధకులబృందం గుర్తించింది. ఊబకాయ జీవ సంబంధమైన ప్రభావాలు వృద్ధాప్యాన్ని ముందే తెస్తున్నాయని చెప్పారు. ఊబకాయం వల్ల కొవ్వు కణాలు పెరిగే పరిస్థితులు, ఆ తర్వాత అవి కరిగే అంశాల్ని పరిశీలించి చూస్తే వ్యాయామం వల్లకలిగే ప్రయోజనాలు తెలుస్తాయి. సామర్థ్యం క్షీణించటం, జీవక్రియల్లో చురుకుదనం తగ్గటం, వాతం మూలంగా కండరాలు, ఎముకలు, గుండె నాళాల వ్యవస్థ సహా శరీరంలోని అనేక అవయవాల పనితీరు సన్నగిల్లటం ఇందుకు కారణమని పరిశోధకుల శాస్త్రీయ అంచనా. నిరుడు వాషింగ్టన్ విశ్వవిద్యాలయ పరిశోధన శాలలలో శీఘ్ర వృద్ధాప్యాలను గమనించేందుకు 1లక్ష 50వేల మంది రక్త నమూనాలను ప్రదర్శించారు. ఆ నమూనాలన్నీ 37నుంచి 54 ఏళ్ల వయసు వారివే. ఆ పరిశోధనలో 1965 తర్వాత జన్మించిన వారిలో 17శాతం వృద్ధాప్య ఛాయలు ఎక్కు వ వేగవంతంగా ఉన్నట్లు తేలింది. వారిలో ముందుగానే ఊపిరితిత్తులు, జీర్ణావయవ, గర్భాశయ, పేగు క్యాన్సర్లు వచ్చే సంకేతాలు కనిపించాయి. నడి వయస్కులు కేవలం ఊబకాయం వల్లనే వృద్ధాప్యానికి చేరువవుతున్నారని నిర్ణయించారు. వరల్డ్ ఒబేసిటీ ఫెడరేషన్ డేటా ప్రకారం 519ఏళ్ల వారిలో ఊబకాయం రేట్లు 1975 – 2022మధ్య సుమారు 1000 శాతం వరకు పెరిగాయి. జీవనశైలిలో మార్పులు చేసుకోవటం ద్వారా ఊబకాయాన్ని, వృద్ధాప్య వేగాన్ని తగ్గించుకోవచ్చని శాస్త్రజ్ఞులు సూచిస్తున్నారు. వయోవేగాన్ని గుర్తించి వారు అంత వేగంగా ఎందుకు వృద్ధాప్యంలోకి జారుకుంటున్నారో తెలుసుకునేందుకు 'ఎపి జెనెటిక్' పరీక్ష చేస్తారు. తద్వారా ఆ వ్యక్తి డీఎన్ఏలో మార్పులను గమనించి వారి వృద్ధాప్యవేగాన్ని అంచనా వేస్తారు. దానిని బట్టి కూడా పలు జాగ్రత్తలు తీసుకునే వీలుంది. ఇది రోజువారీ ప్రక్రియ కాదు. కనుక తరచు పరీక్షలు చేసుకోవడం సాధ్యంకాదు. ఊబకాయులందరూ సాధారణంగా తీసుకునే జాగ్రత్తలే తీసుకుంటే అనారోగ్యం పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు. జీవన శైలి తేడా లతో కొంతమంది వారి వాస్తవ వయసు కంటే 10 ఏళ్లు ఎక్కువగాలేదా 10ఏళ్లు తక్కువగా కనిపిస్తున్నారు. ఆరోగ్య కరమైన ఆహారం, లేదా బరువు తగ్గించే మందుల ద్వారా ఊబకాయాన్ని నివారించటం ద్వారా వయసు మీద పడే వేగాన్ని తగ్గించవచ్చు. ముందస్తు వార్ధక్యానికి కేవలం ఊబకాయం, ఒత్తిడి, కాలుష్యం కాదు. వాతావరణ మార్పులూ దోహదపడుతున్నాయి. శరీరంలోని అవయ వాలు సతాయించకుండా ఉంటే శతాధిక వత్సరాలు బతి కేయడం అలాంటి పరిస్థితి చక్కని వ్యాయామం ద్వారానే సాధ్యమని చెప్పిన మాటలను నమ్మడం తప్పని సరి. ప్రపంచంలోనే అమెరికాలో ఉన్న కెన్ని నికోలే 115 ఏళ్లు బతికింది. జపాన్‌కు చెందిన మి స్వాజుకి 117 ఏళ్లు. ఇప్పటికీ బతికేఉంది. ఇవి నిదర్శనాలు కాదనగలమా! ఈ ఏడాది ఆరంభంలో సదరన్ కాలిఫోర్నియా విశ్వ విద్యాలయంలో 50 ఏళ్ళు పైబడిన 3,686 మంది వివరాలను పరిశోధించారు. వాతావరణంలోని అధిక స్థాయిలకు గురైన వ్యక్తులు మరింత వేగంగా వృద్ధాప్యానికి చేరువవుతున్నారని, ఉష్ణోగ్రతలో ప్రతి 10శాతం పెరుగుదల వారి వయసును 1.4 నెలలు పెంచుతోందని కనుగొన్నారు. గత ఆగస్టులో హాంకాంగ్ విశ్వవిద్యాలయం లో జరిగిన మరో అధ్యయనంలో 25 వేల మంది వయోజనుల డేటా పరిశీలన చేసి వారి శారీరక, మాన సిక ఆరోగ్య పరిస్థితులను బట్టి స్థిరమైన వ్యాయామమే మేలని నిర్ణయించారు. వృద్ధాప్య వేగాన్ని వ్యాయామం ద్వారా తగ్గించుకోగలగడం శుభకరం.

దూరంగా ఏముందో ఆలోచన చేయనివారికి, సమీపంలోనే ప్రమాదం కాచుకుని ఉంటుంది.



హెచ్. లాంగ్‌ఫెలో

విజయం వల్ల లాభాలు ఆశించేవారు ఆ విజయాన్ని పొందేందుకు తిప్పలు పడక తప్పదు.



డబ్ల్యు. ఎమర్సన్

# గ్రామీణ ఉపాధి 'భరోసా' పదిలమేనా?

**ప్రపంచ ఆర్థిక మాంద్యం, కరోనా సమయంలో కోట్లాదిమంది వలస కూలీలు మనదేశంలో ఆర్థికంగా ఎటువంటి ఒడిదొడుకులను ఎదుర్కోలేదంటే ప్రత్యేక కారణం ఉపాధి హామీ చట్టమే. రాష్ట్ర విభజన సందర్భంలో సాక్షాత్తు పార్లమెంట్లో ముక్తకంఠంగా ఇస్తామన్న ఆంధ్రరాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తాన్నన్నవారు ఇప్పటివరకు ఆ ఊసేలేదు. అటువంటిది 40శాతం నిధులు రాష్ట్రాలు సమకూర్చుకోవాలంటే ప్రస్తుతమున్న తెలుగు రాష్ట్రాలకు వీలవుతుందా, పనిరోజులు పెంచి కేంద్రం నిధులకు నీళ్లొదిలింది ఈ కొత్త చట్టంతో. పార్లమెంటులో మన రాష్ట్ర పార్టీలు ఈపథకంపై రాష్ట్ర ఆర్థిక, సామజిక పరిస్థితిని లేదా వారిసలహాలు, సూచనలు ఇవ్వకపోవడం గ్రామీణ పేదకూలీలను పరిహాసించ డమే అవుతుంది.**

డా. ఎ . భాగ్యరాజ్

చారిత్రాత్మక ఉపాధి హామీ చట్టంలో వచ్చిన మార్పులు గ్రామీణ కూలీ, కార్మికుల హక్కులను బలపరుస్తాయా లేదా అనే భయాలు మొదలయ్యాయి. బలహీనత చట్టంలో కాదు ఉద్దేశంలోను, నిర్మాణపరంగా ఉందా అనేది చూడాలి. ఉపాధి హామీ ఒక పథకం కాదు, ఒక హక్కు. భారత ప్రజాస్వామ్యంలో ఉపాధిహామీ పథకం (మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం) కేవలం పేదలకు పనికల్పించే ప్రభుత్వ పథకం మాత్రమే కాదు. అది గౌరవంగా బతికే హక్కుకు అనుబంధమైన ఒక సామాజిక భద్రతా చట్టం. భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు అంటే కేవలం ప్రాణం నిలుపుకోవడం కాదు, గౌరవంతో బ్రతికేందుకు అవసరమైన పని, ఆహారం, ఆశ్రయం, భద్రత అన్నీకూడా ఈ చట్టంలో భాగమే. ఈపథకానికి చట్ట రూపం ఇచ్చిందే 2005లో వచ్చిన ఉపాధి హామీ చట్టం. 1990ల తర్వాత భారతదేశం ప్రైవేటీకరణ, ప్రభుత్వ ఉద్యోగాల తగ్గింపు, వ్యవ సాయ రంగంలో సంక్షోభం, గ్రామీణ నిరుద్యోగం పెరుగు దలవలన రైతులు కూలీలు, కూలీలు, వలస కూలీలు గ్రామాలు వదలి వెళ్లటం వలనఖాళీ అవుతున్న ఊర్లుగా మారాయి. ఈ సామాజిక విపత్తుకు సమాధానంగా రూపొందిందేఉపాధి హామీ చట్టం. ఈ చట్టం వలన ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 100 రోజులు పని హక్కుగా ఇవ్వడం జరిగింది. స్థానికంగా ఉపాధి కల్పించడం వలన వలసలను అరికట్టడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ప్రధానమైనది. ఉపాధి లేకపోతే ఆహారం లేదు, ఆరోగ్యం లేదు, విద్య లేదు, స్వేచ్ఛలేదు. ఉపాధి హామీ చట్టం ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పథకంకాదు, డిమాండ్ చేసినప్పుడు పని ఇవ్వాల్సినది ప్రభుత్వ బాధ్యత. పని ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఇదే చట్టం లక్షణం. స్వాతంత్ర్యానంతరం ప్రజలలో గణనీయమైన మార్పును అందించిన పథకాలలో జాతీయ ఉపాధి హామీ పథకం ఒకటి. మన్మోహన్ సింగ్ ప్రధాని కాలంలో ప్రముఖంగా చెప్పుకోవలసిన ప్రధానమైన పథకంగా చెప్పుకోవచ్చు. ఇది నగర గ్రామీణ ఆర్థిక వ్యత్యాసాలను రూపుమాపడానికి, గ్రామాల్లో పంటకాలం మినహా నిరుద్యోగం ఎక్కువగా ఉంటుంది. దాని వలన వలస కూలీలుగా పక్క రాష్ట్రానికో, పట్టణానికో ఎక్కువగా ఉండేది. దానిని రూపుమాపడానికి వచ్చిన పథకమే ఈ ఉపాధి హామీ పథకం(2005). తరువాత ఇది చట్టంగా రూపు దిద్దుకొని 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా మారింది. ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం ప్రజల మధ్య ధనచక్రాన్ని పెంచడమే ప్రధాన ఉద్దేశం. తొలిదశలో ఉపాధి హామీ 2006–2013 మధ్య కోట్లాది మంది గ్రామీణ పేదలకు ఉపాధి, మహిళల భాగస్వామ్యం 50 శాతానికి పైగా దళితులు, ఆదివాసీలకు ఉపాధి కల్పించింది. గ్రామాల్లో చెరువులు తవ్వడం, రహదారులు, కాలువలు నిర్మించుకోవడం వలన గ్రామీణ పేదల ఆదాయం పెరగడం, స్థానిక మార్కెట్లకు గిరాకి, పేదరికం తగ్గడానికి ముఖ్య కారణంగా మారింది. 2014 తర్వాత పాలకుల దృష్టిలో ఉపాధి హామీ చట్టం భారంగా, పేదలను సోమరులుగా చేసే పథకంగా, ఉత్పాదకత లేని ఖర్చుగా చూడడం కారణంగా బడ్జెట్ కత్తిరింపులు, చెల్లింపుల్లో ఆలస్యం, పని దినాల తగ్గింపు, హక్కుగా ఉన్న ఉపాధి వారి దయా దాక్షిణ్యాలపై ఆధారపడింది. ఉపాధి హామీ చట్టం ప్రకారం డిమాండ్ ఉన్నంత పని ఇవ్వాలి. నిధులు అడ్డంకికాకూడదు. కానీ వాస్తవం ఏంటంటే సంవత్సరాంతానికి నిధులు ఖాళీ అని, నెలల తరబడి కూలీ వేతనాలు బకాయి చెల్లించక పోవడం, రాష్ట్రాలపై నిందలేయడం పూర్తిగా చట్ట ఉల్లంఘన తప్పించుకొనే ప్రక్రియగా మారింది. ప్రస్తుత పథకం (విబిజి రామ్‌జి)బిజెపి ప్రభుత్వం ఎటువంటి ముందస్తుగా



ప్రతిపక్షాలకు తెలియజేయకుండా, చర్చలు జరపకుండా నిన్నటి శీతాకాల సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదంపొందిన ఈ వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ (విబిజిరామ్‌జి) గురించి మొదటిదిగా చెప్పుకోవలసింది ఏదైనా పని ఉంటే మాత్రమే పనికి తీసుకుంటాము అనేది. దీనివలన పని ఇవ్వాలనే చట్టం నీరుగారిపోతుంది అనేది ప్రతిపక్షాల ఆదోళన. రెండోది డిమాండెపై పని చేయండి అనేది పోయి, ఆ గ్రామంలో ఉండే పనికి ఎంతమంది, ఎన్నిరోజులు అవసరమో అన్నిరోజులు మాత్రమే పని ఉంటుంది. ఒకొక్క రాష్ట్రానికి తగ్గట్టు రోజు కూలీ నిర్ణయించబడుతుని అని చెబుతూ రాష్ట్రాలు 40 శాతంనిధులు సమకూర్చుకోవాలని పెట్టడం రాష్ట్రాలకు ఇబ్బందికరమైనది. రాష్ట్రాల నుంచి పన్నులన్నీ కేంద్రంతీసుకొని రాష్ట్రంపై బరువు పెడితే ఎలా? చట్టంగా ఉన్నప్పుడే కేంద్ర ప్రభుత్వం సరిగా నిధులివ్వడం లేదు. అటువంటిది బాధ్యతల పేరుతో రాష్ట్రంపై40శాతం నిధులను సమకూర్చుకోవడానికి భాగస్వామ్యం చేసి కేంద్రం వెనక్కితగ్గడమే ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. ఇది ఒకరకంగా కేంద్రం చేస్తున్న రాజకీయమే. పాత ఉపాధి హామీలో 33శాతం మహిళలకు ప్రధమంగాఉండాలి. కానీ ఈ చట్టంలో కచ్చితమైన సంఖ్య చెప్పలేదు. మహిళలు, దళితులు, ఆదివాసీలు మొదట నష్టపోతారు. ఉపాధి హామీ బలహీనపడితే ముమ్మాటికీ గ్రామాలలో పేదమహిళల ఆదాయం తగ్గుతుంది. దళితుల ఆర్థిక స్వాతంత్ర్యం దెబ్బతింటుంది. ఆదివాసీల జీవనాధారం కూలిపోతుంది. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు, సామాజిక న్యాయంపై దాడిగా చూడవలసి వస్తోంది. డిజిటలైజేషన్ పేరుతో ఆధార్ లింకింగ్, మస్టర్ (హాజరు పట్టిక)రోల్ ఫోటోలు పెట్టడం మంచిదే. వాటివలన గ్రామాలలో పని వాటి విలువలలో పారదర్శకత ఉంటుంది. కానీ అందరికి ఆండ్రాయిడ్ చరవాణి అందుబాటులో ఉంటుందా అనేది ప్రశ్న. దేశవ్యాప్తంగా ఉన్న పేదవారికి అడిగినన్ని రోజులు వారు డిమాండ్ చేసినన్ని రోజులు పని ఇవ్వాలనేది పాత చట్ట రూపకల్పనకు ఆత్మ. కానీ ఈ చట్టంలోని సెక్షన్ 5(1) ప్రకారం ఎప్పుడు, ఎక్కడ పథకం అమలౌతుందనే విచక్షణాధికారం కేంద్రం చేతిలో ఉంటుంది. ఇది ఆమోద యోగ్యమైనది కానిది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ముందుండి నడిపించిన గాంధీ పేరుని ఈ పథకంపేరు నుండి తీసివేయడం వారిరాజకీయ దురుద్దేశాన్ని తెలియజేస్తుంది. చూస్తుంటే ఒక విధంగా ఇది రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది. బిజెపి గత పదిసంవత్సరాలనుండి మొదటి నాళ్లలో ఇందిరాగాంధీని అత్యవసర (ఎమర్జెన్సీ) కాలాన్ని చూపించి పదేపదే ఆమెను తక్కువ చేసి చెప్పారు. తరువాత నెహ్రూని చైనాతోయుద్ధం, కాశ్మీర్ వ్యవహారం, సోషలిజంపై నిరంతరం చిన్నబుచ్చే పనిచేయడం చేస్తున్నారు. ఆ క్రమంలోనే గాంధీ పేరును ఈ ఉపాధి హామీపేరును మార్చి రాముడి పేరు చేర్చిమత రాజకీయానికి స్థిరమైన బీజంవేస్తోంది. అన్ని మతాలవారు ఈ పథకంలో పనిచేసే వారుంటారు. కానీ ఈ ప్రభుత్వం జాతీయ నాయకుల స్ఫూర్తిని మరచి మతరాజకీయానికి తెరలేపింది. రాముడి పేరుచేర్చాలంటే కొత్తగా ఒకపథకం పెట్టిచేయలేరా! ఒక విధంగా భవిష్యత్తు తరాలకు మతవాదాన్ని పెంచే విధంగా ఉంది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ముందుండి నడిపించిన నాయకులను దూరంచేయడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. గాంధీ దేశ నిర్మాణాన్ని తన సిద్ధాంతాలతో, త్యాగాలతో, పోరాటాలతో ఒక్క చుక్క రక్తం చిందించకుండా ముందుకు నడిపించి స్వాతంత్ర్యాన్ని అందించిన మహనీయుడు. ఇప్పటికీ ఈదేశంలో అంతఃకలహాలు, మతకలహాలు లేకుండా ఉన్నాయంటే కారణం ఆయన నడిచిన, చూపిన దారి వల్లనే. అంతటి మహనీయుని పేరుని గ్రామీణ ఉపాధి చట్టం నుంచి తొలగించడం దేశానికే అవమానకరమైనది. ఈ పథకం వలన ముఖ్యంగా రైతుల ఆత్మహత్య, వలసలు తగ్గింది. ప్రపంచ ఆర్థిక మాంద్యం, కరోనా సమయంలో కోట్లాదిమంది వలస కూలీలు మనదేశంలో ఆర్థికంగా ఎటువంటి ఒడిదొడుకులను ఎదుర్కోలేదంటే ప్రత్యేక కారణం ఉపాధి హామీ చట్టమే. రాష్ట్ర విభజన సందర్భంలో సాక్షాత్తు పార్లమెంట్లో ముక్తకంఠంగా ఇస్తామన్న ఆంధ్రరాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తాన్నన్నవారు ఇప్పటివరకు ఆ ఊసేలేదు. అటువంటిది 40శాతం నిధులు రాష్ట్రాలు సమకూర్చుకోవాలంటే ప్రస్తుతమున్న తెలుగు రాష్ట్రాలకు వీలవుతుందా, పనిరోజులు పెంచి కేంద్రం నిధు లకు నీళ్లొదిలింది ఈ కొత్త చట్టంతో. పార్లమెంటులో మన రాష్ట్ర పార్టీలు ఈపథకంపై రాష్ట్ర ఆర్థిక, సామజిక పరిస్థితిని లేదా వారిసలహాలు, సూచనలు ఇవ్వకపోవడం గ్రామీణ పేదకూలీలను పరిహాసించడమే అవుతుంది. మన తెలుగు రాష్ట్రాల పార్లమెంటు సభ్యులు బెంగాల్, తమిళనాడు సభ్యులను చూసినేర్చుకోవాలి. ప్రభుత్వాలకు పథకాల పేర్లమార్పు మీదఉన్న శ్రద్ధకంటే నిర్వహణ మీదచూపిస్తే బాగుంటుంది. ●

# కమ్యూనిస్టు ఆలోచనల తిరోగమనం!



అభిషేక్ జగిని

ఇటీవల కేరళ రాష్ట్రంలో ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికలు భారత రాజకీయాల్లో ఓ కొత్త అధ్యాయానికి నాంది పలికాయి. తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీ–ఎన్డీయే కూటమి స్పష్టమైన మెజారిటీ సాధించి, 45 ఏళ్లుగా కొనసాగిన ఎల్డీఎఫ్ ఆధిపత్యాన్ని చరిత్రలో నిలిచిపోయేలా తుడిచిపెట్టింది. 100 వార్డుల్లో 51 స్థానాలు గెలుచుకుని, తొలి సారిగా మేయర్ పదవిని చేపట్టబోతోన్న బీజేపీ విజయం, కేరళ యువత అభివృద్ధి, ఆధునికత వైపు తలంచిన స్పష్టమైన సంకేతం. ఇది కేవలం రాజకీయ విజయం కాదు. కమ్యూనిస్టు ఆలోచనాపద్ధతి కూలిపోతున్న సంకేతం. త్రిపుర, బెంగాల్ అనంతరం ఇప్పుడు కేరళలో కమ్యూనిస్టు ఆధిపత్యం వెనక్కి వెళ్లడం, భారత రాజకీయ పరిణామంలో సహజమైన తదుపరి ఎనర్జీ మార్పు అని చెప్పవచ్చు. తిరువనంతపురంతోపాటు మొత్తం 93వార్డులు గెలుచుకున్న బీజేపీ, పాలక్కాడ్ మున్సిపాలిటీలో తన పట్టు కొనసాగించింది. త్రిపునితురలో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించడం, గత ఎన్నికలతో పోలిస్తే గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీనడ్డా ఈ విజయాన్ని కేరళలో మార్పుకోసం ప్రజల కోరికగా విశ్లేషించారు. ప్రధాని నరేంద్ర మోడీ వికసిత కేరళ దృష్టి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన రహదారులు, ఆరోగ్యం, విద్యవంటి అభివృద్ధి కార్యక్రమాలు యువతను ఆకర్షిస్తున్నాయి. ఉదాహరణకు, తిరువనంతపురంలో డెలివరీ వర్కర్‌గా ప్రారంభించి ఎన్నికల్లో విజయం సాధించిన శ్రుతి ఎమ్ వంటి అభ్యర్థులు పార్టీని ప్రతిబిం బించే మెరిట్ ఆధారిత వ్యవస్థకు నిదర్శనం. ఇది వంశపారంపర్య రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక విలువలను నిలబెడుతోంది. కమ్యూనిస్టు ఆధిపత్యం కుంగిపోతుంది. త్రిపురలో ఒకశాతం ఓట్లతో ప్రారంభించి బీజేపీ రెండుసార్లుప్రభుత్వం ఏర్పాటు చేసింది. బెంగాల్‌లో సీపీఎమ్ అస్తిత్వమే ప్రశ్నార్థకమైంది. ఇప్పుడు కేరళలో ఎల్డీఎఫ్ ఒక్క కార్పొరేషన్‌కే పరిమితమైంది. ఉత్తర కేరళలో ముస్లిం ఓటర్ల లో కూడా కొత్త తరహా ఆలోచన చోటు చేసుకుంటోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పినట్టుగా, కేరళలో 25శాతం ఓటు షేర్ సాధించాలని బీజేపీ తీసుకున్న సంకల్పం ఈ ఫలితాలతో మరింత బలమైనది. బీజేపీ నాయకులు సోషల్ మీడియాలో యువత అభివృద్ధి, జాతీయ వాదం వైపు మొగ్గ చూపుతున్నట్టు విశ్లేషిస్తున్నారు. న్యూస్ రిపోర్టులు కూడా ఈ ధోరణిని ధృవీకరిస్తున్నాయి. హిందూ ఓటర్లు బీజేపీ వైపు సానుకూలంగా మారుతున్నారు. ఎల్డీ ఎఫ్ హిందూ అవుట్‌రీచ్ విఫలమైంది. సమతుల్య దృష్టితో చూస్తే యూడీఎఫ్ (కాంగ్రెస్ నేతృత్వం) ఇప్పటికీ నాలుగు కార్పొరేషన్లు, అనేక పంచాయతీలు గెలుచుకొని ఆధిక్యంలో నిలిచింది. కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ బీజేపీ ప్రదర్శన 'చారిత్రాత్మకమని'పేర్కొనడం, రాష్ట్రరాజకీయ డైనమిక్స్ మార్పుకు ప్రతీక. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా బీజేపీ బలపడటం అవసరమే అయినప్పటికీ, ఈఎన్నికల ఫలితాలు యూడీఎఫ్–ఎల్డీఎఫ్ మధ్యసుదీర్ఘ ద్వంద్వ రాజకీయాలకు సవాల్ విసురుతున్నాయి. ముగింపుగా, కేరళ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ వ్యాప్తిని, కమ్యూనిస్టు క్షీణతను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. ఉత్తరంనుంచి దక్షిణం వరకు వికసిత భారత్" దిశగా యువత ముందుకు సాగుతోంది. ●

# సామాజిక రుగ్మతల నుంచి బయటపడలేమా?

మేకిరి దామోదర్

ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరమని అందరికీ తెలుసు. దీనిపై ప్రభుత్వాలూ, వైద్య నిపుణులూ ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉన్నారు. పొగాకు, మద్యం ఉత్పత్తులపై భయానక చిత్రాలు, ప్రకటన బోర్డులు, సినిమాల్లో కూడా మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరం అనే హెచ్చరికలు తప్పనిసరిగా దర్శనమిస్తుంటాయి. అయితే ఈ హెచ్చరికలు చూసి నిజంగా ఎంతమంది ఈ దురలవాట్లకు దూరమవుతున్నారు? సమాధానం అందరికీ తెలిసినదే. హెచ్చరికలు పెరుగుతున్నా, వ్యసనాలు తగ్గడం లేదు. ఫలితంగా ప్రాణాంతకమైన క్యాన్సర్లు, గుండె జబ్బులు, కాలేయవ్యాధులు వంటి అనేక రుగ్మతలు పెరుగుతున్నాయి. ఎన్నో పచ్చటి సంసారాలు ఈ వ్యసనాలబారిన పడి ఛిన్నాభిన్నమవుతున్నాయి. ధూమపానం, మద్యపానం వంటి ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలిగించే ఉత్పత్తులను సమూలంగా నిర్మూలించాల్సిన ప్రభుత్వాలు, వాటిపై పన్నులు పెంచడమే పరిష్కారమని భావిస్తున్నాయా? పన్నులు పెరిగితే ప్రజలు వాడకం మానేస్తారని ప్రభుత్వంఆశిస్తుందా? వాస్తవానికి ఇది పనిచేయడం లేదు. ఎందుకంటే ఈ ఉత్పత్తులపై వచ్చే ఆదాయమే ప్రభుత్వ ఖజానాకు ప్రధాన ఆధారంగా మారింది. గ్రామీణ పేదలు, మధ్యతరగతి కుటుంబాల సంపాదన ఈ దురలవాట్లలోనే కరిగిపోతోంది. ఒకవైపు ప్రభుత్వాలు సంక్షేమ పథకాల పేరిట ఒక చేయి ధనం ఇస్తూ, మరోవైపు మద్యపానం, ధూమపానం ద్వారాపన్నుల రూపంలో ప్రజల జేబులను ఖాళీ చేయడం పరిపాటిగా మారింది. ఇది నిజంగా సంక్షేమ పాలనా? లేక ద్వంద్వ విధానమా? ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలే ఈ వ్యసనాల ద్వారా ఆదాయం సంపాదించడమే అత్యంత విషాదకరమైన వాస్తవం. ప్రజల ఆరోగ్యం కంటే ఆదాయమే ముఖ్యమన్న భావన ప్రభుత్వ విధానాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ధూమపానం, మద్యపానం విడివిడిగా ప్రమాదకరమే అయినా, ఈ రెండూ కలిస్తే ఆరోగ్యానికి మరింత ప్రమాదకరమని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఈ రెండు వ్యసనాలకు పరస్పర సంబంధం ఉందని శాస్త్రీయంగా రుజువైంది. సాధారణంగా ధూమపానం చేయని వారు కూడా మద్యం సేవించే సమయంలో పొగతాగడం గమనించవచ్చు. దీనికి కారణం ఏమిటి అనే అంశంపై సీసీఎంబీ పరిశోధకులు అధ్యయనం చేశారు. పొగాకులోని నికోటిన్ మద్యం తాగాలనే కోరికను పెంచుతుందని, అలాగే మద్యం సేవించిన వారికి నికోటిన్ తీసుకోవాలనే కోరిక మరింత బలపడుతుందని వారి పరిశోధనలో తేలింది. ఆల్కహాల్, నికోటిన్ పదేపదే తీసుకోవడం వల్ల మెదడులోని అభ్యాస సర్క్యూట్‌లో ఇవి జతగా మారతాయి. దాంతో ఒకటి తీసు



కుంటే మరొకటి కావాలనే తపన పెరుగుతుంది. ఈప్రక్రియ వ్యాధుల ప్రమాదాన్ని మరింత పెంచుతుందని, ప్రాణాంతక మయ్యే అవకాశాలుఎక్కువగా ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ రెండు వ్యసనాలు క్యాన్సర్, గుండె జబ్బులు, కాలేయ సమస్యలతోపాటు మానసిక ఆరోగ్యంపైకూడా తీవ్ర ప్రభావం చూపుతాయి. విడివిడిగా ఈ వ్యసనాలను మాన్పించడానికి చికిత్సలు, మందులు ఉన్నప్పటికీ, రెండు అలవాట్లు కలిగినవారిలో చికిత్స ప్రభావం తక్కువగా ఉంటోంది. ఒక వ్యసనాన్ని లక్ష్యంగా చేసుకుని చికిత్స అందిస్తే, మరో వ్యసనం మరింత పెరిగే ప్రమాదం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. వ్యసనాల మూలం మద్యపానం, ధూమపానం ఒకదానితో ఒకటి బలంగా జతకట్టడానికి కారణం గ్లూటమేట్ అనే న్యూరోట్రాన్స్‌మిటర్. ఇది మెదడులోని అతిపెద్ద ఉత్తేజక రసాయనం. ఆల్కహాల్, నికోటిన్ తీసుకోవడం వల్ల గ్లూటమేట్ స్థాయి పెరుగుతుంది. దీంతో మెదడులోని "రివార్డ్ సర్క్యూట్రీ" మరింత చురుకుగా మారి వ్యసనాన్ని కొనసాగించేలా చేస్తుంది. న్యూరాన్లు పరస్పరం సంభాషించుకునే విధానం, ఆనందం–విశ్రాంతి వంటి అనుభూతులు కలిగించే ప్రక్రియలపై ఈ పదార్థాల ప్రభావం ఇప్పటికే శాస్త్రవేత్తలకు స్పష్టమైంది. ఆహారం, శృంగారం, సామాజిక సంబంధాలు సహజంగా ఈ సర్క్యూట్రీని యాక్టివేట్ చేస్తాయి. కానీ మద్యపానం, ధూమపానం వంటి కృత్రిమ ఉత్తేజకాలు ఈ ప్రక్రియను దుర్వినియోగం చేసి మనిషిని వ్యసనాల బానిసగా మారుస్తాయి. ఇంతగా ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్న మద్యపానం, ధూమపానాన్ని నియంత్రించి ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని నిర్మించడం రాజ్యాంగం ప్రభుత్వాలకు విధించిన కర్తవ్యం. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈబాధ్యతను పూర్తిగా నిర్వర్తించలేకపోతున్నాయి. మద్యపానం, ధూమపానం వల్ల అధికంగా డబ్బు ఖర్చు చేసి అనారోగ్యం పాలవుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముందువరుసలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఆరోగ్యవంతమైన రాష్ట్రం, దేశంఎలాసాధ్యమవుతుంది? సామాజిక రుగ్మతల వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నప్పటికీ, వీటిపై వచ్చే ఆదాయాన్ని ప్రధాన వనరుగా భావించడం అమానవీయతకు పరాకాష్ట. ఇది సంక్షేమ రాజ్యం, శ్రేయో రాజ్య భావనకు పూర్తిగా విరుద్ధం. జబ్బు ఒకటి – మందొకటి అనే ద్వంద్వం విడనాడాలి. నిజంగా ప్రజా సంక్షేమమే ప్రభుత్వాల ఆశయమైతే, మద్యపానం, ధూమపానంపై పన్నులు వేస్తూ హెచ్చరిక ప్రకటనలతో కాలం గడపడం సరిపోదు. ఈ ఉత్పత్తులే ప్రధాన ఆదాయ వనరుగా భావించడం మానవీయ పాలన కాదు. మద్యపానం, ధూమపానం తదితర మత్తుపదార్థాలను సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వాలు కట్టుబడాలి. వాటి ఉత్పత్తి కేంద్రాలను దశలవారీగా మూసివేయాలి. ప్రభుత్వాల ప్రచార ఆర్భాటాలు, దుబారా ఖర్చులను తగ్గించి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అభివృద్ధి చేయాలి. ప్రజారోగ్యాన్ని కేంద్రీకృతంగా చూసే విధానాలకు మారాల్సిన అవసరం ఉంది. ఈ విషవలయంలో నుంచి ప్రజలను బయటకు తీసుకురావడమే నిజమైన సంక్షేమం, శ్రేయో రాజ్య నిర్మాణానికి సరైన మార్గం. ●

# ప్రజావాక్కు



### వృద్ధులు అనాథలు కాకూడదు !

**తల్లిదండ్రుల** ఆస్తులుపంచుకోవటానికి కొడుకులు, కూతుళ్లు ముందుకు వస్తారు. తల్లిదండ్రుల్ని ప్రేమగా చూసుకునేందుకుమాత్రంవాళ్ళమనస్సు లు వెనక్కిపోతున్నాయి. ఇప్పుడేదోవయస్సు లో వుండి, ఆరోగ్యంతో, ఒంటిబలంతో ఉన్నామనుకుంటే పొరపాటు. ఎప్పుడూ ఇలాగే ఉంటామనుకుంటే మహాపొరపాటు. అందరికీ వయస్సు పెరుగుతుంది. వృద్ధాప్యం వస్తుంది. చేసుకోలేని స్థితి దాపురిస్తుంది. ఇప్పుడు కళ్ళుమూసుకుపోయికన్నవాళ్ళని అనాదరణకి గురిచేసి, అసహించుకొని, అన్యాయంచేస్తే చేసుకున్నవాడికిచేసుకున్నంత మహదేవ!అన్నట్లు రేపువీళ్ల కొడుకులు, కూతుళ్లు అలాగేచేస్తారు. అప్పుడు తెలుస్తుంది చేసిన పాపమేమిటో! కొడుకులు, కూతుళ్ళ అభివృద్ధి కోసంఇదివరకు అమ్మ, నాన్నపడిన ఆరాటాన్ని, ఆతృతని, ఆవేదనని గుర్తుచేసుకొని, అర్థం చేసుకొని, తమ ఇంత అభివృద్ధికి వాళ్లే కారణమని వాళ్ళనిఅనాథల్ని చేయకుండా, చూసుకోవాలి.

- మా.శ్రీ.రాజు, పాల్వంచ

### గ్రామీణ రోడ్లను బాగు చేయాలి

**ఇటీవలి** కురిసిన భారీ వర్షాలకు గ్రామీణ ప్రాంత రోడ్లు ప్రమాదకరంగా మారాయి. చాలా గ్రామాలలో పొలాల నుండి భారీగా కురిసిన వర్షపు నీరు రోడ్ల పై నుండి ప్రవహించి రోడ్లు కోతకు గురైయ్యాయి. ఈ పరిస్థితుల్లో గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారి, కంకరతేలి ప్రమాదాలు జరిగేవిధంగా తయారయ్యాయి. అదేవిధంగా రోడ్ల వెంట కంపచెట్లు పెరిగివాహనదారులు గాయపడేవిధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంతాలలో ప్రమాదకరంగా దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలి.

- టి. యోగేందర్, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా

### ఆయుర్వేద వైద్యంపై దృష్టి

**మనదేశంలో** 95శాతం వ్యక్తులు అల్లోపతి వైద్యంపైనే ఆధారపడ్డారు. ఈ వైద్య విస్తృత పరిశోధన పరిస్థితులకు కారణంగామారింది. ఇటీవల జాతీయస్థాయిలో సంప్రదాయవైద్యం కూడా అందుబాటులోకి వచ్చి ప్రత్యామ్నాయ ఎంపికకు వైద్యశాలలు, మందులు వగైరా ఏర్పాటు నిమిత్తం దృష్టిసారించారు. ఆయుర్వేద వైద్యం తక్కువ ఖర్చుతో ప్రజలు అలవాటు పడడం మంచిది.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### భారత్‌కు కృతజ్ఞత చూపాలి

**భారత్**చరిత్రలో నిలిచిపోయే గొప్పసహాయం 1971లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ మొక్కవోని సంకల్పంతో పాకిస్థాన్‌తో యుద్ధం చేసి బంగ్లాదేశ్ అనే దేశాన్ని నిర్మించినందుకు ప్రతీ బంగ్లా పౌరుడు భారత్‌కు జీవితాంతం కృతజ్ఞత చూపాలి. ఈ ప్రయత్నంలో బంగ్లా బంధువుగా పేరుగాంచిన షేక్ ముజఫర్ రహ్మాన్‌నిత్యంమన మహాత్మాగాంధీని స్మరించుకోవాలి. ఆయన విగ్రహానికి జయంతి, వర్ధంతి రోజున పూలదండలు వేసి ఆయన చేసిన కృషిని తలచుకోవాలి. ఆయన కుమార్తె షేక్ హసీనా పాలనవరకు భారతదేశంతో స్నేహహస్తాన్నిసారించింది. ఇప్పుడా బంగ్లాదేశ్ కృతజ్ఞతగా మెలగవలసిన సమయంలో కృతఘ్నత చూపిస్తున్నది. అవామీలీగ్ పార్టీ ప్రభుత్వాన్ని గద్దెదించిన మూల విరాట్టుగా చెప్పబడుతున్న షరీఫ్ ఉస్మాన్ హాది మరణంతో ఈ విధ్వంస కాండ జరిగిందని వార్త. అన్ని ప్రజా ప్రభుత్వాలు ఈ చర్యను తీవ్రంగా ఖండించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### వైద్య కళాశాలల విస్తరణ అవసరం

**వైద్య** విద్యను, ఆరోగ్య సేవలను సామాన్య ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగాఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ప్రభుత్వ వైద్య కళాశాలల విస్తరణ అవసరంగా మారింది. ప్రస్తుతం లభ్యమవుతున్న గణాంకాల ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రైవేటువైద్య కళాశాలల సంఖ్య ప్రభుత్వ కళాశాలల కంటే ఎక్కువగాఉంది. ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 18 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉంటే, తెలంగాణలో ఇటీవల 8 కొత్త కళాశాలలు మంజూరు కావడంతో ప్రభుత్వ కళాశాలల సంఖ్య 34కి పెరిగింది. ప్రభుత్వ వైద్య కళాశాలలు విద్యా, సామాజిక రీత్యా అనేక ప్రయోజనాలను అందిస్తాయి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సర్పంచ్‌ల బాధ్యతలు

**నూతనంగా** ఎన్నికైన సర్పంచ్‌లు ఆయా గ్రామాలలో ఇతర కులాలు, గ్రామాలు, ఇతర మండలాలకు చెందినవాళ్ళు ఎస్సి, ఎస్టీ, వికలాంగులకు సంబంధించిన ఇంటి స్థలం అక్రమంగా ఆక్రమించి మరుగు దొడ్లు, స్నానం గదులు నిర్వహించడం జరుగుతుంది. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీచట్టం కిందకేసులు నమోదు చేసి ఎస్సీ ఎస్టీల వికలాంగుల భూములు వారికి అప్పగించి తగిన న్యాయం చేసే విధంగా ప్రభుత్వం నూతన సర్పంచులకు ఆదేశాలు జారీ చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

ong-5_ong-5.qxd 12/24/2025 11:35 PM Page 1



# క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిసిన మంత్రులు, కలెక్టర్, పలువురు నేతలు








**ఒంగోలు, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రైస్తవ సోదర సోదరీమణులకు మంత్రులు డోలా స్వామి, గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాజీమంత్రి శిద్దా రాఘవరావులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ అంటే ఏసు ప్రభువును ఆరాధించే రోజు. విశ్వవ్యాప్తంగా ప్రజలందరిలో ప్రేమ,సహనం, శాంతి, కరుణ కూడిన విశ్వాసపూరితమైన, ఏసుక్రీస్తు చూపిన మార్గం మనందరికీ ఆచరణీయమని వారు అన్నారు. క్రైస్తవ సోదర,సోదరీమణులు సమా జశాంతి, సామరస్యం కోసం ఏసు ప్రభువును భక్తిశ్రద్ధలతో ప్రార్ధించాలని కోరారు. రాష్ట్ర ప్రజలు క్రిస్మస్ పండగ సంతోషంగా జరుపుకోవలని ఆకాంక్షించారు. క్రైస్తవ సోదరులకు తన హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేస్తునట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు.



ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక వార్త






# అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి నిరంతరం కృషి

**- ఆవులమందలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి డోలా, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే ఉగ్ర, ఇన్‌చార్జి గొట్టిపాటి**

**కురిచేడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తెలిపారు. బుధవారం దర్శి నియోజకవర్గం, కురిచేడు మండలంలోని ఆవులమంద పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆవులమంద పంచాయతీలో సుమారు కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, మినీ గోకులం షెడ్డులను ప్రారంభించడం ఎంతో ఆనందదాయకమన్నారు. పాస్టర్ల పెండింగ్ బకాయిలను కూడా ప్రభుత్వం విడుదల చేసిందని ఆయన తెలిపారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం చర్చిల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తే వాటిని గత ప్రభుత్వం ఆపేసిందని, ఇప్పుడు మరలా చర్చి నిర్మాణాలకు నిధులు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కొరకు కృషి చేస్తున్నామని మంత్రి చెప్పారు. ఎన్నికల ముందు చెప్పిన ప్రతి హామీని ప్రభుత్వం తూచా తప్పక అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్నదాతసుఖీభవ, తల్లికి వందనంలో భాగంగా ఎంత మంది పిల్లలు ఉంటే అంత మంది పిల్లలకి తల్లుల ఖాతాలలో నగదు జమ చేస్తున్నాం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, ఆడపడుచులందరికి ఉచిత బస్సు ప్రయాణం వంటి ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. త్వరలో హెల్త్ ఇన్సూరెన్స్ ఏ హాస్పిటల్‌లో అయిన 25 లక్షల వరకు అన్ని వర్గాల ప్రజలు వైద్యం చేసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మీరందరూ కోరుకున్నట్లు గానే దర్శిని ప్రకాశం జిల్లాలో ఉంచామన్నారు. ఈ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ దర్శి నియోజకవర్గ అభివృద్ధి కొరకు తన వంతు సహాయ సహకారం అందిస్తామన్నారు. పేద, వెనుకబడిన ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మా ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అన్నారు. కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యం ప్రజల కోసం పని చేస్తోందని చెప్పారు. ఇంత గొప్పగా అభివృద్ధి చేస్తున్న మన ప్రభుత్వంకి ప్రజలు ఎప్పుడూ అండగా ఉండాలన్నారు. దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ ప్రజా ప్రభుత్వంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేలా ముఖ్యమంత్రి కష్టపడుతున్నారని, దర్శి నియోజకవర్గానికి ఏ అవసరం ఉన్న మన మంత్రి, ఎంపీ పూర్తి సహాయ సహకారం అందిస్తున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## బాపట్ల పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా కాకోలు వెంకటేశ్వరు

**మార్టూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**



బాపట్ల పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా కాకోలు వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుండి బుధవారం ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా మండలంలోని పలువురు నాయకులు వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలియజేశారు.

# అధికార పార్టీలో ఫ్లెక్సీలు రగడ

*- ఫ్లెక్సీల తొలగింపు పట్ల డాక్టర్ మన్నె రవీంద్ర వర్గం నిరసన*

*- సిఐ అజయ్‌కుమార్‌కు ఫిర్యాదు డాక్టర్ మన్నే రవీంద్ర*

*ఫ్లెక్సీలను తొలగించడంపై ఉద్రిక్తత*

**యర్రగొండపాలెం, ప్రభాతవార్త**

యర్రగొండపాలెంలో ఫ్లెక్సీ తొలగింపు పట్ల రగడ చోటు చేసుకుంది.. అధికార పార్టీకి చెందిన డాక్టర్ మన్నే రవీంద్ర ఫ్లెక్సీలు నెట్టి పరిస్థితుల్లో తొలగించాల్సిందే అంటూ ఎరీక్షణ బాబు వర్గం పంతానికి దిగింది.. తమ ఫ్లెక్సీలు తొలగిస్తే ఊరుకునే ప్రసక్తే లేదంటూ డాక్టర్ రవీంద్ర వర్గం రోడ్డెక్కి హెచ్చరికలు చేసింది. దీంతో అటు ఎరీక్షణ బాబు బాబు వర్గం, మరోవైపు డాక్టర్ మన్నే రవీంద్ర వర్గం వద్ద తీవ్ర ఉద్రిక్తతలు చేసుకున్నాయి. రోడ్డెక్కి రెండు వర్గాలు ఆరోపణలకు దిగడంతో ఏం జరుగుతుందోనన్న భయాందోళన వాతావరణం బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. అధికార పార్టీకి చెందిన రెండు వర్గాల మధ్య ఫ్లెక్సీల రగడతో మరోసారి వైపాలెంలో బొగ్గుమన్నాయి. పట్టణంలోని పలు సెంటర్‌లో ప్రముఖ వైద్యులు మన్నెరవీంధ్ర వర్గానికి చెందిన అభిమానులు, పార్టీ కార్యకర్తలు,నాయకులు నేతలు ఫ్లెక్సీలను భారీగా ఏర్పాటు చేశారు, క్రిస్మస్ నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని పెద్ద ఎత్తున పలు ప్రాంతాల్లో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటుకు సందేహాలు చేశారు.ఈ ఏర్పాటును నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు వర్గం అడ్డుకుంది. దీంతో రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. రెండు వర్గాల తీరుతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముందస్తు సమచారం ఇవ్వ ఇవ్వలేదంటూ మన్నేరవీంధ్ర వర్గం కట్టిన ఫ్లెక్సీలను అధికారులు తొలగించడం జరిగింది.



అధికారుల తీరుతో ఒక్కసారిగా షాకుకు గురైన రవీంద్ర వర్గం నిరసనకు నిరసన దిగారు. తమ ఫ్లెక్సీలను తొలగిస్తే ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరికలు జారీచేసిన అధికారులు మాత్రం మరి వర్గం ఆదేశాల మేరకు తొలగించే ప్రక్కరకు శ్రీకారం చుట్టారు. మన్నె రవీంద్ర వర్గం తొలగించిన ఫ్లెక్సీల ప్రక్రియపై సిఐ అజయ్ కుమార్ దృష్టికి దృష్టికి తీసుకు వెళ్లారు. ఫ్లెక్సీల రగడ ఉధృతకు దారి తీయడంతో అన్ని పార్టీల ఫ్లెక్సీలను తొలగించేందుకు పంచాయతీ కార్యదర్శి శ్రీకారం చుట్టారు. ఎట్టి పరిస్థితుల్లో ఎవరి ఫ్లెక్సీలను ఇచ్చే ప్రసక్తి లేదంటూ పంచాయతీ కార్యదర్శి ఏర్పాటు చేసిన వాటి అన్నిటిని తొలగించారు. అయితే అధికార పార్టీలోని రెండు వర్గాలతో నెలకొన్న ఫ్లెక్సీల రగడతో తమకు సంబంధం లేదని మా పార్టీ ఫ్లెక్సీలు తొలగిస్తే ఊరుకునే ప్రసక్తే లేదంటూ ఖబర్దార్ అని వైకాపా నాయకులు హెచ్చరికలు జారీ చేశారు పంచాయితీ కార్యదర్శి పట్టణంలోని అన్ని పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.. ఇటీవల అటు అధికార పార్టీ, ఇటు ప్రతిపక్ష వైకాపా పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని పట్టణమంతా ఫ్లెక్సీలమయం చేశారు. దీంతో పెద్ద ఎత్తున ఫ్లెక్సీల తొలగింపు ప్రక్రియను అధికారులు తీవ్రతరం చేశారు.అయితే నూతన సంవత్సరంగా ప్రముఖ వైద్యులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మన్నెరవీంధ్ర ఫ్లెక్సీలు రాత్రికి రాత్రే పట్టణమంత వెలుబడటంతో ఈవిషయాన్ని జీర్ణించుకోలేని అధికార పార్టీలోని మరోవర్గం వారు తొలగిస్తున్నారని మన్నేరవీంధ్ర వర్గం బహిరంగంగానే ఆరోపించారు.అయితే మధ్యలో నియోజకవర్గ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఫ్లెక్సీలను తొలగిస్తుండటంతో వైసీపీ శ్రేణులు భారీగా పంచాయితీ కార్యలయం వద్దకు తరలి వచ్చారు, పంచాయితీ కార్యదర్శిని ఎమ్మెల్యే ఫ్లెక్సీలను తీయడంపై నిలదీశారు. ఒకవైపు అధికార పార్టీలోని రవీంద్ర వర్గం, మరో వైపు వైకాపా కార్యకర్తలు ఫ్లెక్సీల తొలగింపు పై నిరసనకు దిగారు. దీంతో పరిస్థితులు ఉద్రిక్తలకు దారి తీయడంతో అనుమతులతో ఏర్పాటుచేసిన ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఫ్లెక్సీలను యధాస్థితిలోనే కట్టిస్తామని చెప్పడం వైకాపా వర్గీయులు వెనుదిరిగారు. గ్రూపుల గోల తో మీరు మీరు కొట్టుకొని మా ఫ్లెక్సీలు తొలగిస్తే ఊరుకునే ప్రసక్తే లేదంటూ వైకాపా కార్యకర్తలు తీవ్రంగా హెచ్చరించారు. ఫ్లెక్సీల తొలగింపు రగడ అధికార పార్టీలో అగ్గి రగిలించింది. మూడు దశాబ్దాలుగా పార్టీకి పెద్ద దిక్కుగా నిలిచిన తన ఫ్లెక్సీలను తొలగించే స్థాయికి ఎరీక్షణ బాబు వర్గం రావడం బాదేస్తుందని డాక్టర్ రవీంద్ర తన వర్గీయుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. అధికార పార్టీ లో నెలకొన్న ఫ్లెక్సీల గొడవ ఎక్కడికీ దారితీస్తుందో వేచి చూడాల్సిందే.

## విద్యుత్ షాక్‌తో మూగజీవి మృతి

**- పట్టీ పట్టనట్టు ఉంటున్న విద్యుత్ అధికారులు**

**కొత్తపట్నం, డిసెంబర్ 24, ప్రభాతవార్త**



విద్యుత్ షాక్ తగలడంతో మూగజీవి అక్కడకు అక్కడ మృత్యువాత పడింది. ఆ సమీపంలో ఉన్న బాలికల హాస్టల్ విద్యార్థులు భైందోళన చెందారు. కొత్తపట్నం మండలం, కొత్తపట్నం గ్రామంలో బాలికల హాస్టల్ సమీపంలో ట్రాన్స్ఫారం ఉంది. అక్కడ ఫీజుల నుండి భూమిలోకి ఎర్త్ పైపు వేశారు ఎర్త్ నుండి విద్యుత్ వైర్ కు మధ్యలో టేప్ గాని. పైప్ కానీ లేకపోవడం విద్యుత్ సరఫరా అయ్యి మేతమీయడానికి వెళ్లిన గొర్రె విద్యుత్ షాక్ తగిలి చనిపోయింది సుమారు రూ 20వేల గొర్రె చనిపోయిందని యజమాని వాపోయాడు. నిత్యం ఆ ట్రాన్స్ఫారం వైపు వెళ్లే హాస్టల్ విద్యార్థులు బైందోళనకు చెందారు. విద్యార్థులు ఆ ప్రాంతంలోనే ఆటలు కూడా ఆడుకుంటారు. విద్యార్థులకు పెను ప్రమాదం తప్పిందని ఇకనైనా విద్యుత్ అధికారులు కంచి వేయాలని విద్యార్థులు కోరుకుంటున్నారు. మండలంలో ఏదో ఒక చోట మూగజీవులు మృత్యువాత పడుతూనే ఉన్నాయి మండలంలో ట్రాన్స్ఫార్మర్ దగ్గర సరైన భద్రతలు లేనందున మూగజీవాలు మృత్యు వాత పడుతూనే ఉన్నాయి. ఇటీవల అల్లూరు గ్రామంలో లక్ష రూపాయలు గేదె మృత్యువాత పడింది, కొత్తపట్నంలో బుధవారం గొర్రె మృత్యువాత పడింది, ఇలా వ్రాసుకుంటూ పోతే అనేక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. మండల విద్యుత్ అధికారులు పట్టి పట్టినట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి వచ్చి పరిశీలించిన దాకాలు కనిపించడం లేదు. ట్రాన్స్ఫార్మలు చుట్టూ కంచి ఏర్పాటు చేయాలన్న ఆలోచన పెట్టడం లేదు, భూమి నుండి వచ్చే ఎర్త్ పైపులకు విద్యుత్ సరఫరా అయ్యి ప్రమాదాలు జరుగుతున్నాయి, ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్ఫార్మర్లు ఉన్నచోట కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి ప్రమాదాలు అరికట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## భార్యను హత్యచేసిన కేసులోని నిందితుడికి జీవిత ఖైదు

**కొత్తపట్నం, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

కొత్తపట్నం, మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన తాబేటి కృపారావు తన భార్య సుభాషిని హత్య చేసిన ఘటనలో నిందితుడికి జీవిత ఖైదు, రూ.15,000 జరిమానా ఒంగోలు 2 వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి విధించడం జరిగింది. నిందితుడికి శిక్ష పడటంలో సమర్ధవంతంగా విధులు నిర్వహించిన పోలీస్ అధికారులను మరియు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ తెలియజేశారు. వివరాల్లోకెళ్తే ప్రకాశం జిల్లా, కొత్తపట్నం మండలం, ఈతముక్కల గ్రామానికి చెందిన తాబేటి కృపారావు (35సం.) కు మద్దిపాడు మండలం, రాచవారిపాలెం గ్రామానికి చెందిన సుభాషిని (33సం.)తో 14 సంఖి క్రితం వివాహం జరిగింది. వివాహం అయిన కొద్దికాలం తరువాత తాబేటి కృపారావు మద్యానికి బానిసై, పనికి వెళ్లకుండా భార్యపై అనుమానాలు పెంచుకొని ఆమెను శారీరకంగా, మానసికంగా వేధిస్తూ ఉండేవాడు. ఈ వేధింపులు తట్టుకోలేక సుభాషిని ఈతముక్కల గ్రామంలో తన అక్క సునీత వద్దకు వెళ్లి నివసిస్తోంది. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో రాజీ కుదుర్చుకొని, నిందితుడి మాటలు నమ్మి సుభాషిని మళ్లీ భర్త వద్దకు వెళ్లింది. అయితే తేదీ: 24.12.2015 రాత్రి, తాబేటి కృపారావు సుభాషినిని రోకలిబండతో కొట్టి చంపిన ఘటన ఫిర్యాదిపై కొత్తపట్నం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్: 86/2015 ధ్ర 498(ఎ), 302 ఐపీసీ ప్రకారం కేసు నమోదు చేయబడింది. అప్పటి ఒంగోలు టూ టౌన్ సీఐ పి.దేవప్రభాకర్ అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు పంపించి, అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. పోలీసులు సమయానుసారం సాక్షులను కోర్ట్ నందు హాజరు పరుచగా అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యత్తపు కొండారెడ్డి, కె.వి. రామేశ్వర రెడ్డి ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు. జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో ప్రత్యేక మానిటరింగ్ టీం ద్వారా సమర్థవంతంగా ట్రయల్ నడిపి సరైన సాక్షాదారాలతో నిందితుడుపై పలు సెక్షన్ ల క్రింద నేర నిరూపణ చెయ్యడంతో 24.12.2025న ఒంగోలులోని గౌరవ ఒంగోలు 2 వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పందిరి లలిత జీవిత ఖైదీ మరియు రూ.15,000 వేలు జరిమానా విధించడం జరిగింది. సాక్షులను సరైన సమయంలో హాజరుపరచి నిందితునికి శిక్ష పడేందుకు కోర్టు లైజన్ ఏఎస్ఐ లక్ష్మీనారాయణ, అలాగే కొత్తపట్నం కోర్టు పి.సి. ప్రసాద్ తోడ్పడ్డారు. పై కేసులో ముద్దాయికి శిక్ష పడటంలో కృషిచేసిన పోలీస్ అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్ట్ లైజన్ సిబ్బందిని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ప్రత్యేకంగా అభినందించారు.

# పాస్టర్లకు రూ.51 కోట్ల బకాయిలు చెల్లించాం

*- క్రీస్తు మార్గం అందరికి అనుసరణీయం*

*- కుల, మతాలకు అతీతంగా అర్హులకు పథకాలు*

*- సెమీ క్రిస్మస్ వేడుకల్లో*

*ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్*

**బల్లికురవ, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

సర్వ మానవాళి రక్షణకై ప్రభావించిన ఏసుక్రీస్తు భూమిపై అరుదించిన శుభదినం క్రిస్మస్ పర్వదినమని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురష్కరించుకుని ఆయన రాష్ట్ర ప్రజానీకానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ ఏసుక్రీస్తు అనుసరించిన మార్గం అందరికి అనుసరణీయమని స్పష్టం చేశారు. బుధవారం నాడు అద్దంకి నియోజకవర్గం స్థాయిలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి క్రైస్తవులందరికి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పాస్టర్లకు మంత్రి గొట్టిపాటి నూతన వస్త్రాలను బహుకరించారు. క్రైస్తవుల సంక్షేమానికి సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరగానే పాస్టర్లకు చెల్లించాల్సిన రూ.51 కోట్ల గౌరవ వేతన బకాయిలను వెంటనే విడుదల చేసి లబ్ధిదారులకు అందించి నట్లు ఆయన గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మొదటిసారిగా క్రైస్తవులకు గౌరవ వేతనాన్ని అందించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. కుల మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఓటేసిన వాళ్లను ఒకలా, వేయని వాళ్లను మరోలా కూటమి ప్రభుత్వం చూడటం లేదన్నారు. కుల, మతాల మధ్య చిచ్చు పెట్టి లబ్ది పొందే కార్యక్రమాలకు సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం వ్యతిరేకమని మంత్రి వెల్లడించారు. ఎన్నికల తరువాత రాష్ట్రంలోని అందరిని ఒకే దృష్టితో చూస్తున్నామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో సంక్షేమాన్ని అందించడమే తమ లక్ష్యమని మంత్రి గొట్టిపాటి చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన ఐదు సార్లులో తన విజయానికి అన్ని వర్గాల ప్రజలు కృషి చేశారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. క్రైస్తవులు, హిందువులు, ముస్లింలు అనే బేధం లేకుండా కూటమి ప్రభుత్వం సమానంగా చూస్తుందన్నారు. అవసరమైన అందరికి సహాయం చేస్తుందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రైస్తవులతో పాటు కూటమి నేతలు పాల్గొన్నారు.





## కోటి సంతకాలపై వ్యంగ వ్యాఖ్యానాలు సరైంది కాదు

**- పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్, వైసీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వైఎం ప్రసాద్‌రెడ్డి**

**ఒంగోలు, ప్రభాతవార్త**



కనిగిరి ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమం పై వ్యంగ వ్యాఖ్యానాలు చేయడం సరైంది కాదు, ఎమ్మెల్యే ఉగ్రకు వైద్యం యొక్క విలువ తెలుసు, పేద వర్గాలకు ప్రభుత్వ విద్య, వైద్యం వల్ల ఎంతో ఉపయోగం, కానీ టీడీపీ అధినేత చంద్రబాబు మెప్పు కోసం వైఎస్సార్‌సీపీ పై విమర్శలు చేయడం తప్పు అని పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్, వైసీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వైఎం ప్రసాద్‌రెడ్డి దుయ్యబట్టారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేశ చరిత్రలో రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా 17 మెడికల్ కాలేజీలను మాజీ సీఎం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసి, అందులో 7 పూర్తిచేశారు. ఇళ్లు కట్టాలం టేనే కనీసం రెండేళ్లు పడుతుంది. అలాంటిది ఐదు వేల కోట్లతో నిర్మించే ప్రభుత్వ కాలేజీలు నిర్మాణం ఎంత ఆలస్యం అవుతుందో మీకు తెలియదా. 40ఏళ్ల రాజకీయ చరిత్ర ,14 ఏళ్ల ముఖ్యమంత్రి అని చెప్పుకునే చంద్రబాబు ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ రాష్ట్రానికి తెచ్చారా. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11 సీట్లు అని అంటున్నారు. కానీ 40 శాతం ఓటు బ్యాంకు వచ్చింది. మీకు తెలియదా. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ను మీ టీడీపీ పార్టీ వాళ్లు కూడా వ్యతిరేకిస్తున్నారని, బయటకు చెప్పలేక మదనపడుతున్నారని, అది తెలుసుకుని మాట్లాడితే మంచిది, గత ప్రభుత్వాల హాయంలో మంజూరు చేసి, శంకుస్థాపనలు చేసిన భవనాలను మీరు ప్రారంభించుకుంటూ, టీడీపీలోనే అభివృద్ధి అంటూ గొప్పల డప్పులు కొడుతున్నారు. వెలుగొండ ప్రాజెక్టుకు చంద్రబాబు పునాది రాయితోనే వదిలేశారని అన్నారు. నడికుడి - శ్రీ కాళహస్తి రైల్వే మార్గం కాంగ్రెస్ హయాంలో మంజూరైంది. కనిగిరిలో అనేక అభివృద్ధి పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే మంజూరయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనేక సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు నిర్మించి రైతులకు జగనన్న అండగా ఉన్నారని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. వైఎస్ జగన్ పాలనలో రైతు పథకాలు, ధరల స్థిరీకరణతో రైతుకు అండగా నిలిచి భరోసా ఇచ్చారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా మూడు, నాలుగు పార్టీలను కలుపుకుని గద్దెనెక్కారన్నారు. చంద్రబాబు అబద్దపు హామీలతో అధికారంలోకి వచ్చారు. జగనన్న సింగిల్‌గానే ఎన్నికల పోటీల్లో ఉన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మళ్ళీ జగనన్న సీఎం కావడం ఖాయమని అన్నారు.

## దోస్తీ ఫౌండేషన్‌చే పేదలకు (రగ్గులు) దుప్పట్లు పంపిణీ..


**ఒంగోలు, ప్రభాతవార్త**



దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో తూనుగుంట్ల సాంబశివరావు వర్ధంతి సందర్భంగా వారి కుమారులు సురేష్ కుమార్, జగదీష్ కుమార్ ఆర్థిక సహాయంతో ఫుట్ పాత్ మీద నివసించే నిరాశ్రయులకు, నిరుపేదలకు, యాచకులకు వంద మంది కి దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మహబూబ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం చలికాలం పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని ఈ సంవత్సరం చలి విపరీతంగా పెరిగిందని నిరాసులైన పేదలు ఇబ్బంది పడకుండా దుప్పట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు, నత్తల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బాపట్ల పార్లమెంట్ టీడీపీ కమిటీలో సంతనూతలపాడు నియోజకవర్గానికి ఐదుగురుకు స్థానం

**సంతనూతలపాడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**




బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కమిటీలో సంతనూతలపాడు నియోజకవర్గానికి సంబంధించి ఐదుగురుకు స్థానం లభించింది. బాపట్ల పార్లమెంట్ టీడీపీ వైస్ ప్రెసిడెంట్‌గా గొల్లపూడి సుబ్బారావు(చీమకుర్తి) ఆర్గనైజింగ్ సెక్రటరీగా దార్ల రామారావు, అఫీషియల్ స్పోక్ పర్సన్‌గా మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాస్(సంతనూతలపాడు) ,కార్యదర్శులుగా సంతనూతలపాడు సిండికేట్ రైతు సొసైటీ చైర్మన్ కూకట్ల విజయమ్మ,(రుద్రవరం), మద్దిపాడు మాజీ ఎంపీపీ అప్పల కుమార్ స్వామి,(ఘుడియపూడి) సాదు వెంకటరత్నంలను ఈ మేరకు రాష్ట్ర తెలుదేశం పార్టీ అధిష్టానం నియమించారు. బాపట్లపార్లమెంట్ తెలుగుదేశం పార్టీలో సముచిత స్థానం కల్పించినందుకు ముఖ్యంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్‌లకు వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## సర్వ సమాజ హితాన్ని కోరేవే ఏసుక్రీస్తు బోధనలు

### - ఏఎంసీ చైర్మన్ తేలప్రోలు రమేష్



**అద్దంకిరూరల్ డిసెంబర్ 24, ప్రభాతవార్త**

కుందుర్రు గ్రామంలోని ప్రధాన ప్రార్థన మందిరంలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు, కీర్తనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ తేలప్రోలు రమేష్ హాజరై వేడుకలను మరింత శోభాయమానం చేశారు. ఈ సందర్భంగా తేలప్రోలు రమేష్ మాట్లాడుతూ, ఏసుక్రీస్తు బోధనలు కుల,మత,వర్గ భేదాలు లేకుండా సర్వ మానవాళి సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకున్నవని తెలిపారు. ప్రేమ,క్షమ, త్యాగం, సేవ భావమే క్రైస్తవ ధర్మ సారాంశమని, ఆ విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతికి సేవ చేయడమే నిజమైన క్రిస్మస్ సందేశమని పేర్కొన్నారు. సెమీ క్రిస్మస్ వేడుకలో భాగంగా తేలప్రోలు రమేష్ తన సొంత నిధులతో 100 నిరుపేద కుటుంబాలకు 400 చీరలను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమం ద్వారా నిరుపేద కుటుంబాలకు ఆనందం నింపినందుకు గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని పలువురు ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కుందుర్రు సొసైటీ చైర్మన్ కొప్పుల కొండలు, బోడేపూడి రామారావు, రావులపల్లి వెంకయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు,యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ప్రత్యేక ప్రార్థనలు, క్రిస్మస్ సందేశాలు, శాంతి శుభాకాంక్షలతో ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## బాపట్ల టీడీపీ నూతన కమిటీలో అద్దంకి నాయకులకు కీలక బాధ్యతలు











**అద్దంకిరూరల్ డిసెంబర్ 24, ప్రభాతవార్త**

బాపట్ల పార్లమెంటు తెలుగుదేశం పార్టీ నూతన కమిటీలో అద్దంకి నియోజకవర్గానికి చెందిన పలువురికి కీలక బాధ్యతలు దక్కాయి. పార్టీ బలోపేతమే లక్ష్యంగా రూపొందించిన ఈ కమిటీలో అద్దంకి ప్రాంతానికి చెందిన నాయకులకు ప్రాధాన్యత లభించడం విశేషంగా భావిస్తున్నారు. అద్దంకి నియోజకవర్గం నుంచి బాపట్ల పార్లమెంటు ఉపాధ్యక్షులుగా ఆలూరి శ్రీనివాసరావు (సంతమాగులూరు మండలం), పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శిగా గుంజి సుబ్బారావు (బల్లికురవ మండలం), పార్లమెంటు అధికార ప్రతినిధిగా కొండేటి ఇజ్రాయేల్ (బల్లికురవ మండలం), పార్లమెంటు కార్యదర్శిగా గొల్ల లలిత కుమారి (కొరిశపాడు మండలం), పార్లమెంటు సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా షేక్‌మొహిద్దీన్ (అద్దంకి టౌన్) నియమితులయ్యారు. ఈ సందర్భంగా నియమితులైన నాయకులు మాట్లాడుతూ, తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, లోకేష్ మరియు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీని గ్రామ స్థాయి నుంచి పార్లమెంటు స్థాయి వరకు మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు.

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొననున్న వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త డా. చింతలపూడి అశోక్ కుమార్



**అద్దంకిరూరల్ డిసెంబర్ 24, ప్రభాతవార్త**

సంతమాగులూరు మండలం పాతమాగులూరు గ్రామం ఎస్సీ కాలనీలో గురువారం రాత్రి నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకల్లో అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం డిసెంబర్ 25న గురువారం రాత్రి 8.30 గంటలకు జరగనుంది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని క్రైస్తవ సోదరులతో కలిసి పండుగ సంతోషాన్ని పంచుకోవాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అద్దంకి నియోజకవర్గ కార్యాలయం కోరింది. క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తూ, సామాజిక ఐక్యతకు నిదర్శనంగాఈ కార్యక్రమం నిలవనుందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

## క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన సంతమాగులూరు ప్రార్థనా మందిరాలు



**అద్దంకిరూరల్ డిసెంబర్ 24, ప్రభాతవార్త**

క్రైస్తవ సోదరులు అత్యంత ఘనంగా జరుపుకునే క్రిస్మస్ పండుగకు యావత్ ప్రపంచం సిద్ధమవుతున్న నేపథ్యంలో సంతమాగులూరు మండలంలోని వివిధ ప్రార్థనా మందిరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. మండల వ్యాప్తంగా ఉన్న చర్చిలను విద్యుత్ దీప కాంతులతో సుందరంగా అలంకరించారు. ఏసుప్రభు జన్మోత్సవానికి నాందిగా జరుపుకునే ఈ క్రిస్మస్ వేడుకలను బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా క్రీస్తు బోధనలను స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడంతో పాటు, పల్లె ప్రజలు భక్తిశ్రద్ధలతో ఊరేగింపులు చేపట్టనున్నారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి వంటి వరుస పండుగలు రావడంతో గ్రామీణ ప్రాంతాలు బంధుమిత్రుల సందడితో పండుగ వాతావరణంలో పులకించిపోతున్నాయి. సంతమాగులూరు మండలమంతా ఆనందోత్సాహాలతో కళకళలాడుతోంది. పాతమాగులూరు ప్రధాన ప్రార్ధనామందిరంలోవాఖ్య పరిచారికుడు రెవరెండ్ లాజరస్ ప్రత్యేక ప్రార్దనలు చేయనున్నారు.

## క్రిస్మస్ వేడుకలకు పల్లె సీమలు ముస్తాబు



**బల్లికురవ, డిసెంబర్24, ప్రభాతవార్త**

ప్రపంచంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకునే పండుగ క్రిస్మస్. రక్షకుడైన యేసుక్రీస్తు సర్వమానవాళిని రక్షించడానికి భూమిపై ఆరాధించిన శుభదినం క్రిస్మస్ పర్వదినమని క్రైస్తవ సోదరుల ప్రగాఢ విశ్వాసం. ఈ వేడుకలకు పల్లె సీమలలోని క్రైస్తవ దేవాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. విద్యుత్ దీపాలతో, కాంతులతో, పల్లె సీమలు ప్రభువు ప్రార్ధనలతో పులకించిపోతున్నాయి. ప్రకృతిలో ఎన్నో ఆకర్షణలు ఆనందాలు. కానీ క్రిస్మస్ అందించిన ఆనందం శాశ్వతమైనదని క్రైస్తవ మత బోధకులు కీర్తిస్తున్నారు. గతి తప్పిన మనిషి జీవితాన్ని తన ప్రేమ ద్వారా ఉద్ధరించాలని దేవుడు సంకల్పించాడు. దేవుడు లోకమును ఎంతో ప్రేమించాడని బైబిల్లోని వాక్యాలను వివరిస్తూ ప్రార్ధనలు కొనసాగుతున్నాయి. చిన్న పెద్ద తారతమ్యమేమి లేకుండా క్రిస్మస్ ప్రార్ధనలలో పల్లె ప్రజలు పులకించిపోతున్నారు.

## ముద్ర హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు









**యర్రగొండపాలెం, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

ఏసుక్రీస్తు ప్రపంచానికి బోధించిన ప్రేమ, దయ, శాంతి, కరుణ గురించి చిన్నారులకు తెలియజేయడానికి పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు జరిపినట్లు పాఠశాల చైర్మన్ శనగా నాగార్జునరెడ్డి తెలిపారు. యర్రగొండపాలెం పట్టణంలోని ముద్ర హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ నాగార్జునరెడ్డి ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలను అందంగా ముస్తాబు చేశారు. పాఠశాలలో చదివే మగ పిల్లలకు శాంతా క్లాస్ దుస్తులు, అమ్మాయిలకు దేవదూతల దుస్తులు వేయించి ప్రత్యేక ఆకర్షణగా నిలిపారు. శాంతా క్లాస్ వేషధారణలో పిల్లలు అద్భుత ప్రదర్శన చేశారు. పిల్లలకు బహుమతులు ఇస్తూ పిల్లలతో కలిసి నృత్యాలు చేస్తూ ఆలపించారు. అనంతరం చిన్నారులు నృత్యాలు చేశారు. ఈ సమావేశంలో పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రపంచ శాంతి కోసం ప్రేమ, దయ, కరుణ లాంటి అంశాలను బోధించారని, బైబిల్ ఒక మత గ్రంధం కాదు అని శాంతికి ప్రతిరూపమని కొనియాడారు. ఏసుప్రభు ప్రపంచానికి శాంతిదూత అని అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని ప్రపంచ వ్యాప్తంగా అందరూ జరుపుకుంటారని క్రీస్తు బోధనలు ప్రపంచానికి దిక్సూచి లాంటిదని అన్నారు. చిన్ననాటి నుంచి ఈ అంశాలను విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కలిగించడానికి పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శనగా సుబ్బారెడ్డి, పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## దేవినేనికి మంత్రి గొట్టిపాటి పరామర్శ



**బల్లికురవ, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో దేవినేని వేణుగోపాల్ భార్య నాగ భవాని ఇటీవల ప్రమాదవశాత్తు మరణించారు. సమాచారం అందుకున్న రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం వారి నివాస గృహంలో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. దేవినేని శివయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ దేవినేని నరేంద్ర, చిడిపోతు నరేంద్ర, అమరనేని కాశీవిశ్వనాథం తదితరులు ఉన్నారు.

## క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



**జరుగుమల్లి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

నియోజకవర్గ ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు , అధికారులకు, క్రైస్తవ సోదర సోదరీమణులకు, రాజశేఖరరెడ్డి అభిమానులకు, జగనన్న అభిమానులకు మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ బుధవారం ఒక ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ యొక్క క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రజలందరూ శాంతి సమాధానాలు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో, సంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆయన మనసారా అభినందనలు తెలిపారు.

## మానవాళి రక్షణ కోసమే క్రిస్మస్



**పెద్దదోర్నాల, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

పాపములో పడిపోయిన మానవునికి రక్షణ కలిగించేందుకు దేవుడు తన కుమారుడైన ఏసుక్రీస్తును ఈ లోకానికి పంపాడు. అందుకే క్రిస్మస్ అనేది రక్షణకు గుర్తు. ప్రేమకు చిహ్నం, శాంతికి సందేశం, యేసు జననము పాపాల నుండి మనుషులను రక్షించడం, దేవుని ప్రపంచానికి తెలియజేయడం శాంతి, క్షమ, దయ, ప్రేమ, మార్గాన్ని చూపించడం. దేవునితో సమాధానపడేందుకు దేవుడే మానవుడయ్యాడు. ఏసుక్రీస్తు పుట్టుక శుభవార్తను ముందుగా గొర్రెల కాపరులు విన్నారు. ఆకాశంలో కనిపించిన నక్షత్రం ద్వారా జ్ఞానులు ఆయనను దర్శించారు. ఆయన జన్మకు సాక్షులుగా నిలిచిన వారిలో నక్షత్రం. చీకటిలో వెలుగుగా వచ్చిన రక్షకునికి సాక్షిగా నిలిచింది. ఇదిగో ప్రజలందరికి కలగబో మహా సంతోషకరమైన శుభవర్తమానం మీకు తెలియజేస్తున్నాను. నేడు మీ కొరకు రక్షకుడు పుట్టి ఉన్నాడు అని దేవదూతలు రాత్రి వేళ గొర్రెలు కాపాడుకుంటున్న గొర్రెల కాపరులకు తెలియజేసి సాక్షులుగా నిలిచారు. అలాగే గొర్రెల కాపరులు కూడా ఏసుక్రీస్తును చూసిన తర్వాత ఆ శిశువును గురించి తాము విన్నది. అందరికి ప్రచారం చేసి సాక్షులుగా నిలిచారు. గొర్రెల కాపరులు సాధారణ జనానికి సాక్షులు అయితే జ్ఞానులు మాత్రం ఈ ప్రపంచానికి లోకరక్షకుడిగా ఏసుక్రీస్తు జన్మించాడని ప్రకటించి సాక్షులుగా నిలిచారు. నీవు సజీవుడవైన దేవుని కుమారుడు అని పేతురు సాక్షమిచ్చాడు. ఒక సాధారణ మనిషి ఇచ్చిన అసాధారణమైన ధైర్యం సాక్ష్యం. పుట్టుగుడ్డివాడైన ఇతను నేను గుడ్డివాడిని ఇప్పుడు చూస్తున్నాను. సత్యాన్ని ధైర్యంగా ప్రకటించి సాక్షిగా నిలిచాడు. తాను చెప్పక ముందే తన పాపాలను చెప్పాడని సమరయ స్త్రీ సాక్ష్యము ఇస్తూ ఇతను సామాన్యుడు కాదు దేవుడి నుండి వచ్చిన మనిషి అనిసాక్ష్యం చెప్పింది. యూదులు, దయ్యాలు, న్యాయమూర్తి, ఇలా ఒకరేమిటి ఎందరో యేసును గురించి సాక్ష్యం తెలిపారు. ఇలా దూతలు ప్రకటించారు. గొర్రెల కాపరులు చూశారు. నక్షత్రం మార్గదర్శకమైంది. జ్ఞానులు ఆరాధించారు. ఇవన్నీ ఏసు జననం సామాన్యమైనది కాదని, లోక రక్షకుడని సూచించాయి. క్రిస్మస్ ఉద్దేశం. పాపులైన మనుషులకు రక్షణ ఇవ్వడం. దేవుడు - మనిషి మధ్య సంబంధాన్ని పునరుద్ధరించడం, ప్రేమ, క్షమ, వినయము, సేవ అనే విలువలను నేర్పించడం, క్రిస్మస్ ఒక పండుగ మాత్రమే కాదు. మానవాళికి ఇచ్చిన దేవుని ప్రేమ కానుక. ఏసుక్రీస్తు జన్మదినము మన జీవితాల్లో కొత్త ఆశ. కొత్త వెలుగులు తీసుకురావాలని క్రిస్మస్ మనకు గుర్తు చేస్తుంది.

## టీడీపీ పార్లమెంట్ కమిటీలో పర్చూరుకు కీలక పదవులు

### - నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి



**మార్టూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

బాపట్ల పార్లమెంట్ పరిధిలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ కమిటీలో ఎమ్మెల్యే ఏలూరిసాంబశివరావు సిఫార్సు మేరకు పర్చూరు నియోజకవర్గానికి ప్రాధాన్యత కల్పిస్తూ పలువురికి కీలకబాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు నక్కల రాఘవ(కడవకుదురు)ను బాపట్ల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శిగా, రావిపాటి సీతయ్య(పోలూరు)నుపార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా, సయ్యద్ ఆజాద్(చిన్నగంజాం)ను పార్లమెంట్ అధికారి ప్రతినిధిగా, కాకోలు వెంకటేశ్వర్లు (మార్టూరు)ను పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా, సుధారాణి(నాగులపాలెం)ను పార్లమెంట్ కార్యదర్శిగా పార్టీ అధిష్టానం నియమించింది. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పని చేయాలన్నారు. పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ పార్టీకి మరింత బలం చేకూర్చాలని సూచించారు. అలాగే పదవులకు వన్నె తీసుకొచ్చేలా ప్రజల్లో విశ్వాసం పెంచే కార్యక్రమాలు చేపట్టాలని, పార్టీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేయాలని ఎమ్మెల్యే ఏలూరి పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే ధ్యేయంగా అందరూ సమిష్టిగా పని చేయలని ఆయన సూచించారు. పర్చూరు నియోజకవర్గానికి పార్లమెంట్ కమిటీలోకీలకప్రాతినిధ్యంలభించడంపార్టీశ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందని కార్యకర్తలు అభిప్రాయపడ్డారు.

## విద్యార్థినులకు క్యాన్సర్‌పై అవగాహన



**మార్టూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ అవగాహన కార్యక్రమం అనంతవరం, యద్దనపూడి, గన్నవరం, పూనూరు హైస్కూల్ 6వ తరగతి నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ద్వారా 350 అప్లికేషన్లు పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఏమిటంటే జనవరి 7వ తేదీ రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు తరుపున 500 మంది వ్యాక్సినేషన్ చేయుటకు రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారు అరేంజ్ చేయడం జరుగుతుంది. ఈ వ్యాక్సినేషన్ గురించి రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు చిన్నారులకు వివరించారు. తదుపరి మీ పేరెంట్స్‌తో చెప్పి అప్లికేషన్ మీద సంతకం చేపించుకుని వచ్చి పేరెంట్స్‌తో పాటు వ్యాక్సినేషన్ వేయించుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కోశాధికారి గోనుగుంట్ల రవికుమార్, హైస్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.

## ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ఆదిమూలపు సురేష్



**సింగరాయకొండ, డిసెంబర్ 24,ప్రభాతవార్త**

కొండేపి నియోజకవర్గ ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు, అధికారులకు, క్రైస్తవ సోదర-సోదరీమణు లకు మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ క్రిస్మస్ శుభాకాంక్షలును బుధవారం ఓప్రకటనలో తెలిపారు. అలాగే దివంగత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి అభిమానులకు, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అభిమానులకు కూడా ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్మస్ పండుగ ప్రజలజీవితాల్లో శాంతి, సమాధానాలు నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షి ంచారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

### - వితంతు, వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ



**కొనకనమిట్ల, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

మండలంలోని తువ్వపాడు గ్రామంలో కవనెంట్ చర్చిలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ కే.శామ్యూల్ ఏసుక్రీస్తు పుట్టుక, క్రిస్మస్ ప్రాధాన్యత గురించి వివరించారు. ఒకరి యెడల ఒకరు సహాయం చేసుకోవడం ఒకరిని ఒకరు గౌరవించుకోవడం, ఒకరికి మరొకరు ఏదైనా ఉచిత బహుమతులు ఇవ్వడం దేవుని ప్రేమను చాటటమే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అనేక మంది క్రైస్తవ సోదరులు దేవుని ఆరాధించారు. ఈ సందర్భంగా గతంలో జడ్పీహెచ్ఎస్ మర్రిపాలెంలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులుగా పని చేసిన అక్కల నారాయణ, దాసరి హేమలత, పీఎస్‌హెచ్‌ఎంలు గ్రామాన్ని సందర్శించి కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కల నారాయణ వారి తల్లిదండ్రులు అక్కడ శ్రీరాములు, లక్ష్మమ్మ, జ్ఞాపకార్థంగా కొందరు పేదలు వృద్ధ, వితంతు మహిళలకు 50 మందికి గ్రామ పెద్దలు, పాస్టర్ శామ్యూల్ ఆధ్వర్యంలో చీరలు, దుస్తులు బహుమతిగా అందజేశారు. అక్కడ నారాయణ, భార్య దాసరి హేమలత దాతృత్వాన్ని కొనియాడారు. క్రిస్మస్ సందర్భంగా వచ్చిన వారందరికి పలహారం అదే విధంగా క్యాండిల్ లైట్ సర్వీస్, కేక్ కటింగ్ నిర్వహించారు.

## సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వసతి గృహాలు

### - మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, గొట్టిపాటి లక్ష్మి





**తాళ్లూరు, డిసెంబర్24,ప్రభాతవార్త**

సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ,రాష్ట్రంలో వసతి గృహాల నిర్వహణలో ప్రభుత్వం సమగ్రమైన మార్పులు తీసుకొస్తున్నట్లు రాష్ట్రసాంఘిక ,సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి,ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహం టైప్2 నూతనంగా నిర్మించిన భవనాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ దాదాపు 8 సంవత్సరాల క్రితంతమ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాలికా విద్యార్థుల కోసం భవనం మంజూరు చేశారన్నారు. బాలికా వసతి గృహం యొక్క ప్రాధాన్యతను గుర్తించి విద్యా శాఖ మంత్రినారాలోకేష్ దృష్టికి తీసుకువెళ్ళి ఆయన సహకారంతో మిగిలిన నిర్మాణం పూర్తి చేశారన్నారు. హాస్టల్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందని ఆయన చెప్పారు. వసతి గృహాల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన మార్పులు తీసుకొస్తున్నట్లు తెలిపారు. పిల్లలకి అవసరం అయిన త్రాగు నీరు ఆర్వో ప్లాంట్ ,నాణ్యమైన బియ్యం అదేవిధంగా విద్యార్థులకి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్‌ను అందిస్తున్నారు. అందులో బ్యాగ్, బుక్స్, బూట్లు, టై, యూనిఫాం వంటివి ఉన్నాయన్నారు. పరీక్షలు దగ్గరపడిన నేపద్యంలో 100 రోజుల యాక్షన్ ప్లాన్ తీసుకుని గుణాత్మక, నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తున్న గొట్టిపాటి లక్ష్మిని ఆయన అభినందించారు. బీసీ కాలేజీ బాయ్స్ వసతి గృహం కావాలని అడిగారనీ, ఎంత మంది బీసీ విద్యార్థులు ఉన్నా కూడా ఎస్సీ హాస్టల్‌లో అడ్మిషన్ కల్పించి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నడుపుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన అన్నారు. ఎంపీ మాగుంట మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు లాగా బావిస్తున్నారన్నారు. రోడ్లు నిర్మాణం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, అన్నా క్యాంటీన్లు, అన్నదాతసుఖీభవ, దీపం2 , తల్లికి వందనం, ఉచిత బస్సు లాంటి అనేక సంక్షేమ, అభివృద్ధి పనులు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కేజీబీవీకి అవసరం అయిన వసతులు పూర్తి స్థాయిలో కల్పిస్తున్నట్లు ఆమె చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్య తోపాటు, భద్రమైన వసతి, మంచి భవిష్యత్ విద్యార్థులకి ఇవ్వాలని స్పష్టమైన లక్ష్యంతో పని చేస్తుందన్నారు. పేద, వెనుకబడిన బాలికలను ముందుకు తీసుకువెళ్లాలని నిర్ణయం చాలా మెచ్చుకోదగిందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నియోజకవర్గం నాయకులు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, మండలపార్టీ అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర నాటకఅకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిరెడ్డి ఓబుల్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఐ వెంకటేశ్వరరెడ్డి, నాయకులు మానం రమేష్ బాబు, గొల్లపూడి వేణుబాబు, వల్లభనేని సుబ్బయ్య, బొడ్డు హనుమారెడ్డి, ఐ.శ్రీనివాసురెడ్డి, గొంది రమణారెడ్డి(సమర), గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (చందన), రాచకొండ వెంకట్రావు, వెలుగు సుబ్బారావు, పిన్నిక రమేష్, యత్తపు కాశిరెడ్డి, యాతం శ్రీనివాసరెడ్డి, కైపు రామ కోటిరెడ్డి, కైపు నాగార్జున రెడ్డి, రావి నూతల పరిశుద్ధరావు, గంగిరెడ్డి కృష్ణారెడ్డి, చాట్ల దాని తహసీల్దార్ బచ్చల వెంకట రమణారావు, ఎంపీడీఓ పి అజిత, విద్యుత్ శాఖ ఏఈ ఎం. రామకృష్ణ రెడ్డి, ఎస్ఐ మల్లికార్జున రావు, ఏఓ ప్రసాదురావు, ఎంఈఓలు సుబ్బయ్య, సుధాకర్‌రావు, కేజీబీవీ ప్రిన్సిపల్ సుజిత, పలుశాఖ అధికారులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత సుబ్బారెడ్డిను పరామర్శించిన ఎంపీ మాగుంట



**తాళ్లూరు, డిసెంబర్ 24 ,ప్రభాతవార్త**

మండలం లోని విఠలాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మేడగం సుబ్బారెడ్డి కుమారుడు మేడగం రామిరెడ్డి ఇటేవలె పల్నాడు జిల్లాలో గణపవరం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం లో మృతి చెందాడు. బుధవారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సుబ్బారెడ్డిను పరామర్శించారు. మనోధైర్యంగా ఉండాలని సుబ్బారెడ్డిను ఓదార్చారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళిర్పించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు మారంఇంద్రసేనారెడ్డి, వైస్ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, ఉపసర్పంచ్ యత్తపు కాశిరెడ్డి, నాయకులు రాయుడు, గూడా ప్రభాకర్ రెడ్డి, రమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

## క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన పిల్లి తిరుపతిరెడ్డి



**పొన్నలూరు, డిసెంబరు 24, ప్రభాతవార్త**

పవిత్ర క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ప్రతి కుటుంబానికి ఆరోగ్యం, శ్రేయస్సు, సుఖ సంతోషాలు కలగాలని కోరుకుంటూ రాష్ట్ర ప్రజలకు, క్రైస్తవ సోదరులకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఆర్టీఐ వింగ్ కార్యదర్శి పిల్లి తిరుపతి రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు సందేశం ప్రతి ఒక్కరి హృదయంలో నిలిచి, సమాజంలో సోదరభావం, కరుణ, మానవత్వం పెంచిందన్నారు. ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, శాంతియుత వాతావరణంలో క్రిస్మస్ వేడుకలను జరుపుకోవాలని అన్నారు.

## ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మాలపాటి మనోహర్‌రెడ్డి



**హనుమంతునిపాడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

క్రిస్మస్ పండుగను పురష్కరించుకుని మండల క్రైస్తవ సోదర, సోదరీమణులకు మండలంలోని నల్లగండ్ల టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు మాలపాటి మనోహర్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఏసు ప్రభు మార్గాన్ని అనుసరించే ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగు నిండాలని ఆకాంక్షించారు.

## ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన బత్తుల నాగార్జునరెడ్డి (ఎన్ఆర్ఐ)



**హనుమంతునిపాడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

క్రిస్మస్ పండుగ పర్వదినం పురష్కరించుకుని హనుమంతునిపాడు మండల వైసీపీ యువ నాయకుడు బత్తుల నాగార్జునరెడ్డి(ఎన్ఆర్ఐ) క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు జన్మించిన ఈ శుభదినాన అందరికి శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని ఆకాంక్షించారు.

## ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన కోటపాటి సందీప్‌రెడ్డి



**హనుమంతునిపాడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

క్రిస్మస్ పండుగను పురష్కరించుకుని మండల క్రైస్తవ సోదర, సోదరీమణులకు మండలంలోని దొడ్డిచింతల గ్రామ వైసీపీ యువ నాయకుడు కోటపాటి సందీప్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన

### టీడీపీ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ముప్వా రంగసాయి యాదవ్



**హనుమంతునిపాడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందోత్సహాల మధ్య క్రిస్మస్ పండుగను జరుపుకోవాలని టీడీపీ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఉమ్మనపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు ముప్వా రంగసాయి యాదవ్ కోరారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురష్కరించుకుని ఆయన మాట్లాడుతూ లోక రక్షకుడు ఏసుక్రీస్తు పుట్టిన రోజు అయిన క్రిస్మస్ పండుగ కుల, మతాలు, పార్టీలకు ఆతీతంగా ప్రపంచ శాంతి, సంతోషానికి చిహ్నంగా కోట్ల మంది జరుపుకునే పండుగ క్రిస్మస్ అని, ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, దయ, కరుణలను ప్రతి ఒక్కరి పట్ల చూపిస్తూ రాగద్వేషాలకు తావు లేకుండా పయనించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ప్రతి ఒక్కరూ ప్రార్ధన నిర్వహించాలని ఆకాంక్షించారు.

## క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు



**కొనకనమిట్ల, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

మండలంలో క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు బుధవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. కొనకనమిట్ల షారోన్ తెలుగు బాప్టిస్ట్ చర్చి, క్రీస్తు మందిరం, ఈసీఐ చర్చిలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఎదురాళ్లపాడు తెలుగు బాప్టిస్ట్ చర్చి, పెద్దారికట్ల పునీత బాప్తిజ తెలుగు బాప్టిస్ట్ చర్చిలు, సిద్ధవరం, మునగపాడు నాగాజు కుంట, గొట్లగట్టు, చిన్నారికట్ల తదితర గ్రామాలలోని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేకంగా షామియానాలు ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి నుంచి ప్రార్ధన నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రామాల పాస్టర్లు తెలిపారు.

## స్వచ్ఛ ఆంధ్రా స్వర్ణ ఆంధ్రా కార్యక్రమంలో బీజేపీ నాయకులు

**గిద్దలూరు, డిసెంబరు 24 ,ప్రభాతవార్త**



భారతీయ జనతాపార్టీ జాతీయ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు ఆదేశాలమేరకు గిద్దలూరు పట్టణములో పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జెవి.నారాయణ ముఖ్య అతిథిగాస్థానికస్ప్రింగ్‌బోర్డు స్కూల్‌లో స్వచ్ఛ్ ఆంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్ పాయ్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించడం జరిగింది.

## స్ప్రింగ్ బోర్డులో ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

**గిద్దలూరు, డిసెంబరు 24 ప్రభాతవార్త**



గిద్దలూరు పట్టణంలోని స్థానిక స్ప్రింగ్ బోర్డు పాఠశాలలో ప్రీ క్రిస్మస్ వేడుకలు బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డా జెవి నారాయణ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ మానవత్వం, త్యాగం, సోదరభావాన్ని పెంపొందిస్తుందని అన్నారు. యేసుక్రీస్తు బోధనలను విద్యార్థులు తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు. ప్రిన్సిపాల్ జాడి శ్వేత మాట్లాడుతూ పాఠశాలలో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు మానవ విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ మణి చైతన్య మాట్లాడుతూ యేసు క్రీస్తు జననం ప్రపంచానికి ఆశను, మానవత్వానికి మార్గదర్శకత్వాన్ని అందించిందని తెలిపారు. విద్యార్థులు తమ జీవితాల్లో దయ, సహనం, పంచుకునే స్వభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మంచి మనసే గొప్ప బహుమతి అని, సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు అలాగే ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ, పండుగల ద్వారా ఐక్యత, పరస్పర గౌరవం అలవడుతుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన యేసుక్రీస్తు జన్మకథ ఆధారిత నాటిక,క్రిస్మస్ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్రేమ, శాంతి,క్షమ, సేవా భావాలు వంటి క్రిస్మస్ సందేశాలను విద్యార్థుల ప్రదర్శనలు స్పష్టంగా ప్రతిబింబించాయి. సాంటా క్లాజ్ వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉత్సాహభరిత వాతావరణంలో,కేరింతలు, చప్పట్ల మధ్య ఈ ప్రీ క్రిస్మస్ వేడుకలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ డా.జె.వి నారాయణ,ప్రిన్సిపాల్ జాడి శ్వేత,ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఎన్‌ఆర్‌ఎం పాఠశాలలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**కొమరోలు, డిసెంబర్ 24,ప్రభాతవార్త**



మండలకేంద్రమైన కొమరోలులోని ఎస్‌బిఎన్‌ఆర్ ఎం పాఠశాలలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంనకు ముఖ్య అతిధిగా పాఠశాల కరెస్పాండంట్ బంధుగుల నారాయణమ్మ పాల్గొని ప్రసంగించారు. ప్రధానోపాధ్యాయులు బీవీ సుబ్బారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బి వెంకటరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి ఆధ్వర్యంలో విద్యార్థులు యేసు ప్రభువు యొక్క జీవిత చరిత్రను నాటకాలు,నృత్యాల ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమం లో శాంత క్లాజ్ ముఖ్య ఆకర్షణగా నిలిచాడు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహన దారులు ట్రిపుల్ రైడింగ్ చేయడం చట్టరీత్యా నేరం

**కొమరోలు, ప్రభాతవార్త**

ద్విచక్ర వాహనదారులు ట్రిపుల్ రైడింగ్ చేయడం చట్టరీత్యా నేరమని ఎస్సై జె నాగరాజు తెలిపారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరు మాత్రమే ప్రయాణించాలని, ట్రిపుల్ రైడింగ్ వలన బ్యాలెన్స్ కోల్పోయి, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఎస్సై తెలిపారు. రోడ్డు నియమాలు పాటించడం అందరి బాధ్యతగా భావించాలన్నారు. ట్రిపుల్ రైడింగ్ లో మొదటిసారి పట్టుబడితే వెయ్యి రూపాయల జరిమానా విధించబడుతుందని, పదేపదే పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేపడుతుందన్నారు. వాహన చోదకులు మోటార్ వాహన చట్టం నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

## సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కొమరోలు, ప్రభాతవార్త**

సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కొమరోలు ఎస్సై జె నాగరాజు తెలిపారు. పోలీసులు వీడియో కాల్స్ ద్వారా విచారణ చేయడం, వీడియో కాల్స్ ద్వారా డబ్బు, వ్యక్తిగత వివరాలు సేకరించడం జరగదని తెలిపారు. డిజిటల్ అరెస్ట్ అనేది లేనేలేదని, అలాంటి కాల్స్ వచ్చినప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు. ప్రజలు మోసాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పలుమార్లు సూచించారని ఎస్ఐ తెలిపారు.

## 27న మండల సర్వసభ్య సమావేశం

**రాచర్ల, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన రాచర్లలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశం హాలులో ఈనెల 27వ తేదీ శనివారం ఉదయం 10:30 గంటలకు మండల ఎంపిపి షేక్ ఖాసింబి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జడ్పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు మండల కో ఆప్షన్ సభ్యులందరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని తెలిపారు.

## రైతులు పంటలకు భీమా చేయించుకోవాలి

**రాచర్ల, డిసెంబరు 24 ,ప్రభాతవార్త**



ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు రబి పంటలైన వరి, మినుము, మొక్కజొన్న, పప్పు శనగ, జొన్న, మిర్చి పంటలకు రైతులు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి డి.సాయి శ్వేత అన్నారు. వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో బుధవారం సోమిదేవి పల్లి, గుడిమెట్ట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది నిర్వహించగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనగ ఎకరానికి రూ.368లు, మొక్కజొన్నకు రూ.105లు, జొన్నకి రూ.58లు, మినుముకి రూ.103లు ఎండుమిర్చికి రూ.525లు, వరికి రూ.215లు రైతు వాట చెల్లించి మీసేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. రోటవేటర్, తైవాన్స్ స్ప్రేయర్, ఆయిల్ ఇంజన్లు అందుబాటులో ఉన్నాయని అవసరమైనవారు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని సబ్సిడీలో పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు రమేష్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా పార్లమెంట్ కమిటీ సభ్యులుగా ఎంపికైన శ్రీనివాస్ రెడ్డి, డానియేల్


**రాచర్ల, డిసెంబరు 24, ప్రభాతవార్త**





జిల్లా పార్లమెంట్ కమిటీ సభ్యులుగా ఎంపికైన మండల నాయకులు అంబవరం శ్రీనివాస్ రెడ్డి, గుర్రం డానియల్‌కు రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటిక యోగానంద్ అభినందనలు తెలిపారు. జాతీయ పార్టీ నాయకత్వం వారి సేవలను గుర్తించి జిల్లాస్థాయిలో వారిని పార్టీ సేవలకు ఎంపిక చేసుకోవడం శుభ పరిణామమని అన్నారు. వారి ఎంపికకు సహకరించిన గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డికి, జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇరువురు నేతలు పార్టీ అభివృద్ధికి కృషిచేసి భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ఆయన కోరారు.

## కంభం ఎస్ఐని కలిసిన తురిమెళ్ళ టిడిపి నాయకులు



**కంభం, డిసెంబరు 24, ప్రభాతవార్త**

కంభం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన శివకృష్ణ రెడ్డిని తురిమెళ్ళ మాజీ సర్పంచ్ నారిశెట్టి వీరమ్మ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై శివకృష్ణారెడ్డిని శాలువాతో పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు నారిశెట్టి కరుణాకర్ విశ్రాంత ఎంపిడిఓ నాగేశ్వరరావు,గోపాల్‌రెడ్డి,హరిబాబు,బిటివలీ,మధ్యల సత్యనారాయణ, షేక్ దీనావళి,యు.సుధీర్,ఎడవల్లి ఆదినారాయణ, కె.రాజాబాయ్,కె.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## గజ్జలకొండలో తహశీల్దార్ చిరంజీవి విస్తృత పర్యటన

- పాఠశాలలో మధ్యాహ్న భోజన తీరు పరిశీలన
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన తహశీల్దార్
- పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై 17.37 ఎకరాల భూమి క్షేత్రస్థాయి పరిశీలన

**మార్కాపురం, డిసెంబరు 24, ప్రభాతవార్త**



మార్కాపురం మండలం గజ్జలకొండ గ్రామంలో తహసీల్దార్ కె చిరంజీవి బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజన నాణ్యత, సరఫరా విధానాలను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో కలిసి తహసీల్దార్ భోజనం చేశారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడిన తహసీల్దార్ చిరంజీవి కష్టపడి చదవాలని, కాలాన్ని వృథా చేసుకోకుండా లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి చేరాలని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. అదే విధంగా గజ్జలకొండ గ్రామ పరిధిలోని సర్వే నెం 121లో ఉన్న ఎకరాలు 17.37 సెంట్ల భూమికి సంబంధించి పీజీఆర్ఎస్ ద్వారా తెలుకుట్ల నాగయ్య తదితరులు దాఖలు చేసిన ఫిర్యాదుపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాల మేరకు భూమి స్థితిగతులు, సరిహద్దులు, భూ రికార్డులు తదితర వివరాలను పరిశీలించి సంబంధిత నివేదికను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారుల వాదనలు, అధికారిక రికార్డుల ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పీజీఆర్ఎస్ ఫిర్యాదులను పారదర్శకంగా విచారించి న్యాయం చేస్తామని తెలిపారు.

## జాతీయ స్థాయిలో కరాటేలో ప్రతిభ కనబర్చిన వివేకానంద విద్యార్థి

- అభినందించిన యాజమాన్యం

**మార్కాపురం, డిసెంబరు 24, ప్రభాతవార్త**



స్థానిక శ్రీ వివేకానంద విద్యాపీఠం నందు ఆరవ తరగతి చదువుతున్న షేక్ జోయ సిద్ధిక్ అనే విద్యార్థి జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎస్ జి ఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) పోటీలలో కరాటే బ్లాక్ బెల్ట్ విభాగంలో తృతీయ బహుమతి సాధించి విశేషప్రతిభ కనబర్చాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విజయానికి గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థికి లక్ష రూపాయల నగదు బహుమతిని ప్రకటించింది. ఈ సందర్భంగా విద్యార్థి విజయాన్ని పురస్కరించుకుని శ్రీ వివేకానంద విద్యాపీఠం అధ్యక్షులు పి సత్యనారాయణ, కార్యదర్శి వై ప్రసాద్, కోశాధికారి ఎం ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ఆర్ మల్లికార్జున మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని ఘనంగా అభినందించి బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థి సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలవాలని, ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుతూ, క్రీడలలోనూ ప్రతిభ కనబర్చాలని వారు ఆకాంక్షించారు.

## వాసవి స్కూల్‌లో సెమి క్రిస్మస్ వేడుకలు

**మార్కాపురం, డిసెంబరు 24, ప్రభాతవార్త**



మార్కాపురం పట్టణంలో వాసవి విద్యానికేతన్ నందు " సెమిక్రిస్మస్ " వేడుకలు చాలా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి రెవరెండ్ ఎన్ జాన్ బాబు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కె రంగయ్య మాట్లాడుతు క్రిప్మస్ ఏసుక్రీస్తు జనవానికి గుర్తుగా కోట్లమంది ప్రజలు జరుపుకునే మతపరమైన సాంస్కృతిక పండుగ అన్నారు. కొత్త నిబంధనలోని సంప్రదాయ క్రిస్మస్ కథనం, యేసు క్రీస్తు ప్రభువు జీవన విధానాన్ని వివరించారు. అందరు సుఖ శాంతులతో ఆనందగా సంతోషంగా జీవించాలని అన్నారు. అలాగే ఫాస్టర్ ఎన్ జాన్ బాబు సందేశం, ప్రార్ధన చేయించారు. కొంతమంది టీచర్ సందేశాలతో పాటు చిన్నారులు ఆటపాటలతో అలరించారు. అదే విధంగా విచ్చేనటువంటి అతిరికి కె రంగయ చేతుల మీదుగా ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అందరు పాల్గొని విజయమతం చేసినందుకు కృతజ్ఞతలు మరియు పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె రంగయ్య, ఏఓ, కె రంజిత్ మరియు ఇంచార్జులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షులుగా ఎంపికైన బిజ్జాల కిషోర్

**కంభం, డిసెంబరు 24, ప్రభాతవార్త**



ఒంగోలు పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షులుగా కంభం పట్టణానికి చెందిన బిజ్జాల కిషోర్‌ను కూటమి ప్రభుత్వం ఎంపిక చేయడంపట్ల పలువురు టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బిజ్జాల కిషోర్‌కు టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కంభం మండలంలో టిడిపి పార్టీలో సీనియర్ నాయకుడిగా పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేసిన కిషోర్ సేవలకుగాను పార్టీ అధిష్టానం పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్ష పదవికి ఆయనను ఎంపిక చేసింది. ఈ సందర్భంగా బిజ్జాల కిషోర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు తన పేరును అధిష్టానానికి సిఫార్సు చేసిన గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## రాజగోపుర నిర్మాణానికి రూ.17 లక్షల విరాళం

**సీఎస్‌పురం, డిసెంబర్ 24, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన సీఎస్‌పురంలోని శ్రీ కామాక్షి సమేత చంద్ర మౌళీశ్వర స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించనున్న రాజగోపుర నిర్మాణానికి రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు, సింగిల్ విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి ఇటీవల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం దాత నారాయణరెడ్డి విరాళం నగదు రూ.17లక్షలు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలకు ఆలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కే.క్రిష్టశర్మ దాతచే పూజలు నిర్వహింపచేసి వేద ఆశీర్వచనం చేసి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బొబ్బూరి రమేష్, మన్నేపల్లి శ్రీనివాసులు, ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, మన్నేపల్లి కార్తీక్, సంగిశెట్టి పీరయ్య నాయుడు, బోయళ్ల రామకృష్ణ, హేమసుందరం, బి.తిరుపతిరెడ్డి, ఇండ్లా సత్యం, పి.కనకయ్య, భక్తులు పాల్గొన్నారు.

## సెమీ క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి మేరుగ

**నాగులుప్పలపాడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**



నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామం, క్రిస్టియన్‌పాలెం కంచర్ల రాజారత్నం మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో రాష్ట్ర మేధావుల సంఘం సెక్రటరీ కంచర్ల సుధాకర్ బాబు ఆధ్వర్యంలో గతరాత్రి జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు డాక్టర్ మేరుగ నాగార్జున పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం సెమీ క్రిస్మస్ సందర్భంగా నూతన దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీటిని వృధా చేయరాదు

**రాచర్ల, డిసెంబరు 24 ప్రభాతవార్త**



మంచినీటిని వృధా చేయరాదని ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి అన్నారు. మండలంలోని సత్యవోలు గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని రోడ్లు, కాల్వలు, నీటి ట్యాంకులు పరిశీలించి త్రాగునీరు పారిశుధ్యంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ట్యాంకుల వద్ద బట్టలు ఉతకడం స్నానాలు చేయటం చేయొద్దని తెలిపారు. ట్యాంకులు తరచూ శుభ్రం చేస్తుండాలని సిబ్బందికి సూచించారు. సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది వివరాలు స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో వెంకటేష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరేష్ రెడ్డి. పిఎస్ జి సరస్వతి దేవి, తదితరులు ఉన్నారు.

## సముద్రపు నాచు పెంపకం ప్రదేశాన్ని సందర్శించిన అధికారులు

**నాగులుప్పలపాడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

మత్స్యశాఖ కమీషనర్ రమా శంకర్, రిటైర్డ్ ఐఏఎస్ నాయక్ ఏటిమొగ గ్రామం చిన్నగంజాం మండలం వద్ద ఈకో ఓసియానిక్స్ ప్రైవేటు లిమిటెడ్ కొమ్మిరెడ్డి మాధవిచే చేపడుతున్న సముద్రపు నాచు పెంపకం ప్రదేశాన్ని సందర్శించారు. 15 టన్నుల సముద్రపు నాచు ఉత్పత్తి సాధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎస్ఎంసీఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ పి.సురేష్, జిల్లా మత్స్యశాఖ అధికారి కే.శ్రీనివాస్ నాయక్, మత్స్యశాఖ ఉప సంచాలకులు పి.గాలిదేముడు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు బి.కృష్ణ కిషోర్, తహసీల్దార్ జే.ప్రభాకరరావు, ఎప్‌డీఓ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ తెన్నేటి

**నాగులుప్పలపాడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**

చీరాల మండలం తోటవారిపాలెం గ్రామంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిధిగా లోక్ సభ ప్యానల్ స్పీకర్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రార్థనలో పాల్గొన్న అనంతరం ఎంపీ మాట్లాడుతూ నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించమని యేసు క్రీస్తు ప్రబోధించారని, ఆయన బోధ అనుసరించి సమాజంలో ప్రేమను పరిమళ్ళింపచేయుటయే నిజమైన క్రిస్మస్ పరమార్థం అని అన్నారు. అనంతరం వేడుకల్లో భాగంగా గ్రామంలోని పేద మహిలలకు ఆయన చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రైస్తవ మత పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకకు ముస్తాబైన చర్చీలు

**వేటపాలెం, డిసెంబర్ 24, ప్రభాతవార్త**



క్రీస్తుజన్మదినం పురష్కరించుకుని క్రిస్మస్ సందర్భంగా మండలంలోని అన్ని చర్చిలు విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు అయ్యాయి. నెల రోజుల క్రిస్మస్ వేడుకలకు గురువారం చివరి రోజు కావడం వలన చర్చి ప్రాంగణాల్లో సందడి నెలకొంది. నజరేయుడి రాకకోసం క్రైస్తవ సోదరులు బుధవారం సాయంత్రం నుండే చర్చిల నందు ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించడం జరిగింది సువార్తికులు వాక్యం బోధించగా క్రీస్తు పాటలతో ప్రాంగణాలు మార్మోగాయి. చిన్న పెద్ద తేడా లేకుండా ఏసు కీర్తనలకు నృత్యాలు చేస్తూ, శాంటా క్లాస్ వేషధారణతో పిల్లలు పెద్దలు అంతా క్రిస్మస్ వేడుకల్లో నిమగ్నమయ్యారు. విద్యుత్ దీప అంకరణతోమెరిసిపోతున్న చర్చీలుచూపరులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.

## దక్షిణ భారత విద్య, వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన వేటపాలెం గర్ల్స్ హైస్కూల్ టీచర్ నీలిమ ప్రాజెక్ట్

**చీరాల, డిసెంబర్ 24, ప్రభాతవార్త**



విజయవాడ పోరంకిలో 23,24వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో వేటపాలెం గర్ల్స్ హైస్కూల్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు బత్తుల నీలిమ తయారు చేసి ప్రదర్శించిన ప్రకృతి వనరులతో సుస్థిరాభివృద్ధి ప్రాజెక్టు దక్షిణ భారత సైన్స్ ఫెయిర్ ప్రదర్శన పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు దేవరకొండ సరోజిని తెలియజేశారు. ఈ సందర్భంగా స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఎస్‌సీఈఆర్‌టీ) డైరెక్టర్ ఎం.వెంకట కృష్ణారెడ్డి మెమోంటో, సర్టిఫికేట్ అందజేసి, బెస్ట్ విషెస్ తెలిపారు. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించు సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ పోటీలలో ఈమె పాల్గొంటారు. బాపట్ల జిల్లా డీఈఓ శ్రీనివాస సింగ్, డిప్యూటీ డీఈఓ ఎం.గంగాధర్‌రావు,సైన్స్ ఆఫీసర్ మహమ్మద్‌షాదిక్,వేటపాలెం మండలఎంఈఓలు జి.సుబ్బయ్య,ఐ.పురుషోత్తం,పాఠశాల ఉపాధ్యాయునీ,ఉపాధ్యాయులు,విద్యార్థినీ,విద్యార్థులు నీలిమాకు, ఆమెకు సహకరించిన కే.సరళాదేవికి అభినందనలు తెలిపారు.

## సీఐటీయు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల ధర్నా

**సంతనూతలపాడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**



సంతనూతలపాడు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలలు గడిచిన ఐదో నెల చివరికి వచ్చిన జీతాలు ఇవ్వని కారణంగా గత రెండు రోజుల నుండి కార్మికులు పని ఆపి బుధవారం నాడు సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ తక్కువ వేతనంతో పని చేస్తున్న కార్మికులకు నాలుగు నెలల పాటు జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని వాపోయారు. పండుగల వచ్చిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాలకవర్గం పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. వెంటనే స్పందించి జీతాలు ఇవ్వాలని, లేకుంటే నిరవధిక సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. అయితే గ్రామ పెద్దలు మాజీ ఎంపీపీ దుంపా చెంచిరెడ్డి, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావులు ధర్నా శిబిరం దగ్గరకు వచ్చి మేము కొంత అడ్వాన్స్ ఇప్పిస్తామని పనిలోకి వెళ్లమని రిక్వెస్ట్ చేసిన కారణంగా వారు ధర్నా విరమించి కార్మికులు పనిలోకి వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు బంకాసుబ్బారావు, నాయకులు వి.సంపత్, పంచాయతీ పారిశుధ్య కార్మికులు బి.పేరమ్మ, టి.చిన్నమ్మాయి, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో వైసీపీ నాయకులు అరాచకంపై టీడీపీ నేతలు ధ్వజం


**సంతనూతలపాడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**




ఈనెల 21వ తేదీన మాజీ సీఎంపులి వెందుల ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వైసీపీ నాయకులు అరాచకత్వానికి అంతు లేకుండా పోయిందని సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు ధ్వజమెత్తారు. సంతనూతలపాడు టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా పుట్టిన రోజు నాడు పండ్లు, పాలు, బ్రెడ్లు ఇలాంటివి రోగులకు పంచి పెడతారు లేదా భోజనాలు పెడతారని అయితే వైసీపీ నేతలు జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా కోళ్లు, మేకలు, కోసి ఫ్లెక్సీ ఫోటోలపై రక్తం చిందించడం ఈ వైసీపీ వాళ్ళ అరాచకానికి అద్దం పడుతున్నట్లు హరిబాబు ఆరోపించారు. అంతే కాకుండా ఏడు నెలలు గర్భిణీ అని కూడా చూడకుండా వారి ఇంటి ముందు టపాసులు కాల్చవద్దు అన్నందుకు సంధ్యారాణి అనే ఆ గర్భిణీని గొంతు నులిమి పొట్ట మీద తన్నిన అజయ్ దేవ్ అనే వైసీపీ కార్యకర్తకు పోలీసులు పబ్లిక్‌లో మంచి ట్రీట్మెంట్ ఇచ్చారని, దీనిపై టీడీపీ నేతమద్దినేని హరిబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పుడే ఆట మొదలైంది రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్‌లు ఇచ్చిన ఆదేశాలతో పోలీసులలో ఇప్పుడే చలనం మొదలు కావడంపై వైసీపీ నాయకులు గుండెల్లో భయం మొదలైందని హరిబాబు వెల్లడించారు. ఈ సమావేశంలో మండల యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, మండల టీఎన్‌టీయుసీ అధ్యక్షులు పావులూరి నారాయణస్వామి చౌదరి, తెలుగు మహిళా అధ్యక్షురాలు నార్నే మాధవిలత, గుమ్మలంపాడు సొసైటీ డైరెక్టర్ తాటితోటి నరసింహారావు, యూనిట్ ఇన్‌చార్జి మార్పుడి జనార్ధన్, టీడీపీ నేతలు పొన్నం ఇంద్రబాబు, మండవ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా స్థాయిలో ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకలు

**సంతనూతలపాడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**





సంతనూతలపాడు హైస్కూల్లో బుధవారం నాడు ఘనంగా జిల్లా స్థాయిలో జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి ఎస్.పద్మశ్రీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకలలో భాగంగాఐదురకాల వాల్ పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. మార్కెట్లో అన్ని రంగాల్లో వినియోగదారులు మోస పోకుండా డీఎస్‌ఓ పద్మశ్రీఈ సందర్భంగా అవగాహన కల్పించారు. జిల్లా కన్స్యూమర్స్ కమీషనర్ డాక్టర్ సమీరాఈ సందర్భంగా అన్ని రంగాల్లో తగు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, తదితర వాటి నందు పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. విద్యార్థులు చిన్న దశ నుండి ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకుంటే వినియోగదారుడు ఎప్పుడు నష్టపోరని జిల్లా కన్స్యూమర్ కమీషనర్ సమీరా పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హైస్కూల్ హెచ్ఎం ఎం.ప్రమోద అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర్, తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శివతేజ, ఒంగోలు ఆర్ఎం కార్యాలయ సూపరింటెండెంట్ ఫణి కుమార్, జిల్లా తూనికల కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ స్వర్ణ, ఎంఈఓ డి.వెంకారెడ్డి,వాలంటరీ కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు బాలకృష్ణ, వీరారెడ్డి, నాగేంద్రరావు, అంజిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఖలీల్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

8_8.qxd 12/25/2025 12:05 AM Page 1



# క్రీస్తు జననం శాంతి, ప్రేమకు ప్రతీక

**- దద్దాల నారాయణ యాదవ్**



**కనిగిరి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గం ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ క్రిస్మస్ శుభాకాంక్షలు బుధవారం తెలిపారు. క్రైస్తవ సోదర సోదరీమణులు క్రిస్మస్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. క్రీస్తు జననం శాంతికి సంకేతమని, తన జీవితం, మరణం ద్వారా లోకానికి సరైన మార్గాన్ని ఏసు ప్రభువు చూపారని తెలిపారు. ప్రేమ, కరుణ, దయ, క్షమాగుణాలకు క్రిస్మస్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మానవాళికి శాంతి సందేశాన్ని బోధించే ఈ పండుగ సందర్భంగా ఏసుక్రీస్తు చూపిన ప్రేమ మార్గాన్ని అందరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. ఏసు ప్రభువు కృపతో కనిగిరి నియోజకవర్గం పాడి పంటలతో సుబిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ఆనందమయ జీవితం గడపాలని దద్దాల నారాయణ యాదవ్ మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు.

# క్రీస్తు జననం శాంతి సందేశం

**- చింతలచెరువు సత్యనారాయణరెడ్డి**



**కనిగిరి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**
వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, మాజీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్, కనిగిరి నియోజకవర్గం వైసీపీ సీనియర్ నాయకులు చింతలచెరువు సత్యనారాయణరెడ్డి కనిగిరి నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.క్రీస్తు జననం శాంతి,ప్రేమకు ప్రతీకమని పేర్కొంటూ, ఏసు ప్రభువు చూపిన ప్రేమ, కరుణ మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని కోరారు. ఏసు ప్రభువు కృపతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఎన్నిక హర్షణీయం

**- షేక్ గయాజ్ భాషా**



**కనిగిరి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఎన్నిక కావడం హర్షణీయమని కనిగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులు షేక్ గయాజ్ భాషా అన్నారు. కనిగిరి పట్టణంతో పాటు ఆరు మండలాల్లో స్వల్ప కాలంలోనే కోట్ల రూపాయలు నిధులు తీసుకువచ్చి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం గర్వకారణమన్నారు.కనిగిరి నియోజకవర్గంలో విద్యార్థులకు అవసరమైన పాఠశాల భవనాలు, మౌలిక వసతులు కల్పించడమే కాకుండా బయోగ్యాస్ పారిశ్రామిక కారిడార్ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. అలాగే వలస సమస్యను తగ్గించేందుకు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పట్టుదలతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి అనుభవం, దూరదృష్టి కలిగిన నాయకుడు ప్రకాశం జిల్లా వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# కనిగిరిలో యధేచ్ఛగా బాణసంచా విక్రయాలు

**- అధికారుల కళ్ల ముందే ఉల్లంఘనలు**

**కనిగిరి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలో బాణసంచా విక్రయాలు యధేచ్ఛగా సాగుతున్నాయి. నియమావళి ప్రకారం ప్రత్యేక అనుమతులు పొందిన ప్రదేశాల్లో మాత్రమే బాణసంచా విక్రయం జరగాలి. కానీ పట్టణంలోని కొన్ని వాణిజ్య సముదాయాలు, ఇళ్ళ సముదాయాల్లోనే బాణసంచా నిల్వ ఉంచి విక్రయాలు కొనసాగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగల పేరుతో ప్రమాదకరమైన బాణసంచా సామాగ్రి దుకాణాల లోపల, సన్నని వీధుల్లో కూడా నిల్వ ఉండడం వల్ల ఎప్పుడైనా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి అక్రమ విక్రయాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అగ్నిమాపక, పోలీసు, మున్సిపల్ అధికారులు వెంటనే సమన్వయంతో తనిఖీలు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## కనిగిరిలో దృష్టి బాధితులకు నిత్యవసర సరుకులు, ఆర్థిక సహాయం



**కనిగిరి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**
కనిగిరి మానవతా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో 11 మంది దృష్టి బాధితులకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రాజ్యలక్ష్మి,తాలూకా ఎన్జీవో అధ్యక్షులు పిల్లి రమణారెడ్డి పేర్కొన్నారు. దృష్టి బాధితుల పరిస్థితిని గమనించిన ఎమ్మార్వో రాజ్యలక్ష్మి తక్షణమే రూ. 5వేలు నగదు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించినందుకు మానవతా సంస్థ ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. మానవతా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించిన ఎమ్మార్వో రాజ్యలక్ష్మి, సమాజ సేవలో సంస్థ పాత్ర అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా కమిటీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### పెట్రోల్ బంకు నూతన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పువ్వాడి, తడికమల్ల



**పామూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**
పామూరు మండల కేంద్రమైన వగ్గంపల్లి జాతీయ రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన పీఏసీఎస్ సౌజన్యంతో ప్రారంభించిన నూతన పెట్రోల్ బంకు ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ పామూరు మండల మాజీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, కనిగిరి నియోజకవర్గ యువత అధ్యక్షులు తడికమల్ల సుబ్బారావు, పువ్వాడి వెంకటేశ్వర్లు(బెంగుళూరు), జి.రామారావు, ఉప్పలపాటి హరిబాబు, యలమందల రహిముల్లా, సాంబ, ఎం.వెంకటరావు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ బిల్లు సవరణ వెనక్కి తీసుకోవాలి



**వెలిగండ్ల, డిసెంబర్ 24, ప్రభాతవార్త**
గ్రామీణ పేదల జీవనోపాధిలో కీలకపాత్ర పోషిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ దాని స్థానంలో తీసుకువచ్చిన వీబీజీఆర్ఏఎంజీ పేరుతో తీసుకువచ్చిన బిల్లును వెనక్కి తీసుకోవాలని జిల్లా సీఐటీయు కార్యదర్శి రాయల మాలకొండయ్య అన్నారు. బుధవారం మొగులూరు గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు కరపత్రం పంచుతూ వారు మాట్లాడుతూ 40 శాతం నిధుల భారం రాష్ట్రాల మీద వేసి తప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం చట్టానికి ఉన్న మహాత్మాగాంధీ పేరుని కూడా సహించలేని మతోన్మాద పాలకులు చట్టంగా ఉన్నదాన్ని సవరించి స్కీముగా మార్చి క్రమంగా కనుమరుగు చేసే కుట్ర పండుతుందని వారన్నారు. ఈ బిల్లు వలన గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, ఇళ్ల నిర్మాణం వెనుకబడిపోతుందన్నారు. వలసల నివారణ పేదరిక నిర్మూలన గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులు, శాశ్వత ఆస్తులు, మెరుగుపరుచు లాంటి ఉన్నత లక్ష్యాలతో ఉపాధి హామీ చట్టం తెచ్చారని ఈ బిల్లుకు వ్యతిరేకంగా వ్యవహరించాలి, ప్రతిపక్ష పార్టీ కూడా ఈ ఆందోళనకు మద్దతు ఇచ్చి గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం మొగులూరు సెంటర్లో బిల్లు పత్రాలను దగ్ధం చేయటం జరిగింది.

# మండల ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

**- మండల ఎస్సీ సెల్ నాయకులు కత్తి తిరుపాలు**



**హనుమంతునిపాడు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**
క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండల ప్రజలకు మండల ఎస్సీ సెల్ నాయకులు కత్తి తిరుపాలు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు జననం శాంతికి సంకేతమని, తన జీవితం, మరనం ద్వారా లోకానికి సరైన మార్గాన్ని ఏసు ప్రభువు చూపారని తెలిపారు. ప్రేమ, కరుణ, దయ, క్షమాగుణానికి క్రిస్మస్ పండుగ ప్రతీక అని, మానవాళికి శాంతి సందేశాన్ని బోధించే పండుగన్నారు. ఏసు క్రీస్తు చూపిన ప్రేమ మార్గాన్ని అందరూ అనుసరించాలన్నారు. ఆయన కృపతో మండలం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందమయ జీవితం గడపాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు.

## బీఆర్ ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు







**కనిగిరి,డిసెంబర్ 24, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు చిన్నారుల ఆకర్షణీయ వేషధారణ, ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ప్రాంగణం మొత్తం క్రిస్మస్ అలంకరణలు, రంగురంగుల బెలూన్లు, నక్షత్రాలతో కళకళలాడింది. చిన్నారులు శాంతి దూతలుగా(ఏంజెల్స్), శాంటా క్లాజ్ వేషధారణలో మెరిశారు. బాలురు ఎరుపు- తెలుపు రంగుల శాంటా క్లాజ్ దుస్తుల్లో ఉత్సాహంగా కనిపించగా, బాలికలు తెలుపు, గులాబీ రంగుల ఏంజెల్ గౌన్లు, తలపై కిరీటాలు, రెక్కలతో అందరిని ఆకట్టుకున్నారు. మరికొందరు చిన్నారులు ఫెయిరీ, నక్షత్ర వేషాల్లో పాల్గొని వేడుకలకు మరింత శోభను చేకూర్చారు. కేక్ కటింగ్ కార్యక్రమంలో చిన్నారులు ఆనందంగా పాల్గొని చప్పట్లతో ఉత్సాహంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన పాస్టర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ దావీదు పట్టణంలో నేడు రక్షకుడు పుట్టినాడు అని క్రిస్మస్ సువార్త సందేశాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులకు వివరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాఉ. శాంతి, సౌభ్రాతృత్వం సందేశాన్ని అందించారు. విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ క్రీస్తు జననం శాంతికి ప్రతీక అని, యేసు ప్రభువు తన జీవితం- మరణం ద్వారా లోకానికి సరైన మార్గాన్ని చూపించారని అన్నారు. ప్రేమ, కరుణ, దయ, క్షమాగుణాలను బోధించే పండుగ క్రిస్మస్ అని, ఈ విలువలను విద్యార్థులు తమ జీవితాల్లో అనుసరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంస్థ డైరక్టర్లు షేక్ షియాజ్, జి.బాలభాస్కర్,బండి వెంకటేశ్వర్లు,జి.నరేంద్ర, పి.రాంబాబు, ప్రిన్సిపాల్ ఎన్.రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## దర్శి పట్టణంలోని కాఫీ షాప్‌లో

## సరదాగా కాఫీ తాగిన మాగుంట, గొట్టిపాటి లక్ష్మీ, కడియాల



**దర్శి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**
దర్శి పట్టణంలోని అద్దంకి రోడ్డులోని కాఫీ బ్రేక్ షాపు వద్ద బుధవారం సరదాగా కాసేపు కాఫీ తాగుతూ దర్శి నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, అభివృద్ధిపై ముచ్చటించుకున్న ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి,దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లోక్ష్మి, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దర్శి మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగవేణి - సుబ్బారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ముండ్లమూరు మండల టీడీపీ అధ్యక్షులు కూరపాటి శ్రీను, దర్శి మండల మాజీ టీడీపీ అధ్యక్షులు చిట్టె వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## నూజిళ్లపల్లి, శంకరాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది



**ముండ్లమూరు, డిసెంబర్ 24 ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలంలోని నూజిళ్లపల్లి, శంకరాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తిరుమలరావు మాట్లాడుతూ రైతులందరూ ఈ రబీ సీజన్లో వేసిన ప్రతి పంటను పంట నమోదు చేసుకోవాలన్నారు.అదే విధంగా ఎరువులు వ్యవసాయ సొసైటీలు, రైతు సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఎరువులకు ఎటువంటి కొరతలేదని తెలియజేశారు. అనంతరం శంకరాపురంలోని ఎరువుల షాపులను తనిఖీ చేసి ఎరువులు డీలర్లు మీ దగ్గర ఉన్న ఎరువులు వివరాలు స్టాక్ రిజిస్టర్‌లో ఎంటర్ చేసి రైతులకు ఎప్పటికప్పుడు బిల్లులు ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ స్టాక్ రిజిస్టర్ బిల్ బుక్స్ అప్డేట్లో ఉంచుకోవాలని తెలియజేశారు.

## తూర్పు వెంకటాపురం, లంకోజనపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది



**దర్శి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**
పొలం పిలుస్తోంది కార్యక్రమం తూర్పు వెంకటాపురం, లంకోజనపల్లి గ్రామాలలో మండల వ్యవసాయాధికారిచే నిర్వహించబడింది.వరి కొనుగోలు కేంద్రాలలో వడ్లు ఎంఎస్పీ ధరకు మన మండలంలో 4 కేంద్రాల ద్వారా సివిల్ సప్లయ్స్ వారు కొనుగోలు చేస్తున్నారు. రబీ సీజన్‌కు సంబంధించి ఈ పంట కార్యక్రమం ప్రారంభమైందని, ఎంటీయు 1010 రకాలను ప్రభుత్వం కొనుగోలు చేయదని రైతులకు చెప్పటం జరిగింది. సాగు చేసిన పంటల విస్తీర్ణంను బట్టి మండలానికి ఎరువులు కేటాయించబడును, కాబట్టి రైతులు సాగు చేసిన ప్రతి ఎకరాన్ని సంబంధిత వీఏఏ వద్ద పంట నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు సుధాకర్, హర్షవర్ధన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, సోదరభావానికి ప్రతీక



**ముండ్లమూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త**
క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండలంలోని భీమవరం గ్రామంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో వృద్ధులకు, వికలాంగులకు, వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీబీఆర్సీ ఏరియా కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఏసుక్రీస్తు జననం మానవాళికి ప్రేమ, క్షమ, సేవా, త్యాగం వంటి విలువలను బోధించాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ గోపనబోయిన తిమోతి మాట్లాడుతూ పేదల సేవ, అనాధల సంరక్షణ, అవసరమైన వారికి సహాయం చేయటం ద్వారా క్రిస్మస్ ఆత్మస్ఫూర్తిని నిలుపవచ్చని పేర్కొన్నారు.

## దర్శి నియోజకవర్గ ప్రజలందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు

**- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ**



**దర్శి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**
ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే క్రిస్మస్ పండుగను దర్శి నియోజకవర్గ క్రైస్తవ సోదర, సోదరీమణులు అందరూ ఘనంగా జరుపుకోవాలని ఏసుక్రీస్తు బోధనలను ఆచరించాలని దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. క్రిస్మస్ సందర్భంగా ప్రకాశం జిల్లా, దర్శి నియోజకవర్గ ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులకు, పార్టీల శ్రేణులకు అధికారులకు, జర్నలిస్టులకు మిత్రులకు క్రైస్తవ సోదర సోదరీమణులకు, ప్రభు భక్తులందరికి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన కస్తాల బాలాజీ దంపతులు




**హనుమంతునిపాడు ,డిసెంబర్ 24, ప్రభాతవార్త**
క్రిస్మస్ పండుగని పురస్కరించుకుని నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు, డాక్టర్ కస్తాల బాలాజీ, మండల మహిళా అధ్యక్షురాలు డాక్టర్ కస్తాల బేబీ దంపతులు నియోజకవర్గ, మండల ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. యేసు క్రీస్తు ప్రపంచ సర్వమత శాంతి స్థాపన కొరకు పుట్టిన మహనీయుడు, గొప్ప శాంతి దూత అని పేర్కొన్నారు. శత్రువులను మిత్రులుగా మార్చి,వారు శాంతి మార్గంలో పయనించేలా ప్రేమను చూపారని, వారి మార్గం అందరికి ఆదర్శనీయమని అన్నారు. క్రిస్మస్ సోదరసోదరీమణులు అందరూ క్రిస్మస్ వేడుకలను ఘనంగా,ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని వారు కోరారు.

## విద్యుత్ శాఖా మంత్రికి వినతి పత్రం అందజేసిన 108 సిబ్బంది



**అద్దంకి , డిసెంబరు 24,ప్రభాతవార్త**
ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, 108 ఉద్యోగులకు 4000 రూపాయలు అదనపు వేతనం చెల్లించాలని, అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ప్రస్తుతం అమలు కావటం లేదని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా 4000 రూపాయలకు బదులుగా కేవలం 2000 రూపాయలు మాత్రమే పెంచారని, ఇపిఎఫ్ఒ యాజమాన్య వాటాను యాజమాన్యమే చెల్లించాలని, అయినా అమలు కావడం లేదు. రెండు వాటాలు ఉద్యోగుల వేతనం నుంచే చెల్లిస్తున్నారని, ఇఎంటిలకు ట్రైనింగ్ పేరుతో ఫెయిల్ చేసి వెనక్కి పంపిస్తున్నారని, సంస్థ వచ్చి 6 నెలలు గడిచినా ఇంతవరకు అపాయింట్మెంట్ ఆర్డర్స్, పే స్లిప్పులు ఇవ్వడంలేదు. ఐదు నుంచి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి స్లాబ్ అప్డేట్ చేయకపోగా, కొందరికి స్లాబ్ తగ్గించడం జరిగింది. రిలీవింగ్ బిల్లు అమోంట్ ను తగ్గిస్తూ 25 కిలోమీటర్ల లోపు బిల్లు లేదని నిర్ణయించారు. జిల్లా స్థాయిలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ కమిటీ మీటింగ్లను ఏర్పాటు చేయడం లేదు.లీవ్ పాలసీలను అమలు చేయకపోవడం, సెలవుకు ఎక్కువ మొత్తంలో వేతనం తగ్గించి ఇవ్వడం జరుగుతుంది.10.వెహికల్ బ్రేక్ డౌన్(రిపేరు) నిమిత్తం వెళ్ళినప్పుడు సిబ్బందికి అటెండెన్స్ ఇవ్వడం లేదు. తక్కువ ఫెసిలిటీ ప్రభుత్వ హాస్పిటల్ నుంచి ఎక్కువ ఫెసిలిటీ గల ప్రభుత్వ హాస్పిటల్‌కి రిఫర్ కేసుల విషయంలో ప్రభుత్వమే సరైన గైడెన్స్ రూపొందించడం వంటి సమస్యల పరిష్కారం కోరుతూ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని కలసి వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా కార్యదర్శి హరిబాబు, గ్రీవెన్స్ మెంబర్ కోటేశ్వరరావు, క్రాంతి, నాగరాజు, రామాంజి, విధులలో లేని 108సిబ్బంది పాల్గొన్నారు.

## అద్దంకి నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు

**- డాక్టర్ చింతలపూడి**



**అద్దంకి , డిసెంబరు 24, ప్రభాతవార్త**
అద్దంకి నియోజకవర్గ ప్రజలకు, క్రైస్తవ సోదర సోదరీమణులకు అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్‌క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. లోక రక్షకుడైన యేసుక్రీస్తు జన్మించిన ఈ పవిత్ర దినం శాంతికి, ప్రేమకు,కరుణకు చిహ్నామని కొనియాడారు. క్రీస్తు బోధించిన ప్రేమ, సహనం, సేవా భావం ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు.

# మంత్రి గొట్టిపాటి పరామర్శ





**అద్దంకి , డిసెంబరు 24, ప్రభాతవార్త**
రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టణంలోని 19వ వార్డులో షేక్ మహమ్మద్ కుమారుడు షాహిద్ ఇటీవలే విద్యుత్ ప్రమాదంలో గాయపడగా బుధవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య విషయమై అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా షేక్ ఖాసీం అనారోగ్యంతో బాధపడుతుండటంతో వారి నివాసానికి వెళ్లి ఖాసీం పరామర్శించి ఆరోగ్య విషయమై వాకబు చేశారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో అన్నదానం





**అద్దంకి , డిసెంబరు 24,ప్రభాతవార్త**
రోటరీ క్లబ్ ఆఫ్ సింగర కొండ అద్దంకి ఆధ్వర్యంలో, శ్రీ వాసవి ధన్వంతరి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో సింగరకొండలోని శ్రీరామ వృద్ధులఆశ్రమములో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు బాచిన శివధర పూర్ణచంద్రరావు, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, చప్పిడివీరయ్య,పి.ఎల్.వి.నరసింహారావు,అంజాద్ భాష,పువ్వాడ రామకోటేశ్వరరావు, పూర్ణయ్య, గూడా లక్ష్మిరెడ్డి,జవ్వాజి మల్లికార్జునరావు,తదితరులు పాల్గొన్నారు.

# మహబూవలికి మంత్రి గొట్టిపాటి నివాళి



**అద్దంకి , డిసెంబరు 24,ప్రభాతవార్త**
రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పట్టణంలోని 14వ వార్డులో పట్టణ మాజీ ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ మహబూవలి అనారోగ్యంతో పరమపదించగా, బుధవారం వారి ఇంటికి వెళ్లి వారి పార్థివ దేహానికి ఘన నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట టిడిపి నాయకులు, వున్నారు.

## పోలవరానికి పొట్టి శ్రీరాములు పేరు ప్రతిపాదించడం చారిత్రాత్మకం

**- ప్రతిపాదన చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు**

**- జనసేన రాష్ట్ర నాయకులు, శ్రీశైలం దేవస్థానం ట్రస్టు సభ్యులు దేవకి వెంకటేశ్వర్లు**



**కనిగిరి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడిగా నిలిచిన పోలవరం ప్రాజెక్టుకు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన ప్రతిపాదన చారిత్రాత్మకమైనదని జనసేన రాష్ట్ర నాయకులు, శ్రీశైలం దేవస్థానం ట్రస్టు సభ్యులు దేవకి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ ప్రతిపాదన చేసినందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల గుంటూరు సీకే కన్వెన్షన్ హాల్‌లో జరిగిన పదవీ బాధ్యతల కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన మనసులో మాటను బహిరంగంగా వెల్లడిస్తూ, ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను తాగ్యం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును పోలవరం ప్రాజెక్టుకు పెట్టడం సముచితమని స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి అధికారికంగా ముందుకు తీసుకెళ్తానని ఆయన తెలిపారు. ఈ నిర్ణయం కుల, మత, పార్టీ ప్రాంతాలకు అతీతంగా రాష్ట్ర ప్రజలందరి నుంచి పూర్తి మద్దతు పొందుతుందని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేస్తూ థాంక్యూ డిప్యూటీ సీఎం సారూ అంటూ స్వాగతం పలికారు. ఈ ప్రతిపాదనపై స్పందించిన దేవకి వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ తెలుగు వాడి ఆత్మగౌరవానికి ప్రతీక అమరజీవి పొట్టి శ్రీరాములు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం దేశంలోనే ప్రాణత్యాగం చేసిన మహనీయుడు ఆయన. నేడు తెలుగు వాడి ఆత్మగౌరవం గురించి మనం మాట్లాడుతున్నామంటే, దానికి మూలపురుషుడు పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుకు పొట్టి శ్రీరాములు పేరు పెట్టడం చారిత్రాత్మకమైనదే కాక సమయోచిత నిర్ణయమని ఆయన తెలిపారు. ఈ నిర్ణయం అమలైతే అమరజీవి పొట్టి శ్రీరాములు రాష్ట్ర చరిత్రలో మరింత చిరస్థాయిగా నిలిచిపోతారని అభిప్రాయపడ్డారు. కుల, మత, పార్టీ బేధాలను పక్కన పెట్టి ఆంధ్రులంతా ఒక్కటై ఈ ప్రతిపాదనకు మద్దతు తెలపాలని దేవకి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలో ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించి పోలవరం ప్రాజెక్టుకు అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలనే డిమాండ్‌ను బలంగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం ఒక పేరు పెట్టే అంశం మాత్రమే కాదు. ఇది చరిత్రకు జరిగే న్యాయం, త్యాగానికి దక్కే గౌవం, తెలుగు జాతి ఆత్మగౌరవానికి అంకితం అని దేవకి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

### డోలా, మాగుంట, ఉగ్ర, గొట్టిపాటి నారపుశెట్టిలను సన్మానించిన టీడీపీ నాయకులు



**దర్శి, డిసెంబర్ 24, ప్రభాతవార్త**
దర్శి నియోజకవర్గానికి విచ్చేసిన జిల్లా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావులను ఘనంగా సన్మానించిన దర్శిమండల టీడీపీ నాయకులు. సన్మానించిన వారిలో టీడీపీ నాయకులు అంబటి వెంకటేశ్వరరెడ్డి,యాదగిరి వాసు,అంబటి గోవిందరెడ్డి,గుర్రం బాలకృష్ణ, వేరేసి వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలో అతిపెద్ద మెట్రో..ఢిల్లీ




## మరో మూడు కారిడార్లకు కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

## ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.12,014.91 కోట్లు

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఢిల్లీ మెట్రో ఐదో దశ ప్రాజెక్టును ఆమోదించింది. మొత్తం రూ. 12,014.91కోట్ల వ్యయంతో కూడిన ఈ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆర్‌కె ఆశ్రమ్ మార్గ్‌నుంచి ఇంద్రప్రస్థ, ఏరోసిటీనుంచి ఐజిడి ఎయిర్‌పోర్టు టెర్మినల్ వన్, తుగ్లక బాద్‌నుంచి కాలింద్‌కుంజ్‌వరకూ మొత్తంమూడు మెట్రో కారిడార్లను ఆమోదించింది. ఢిల్లీమెట్రో ఐదోదశ ప్రాజెక్టు మొత్తం 16.076 కిలోమీటర్ల నిడివితో ఉంటుందని మొత్తం ప్రాజెక్టు వ్యయం 12వేల కోట్లకుపైబడి ఉంటుందని కేబినెట్ సమావేశం తర్వాత పీఎంఒ ప్రకటన విడుదల చేసింది. అలాగే సెంట్రల్ విస్టా కారిడార్‌తో కర్తవ్యభవనలు అన్నింటికీ కనెక్టివిటీ ఏర్ప గుతుంది. ఆఫీసులకువెళ్లేవారికి ఎంతో ఉప యోగంగా ఉంటుంది. సుమారు 60వేలమంది ఆఫీసులకు వెళ్లేవారు, రెండు లక్షలమందికిపైగా సందర్శకులకు ఈ కారిడార్‌వల్ల ఎంతోమేలు జరుగుతుంది. అలాగే శిలాజ ఇంధనాలవల్ల ఎలాంటి కాలుష్యం ఉండదని కేంద్రం చెపు [illegible] తోంది. ఈ విస్తరణ పనుల్లో మొత్తం 13 స్టేషన్లు ఉంటాయి. వీటిలో పది స్టేషన్లు భూగర్భంలోను మూడు స్టేషన్లు ఎలివేటెడ్ స్థాయిలో ఉంటాయి. నాలుగోదశనిర్మాణంలో ఉంది. 111 కిలోమీటర్లు 83 స్టేషన్ల నిర్మాణం జరుగుతోంది. 80.43 శాతం నిర్మాణం పూర్తికావచ్చింది. డిసెంబరు 2026 నాటికి మొత్తం పూర్తవుతుందని [illegible] అంచనా. ఢిల్లీ మెట్రో సాయంతో మొత్తం 65 లక్షలమంది ప్రయాణీకుల రాకపోకలకు వీలవు తోంది. ఒక్కోసారి రోజుకు 81.87 లక్షలమంది కూడా ప్రయాణిస్తుంటారు. మొత్తం 12 మెట్రో లైన్లు 395 కిలోమీటర్ల నిడివితో 289 స్టేషన్లతో ఢిల్లీమెట్రో నడుస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద మెట్రోప్రాజెక్టుగా ఢిల్లీమెట్రో నడుస్తోంది.

# బిజెపి విధానాలు చిన్నవ్యాపారులకు దెబ్బ

## కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** బిజెపి ప్రభుత్వం అను సరిస్తున్న విధానాలు చిన్న వ్యాపారాలు చేసే వారిని ముఖ్యంగా వైశ్య వర్గాన్ని దెబ్బతీస్తు న్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఆ వర్గానికి తాను మద్దతుగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బిజెపి మనస్తత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వైశ్యవర్గానికి చెందిన వ్యాపా రులతో రాహుల్ భేటీ అయ్యి మాట్లాడారు. చర్చల అనంతరం వారి సమస్యలపై రాహుల్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. మా వ్యాపారం



పతనానికి దగ్గరగా ఉంది అంటూ వైశ్య సమాజం నుంచి వచ్చిన ఆవేదన నన్ను తీవ్రంగా కలచివేసింది. దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో దోహదపడిన సమాజం నేడు ఇలా నిరాశలో కూరుకుపోవడం ఓ హెచ్చరిక లాంటిది. గుత్తాధి పత్య సంస్థకు స్వేచ్ఛనిచ్చి చిన్న, మధ్యతరహా వ్యాపారులపై అధికారం, జిఎస్టీ వంటి విధానాలతో ప్రభుత్వం భారం మోపుతోంది. ఇది కేవలం విధాన వైఫల్యం మాత్రమే కాదు. ఉత్పత్తి, ఉపాధితో పాటు భారత భవిష్యత్తు పైనా ప్రత్యక్ష దాడి అని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వ మనస్తత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని రాహుల్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో దేశ వాణిజ్యానికి వెన్నెముక అయిన వైశ్య వర్గానికి తాను మద్దతుగా నిలబడతానన్నారు.

# 20 యేళ్ల తర్వాత కలిసిన థాకరే సోదరులు

## మున్సిపల్ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని వెల్లడి

**ముంబయి, డిసెంబరు 24:** మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. విభేదాలతో విడిపోయిన థాక్రే సోదరులు ఉద్ధవ్ థాక్రే రాజ్ థాక్రే మళ్లీ కలిశారు. ముంబై స్థానిక ఎన్నికల్లో కూటమిగా ఏర్పడి పోటీ చేస్తామని ప్రకటించారు. బుధవారం నిర్వహించిన మీడి యా సమావేశంలో అన్నదమ్ములిద్దరూ కీలక ప్రకటన చేశారు. జనవరి 15న జరగబోయే



మున్సిపల్ ఎన్నికల్లో శివసేన (థాక్రే వర్గం), మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారు. ముంబైకి మరాఠీ మేయర్ రానున్నారని వెల్లడించారు. కాగా, 2005లో విడిపోయిన వీరు దాదాపు 20 ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకున్నారు. ఈ ఏడాది జులైలో ముంబైలో నిర్వహించిన వాయిస్ ఆఫ్ మరాఠీ కార్యక్రమంలో తొలిసారి ఒకే వేదికపై కనిపించారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఆప్యా యంగా మాట్లాడుకున్నారు. ఇకపై ఇద్దరం కలిసే ఉంటామని సోదరులు అప్పుడు స్పష్టం చేశారు. ఇక అన్నదమ్ముల కలయికపై ఇరు పార్టీల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# విడాకుల నోటీసు పంపించిందని భార్యను కాల్చి చంపిన ఐటి ఉద్యోగి

**బెంగళూరు, డిసెంబరు 24:** తనతో విడిపోయి దూరంగా ఉంటున్న భార్య విడాకుల నోటీసు పంపడంతో తట్టుకోలేకపోయిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆమెను కాల్చి చంపాడు. ఆపై పోలీ సులకు లొంగిపోయాడు. ఐటీహబ్ బెంగ ళూరులో జరిగిందీ ఘటన. పోలీసుల కథనం ప్రకారం నిందితుడు బాలమురుగన్ (40), భువనేశ్వరి (39) 2011లో ప్రేమ వివాహం చేసుకున్నారు. బాలమురుగన్ గతంలో ప్రముఖ ఐటీ సంస్థ క్యాప్‌జెమినిలో సాఫ్ట్‌వేర్ ఇం జనీర్‌గా పనిచేశాడు. భువనేశ్వరి యూనియన్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. కొంతకాలంగా భార్య ప్రవర్తనపై బాలమురుగన్ అనుమానం పెంచుకోవడంతో వారి మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఏడాదిన్నర కాలంగా వీరిద్దరూ విడి విడిగా ఉంటున్నారు. భర్త వేధింపులు తట్టు కోలేక ఆరు నెలల క్రితం భువనేశ్వరి తన పిల్లలతో కలిసి వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో ఇల్లు తీసు



కుని రహస్యంగా ఉంటోంది. భార్యపై కక్ష పెంచుకున్న బాలమురుగన్ ఆమె ఎక్కడ ఉందో ఆరా తీసి, నాలుగు నెలల క్రితమే ఆమె నివసించే ప్రాంతానికి సమీపంలోనే అద్దెకు దిగాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం భార్య నుంచి విడాకుల నోటీసు అందడంతో బాలమురుగన్ ఆగ్రహం కట్టలు తెంచుకుంది. మంగళవారం సాయంత్రం 6:30 గంటల సమయంలో భువనేశ్వరి బ్యాంక్ పని ముగించుకుని ఇంటికి వస్తుండగా, ఆమె కోసం అప్పటికే మాటు వేసిన బాలమురుగన్ తన వద్దనున్న పిస్టల్‌తో అత్యంత సమీపం నుంచి కాల్పులు జరిపాడు. బుల్లెట్లు శరీరంలోకి దూసుకెళ్లడంతో రక్తపు మడుగులో పడిపోయిన ఆమెను ఆస్పత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. హత్య అనంతరం నిందితుడు నేరుగా మగడి రోడ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. తన భార్యను తానే చంపినట్లు నేరాన్ని అంగీకరించాడు. పోలీసులు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 103 కింద కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన అతడికి తుపాకీ ఎక్కడి నుంచి వచ్చింది దీని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## భార్య కస్టడీకి పిల్లలను అప్పగించాలన్న కోర్టు

# పిల్లలను చంపి, తల్లితో సహా భర్త ఆత్మహత్య

**తిరువనంతపురం, డిసెంబరు 24:** విడిగా నివసి స్తున్న భార్య కస్టడీకి పిల్లలను అప్ప గించాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒక వ్యక్తి ఇద్దరు పిల్లలను హత్యచేశాడు. ఆ తర్వాత తల్లి తో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేరళ లోని కన్నూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పయ్యన్నూర్ గ్రామంలోని రామంతలికి చెందిన 36 ఏళ్ల కళాధరన్ భార్య నయనతార విడాకుల కోసం కోర్టును ఆశ్రయించింది. భర్త నుంచి విడిగా నివసిస్తున్న ఆమె ఇద్దరు పిల్లల సం రక్షణను తనకు అప్పగించాలని కోర్టును కోరింది. కాగా, పిల్లల కస్టడీని నయనతారకు అప్పగిం చాలని ఫ్యామిలీ కోర్టు ఆదేశించింది. దీంతో పిల్లల స్వాధీనానికి ఆమె పోలీసుల సహాయం కోరారు. ఈ నేపథ్యంలో పిల్లలను భార్యకు అప్పగించాలని కళాధరన్‌కు పోలీసులు చెప్పారు. అయితే ఆరేళ్ల హిమ, రెండేళ్ల కన్నన్‌ను భార్యకు అప్పగించడానికి ఇష్టపడని కళాధరన్ మరునాడు దారుణానికి పాల్పడ్డాడు. డిసెంబర్ 22న రాత్రి వేళ 56ఏళ్ల తల్లి ఉషాతో కలిసి వారిని చం పాడు. పురుగుమందు కలిపిన పాలు పిల్లలకు తాగించగా వారు మరణించారు. మరోవైపు కళా ధరన్, అతడి తల్లి ఉషా కూడా పురుగుమందు కలిపిన పాలు తాగారు. ఇంట్లో సీలింగ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఒక సూసైట్ నోట్‌ను డోర్ ముందు ఉంచారు. మం గళవారం ఉదయం ఆటో డ్రైవర్ అయిన కళా ధరన్ తండ్రి ఇంటికి చేరుకున్న తర్వాత ఎవరూ ఎంతకీ డోర్ తెరువలేదు. అక్కడ ఉన్న సూసైడ్ నోట్‌ను గమనించిన ఆయన పోలీసులకు సమా చారం ఇచ్చాడు. పోలీసులు ఆ ఇంటికి చేరుకు న్నారు. తలుపులు తొలగించి లోపలకు వెళ్లి చూశారు. కళాధరన్, అతడి తల్లి ఉషా, ఇద్దరు పిల్లల మృతదేహాలను కనుగొన్నారు. పోస్ట్‌మా ర్టం తర్వాత మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# టర్కీ విమానప్రమాదంలో మృతిచెందిన లిబియా సైనిక చీఫ్

**అంకారా, డిసెంబరు 24:** టర్కీ రాజధాని అం కారాలో మంగళవారంరాత్రి ఘోర విమాన ప్రమా దం సంభవించింది. లిబియా సైన్యాధిపతి జనరల్ మహమ్మద్ అలీ అహ్మద్ అల్‌హద్దాద్‌తో సహా ఎనిమిది మంది ప్రయాణిస్తున్న ప్రైవేట్ జెట్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతిక లోపంతో కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న ఐదుగురు ఉన్నతాధికారులు, ముగ్గురు సిబ్బంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పో యారు. రక్షణ రంగ చర్చల నిమిత్తం టర్కీకి వచ్చిన లిబియా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం పర్యటన ముగించుకుని తిరిగి బయ లుదేరిన 30 నిమిషాలకే ఈ విషాదం చోటు చేసుకుంది. అంకారాలోని ఎసెన్‌బోగా విమా నాశ్రయం నుంచి రాత్రి 8:30 గంటలకు బయలుదేరిన ఫాల్కన్ 50 బిజినెస్ జెట్ దక్షిణాన ఉన్న హేమనా జిల్లా వద్దకు రాగానే రాడార్‌తో సంబంధాలు కోల్పోయింది. విమా



నంలో ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు స్థానిక టీవీ చానళ్లు ప్రసారం చేసిన సీసీటీవీ దృశ్యాల్లో కనిపిస్తోంది. ఈ ప్రమాదంపై లిబియా ప్రధాని అబ్దుల్ హమీద్ దబీబా స్పందిస్తూ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశం ఒక గొప్ప సైనిక మేధావిని కోల్పోయిందని, ఇదొక తీరని లోటని పేర్కొన్నారు. మృతుల్లో అల్‌హద్దాద్‌తో పాటు గ్రౌండ్ ఫోర్స్ చీఫ్ జనరల్ అల్‌ఫితౌరీ ఘ్రైబిల్, మిలిటరీ మాన్యుఫ్యాక్చరింగ్ అథారిటీ చీఫ్ బ్రిగేడియర్ జనరల్ మహమూద్ అల్‌ఖతావి వంటి కీలక అధికారులు ఉన్నారు.

పశ్చిమ లిబియాలో అత్యున్నత కమాండర్‌గా సేవలందిస్తున్న అల్‌హద్దాద్ ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో విచ్ఛిన్నమైన లిబియా సైనిక విభాగాలను ఏకం చేయడంలో కీలక పాత్ర పోషి స్తున్నారు. అటువంటి నాయకుడు మరణించడం లిబియా అంతర్గత భద్రతా వ్యవహారాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అంకారా విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూ సివేసి, పలు విమానాలను దారి మళ్లించారు. ఈ ఘటనపై విచారణ జరిపేందుకు టర్కీ ప్రభుత్వం నలుగురు ప్రాసిక్యూటర్లను నియ మించింది. సాంకేతిక లోపం వల్ల ప్రమాదం జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

## ఢిల్లీ కాలుష్యంతో మూడురోజుల్లోనే అలర్జీ

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** ఢిల్లీ కాలుష్యంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ ఉన్న మూడు రోజుల్లోనే తనకు అలర్జీ వచ్చిందని వెల్లడించారు. దేశ రాజధానిలో జరి గిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేను ఇక్కడ మూడు రోజులుగా ఉంటున్నాను. ఈ కాలుష్యం వల్ల నాకు ఎలర్జీ వచ్చింది. నేను రవాణాశాఖ మంత్రిగా ఉన్నాను. రవాణా వల్లే 40 శాతం కాలుష్యం వస్తోంది. శిలాజ ఇంధనాల వాడకాన్ని గణనీయంగా తగ్గిం చాల్సిన అవసరం ఉంది. శిలాజ ఇంధనాలు



పరిమితంగా ఉన్నాయి. కానీ కాలుష్యం మాత్రం పెరిగిపోతోంది. మనం వాటి వాడకాన్ని తగ్గిం చలేమా? కాలుష్యాన్ని తగ్గించే ఎలక్ట్రిక్ వాహ నాలు, హైడ్రోజన్ ఆధారిత వాహనాలకు ప్రోత్సాహం లభించాలి అని గడ్కరీ వ్యాఖ్యలు చేశారు. భారతదేశం శిలాజ ఇంధనాలపై ఏటా దాదాపు రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోంది. కేంద్రమంత్రి ఇథనాల్ వాడకాన్ని ప్రోత్సహి స్తోన్న సంగతి తెలిసిందే. ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా తయారుచేసిన తొలి ఫ్లెక్స్ ఫ్యూ యల్ అని పిలుస్తారు. ఇది కాలుష్యాన్ని, శిలాజ ఇంధనాలపై ఆధారప డటాన్ని తగ్గిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

## ఇల్లినాయ్‌పై ట్రంప్ నిర్ణయాన్ని తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

**వాషింగ్టన్, డిసెంబరు 24:** ఇల్లినాయ్ రాష్ట్రంలోకి నేషనల్ గార్డ్ బలగాలను పంపాలన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 63 ఓట్ల తేడాతో ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించింది. ఇల్లినాయ్ లో చట్టాలను అమలు చేయడానికి మిలిటరీని ఉపయోగించే అధికారం ప్రభుత్వానికి ఎక్కడి నుంచి వచ్చిందో నిరూపించడంలో యంత్రాంగం విఫలమైందని కోర్టు తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ వివాదం అక్టోబర్ 4న మొదలైంది. షికాగో పరిసర ప్రాంతాల్లో భద్రత కోసం ఇల్లినాయ్ నేషనల్ గార్డ్‌కు చెందిన 300 మంది సభ్యులను ట్రంప్ ఫెడరల్ సర్వీసులోకి పిలిచారు. ఆ తర్వాతి రోజే టెక్సాస్ నేషనల్ గార్డ్‌ను కూడా షికాగోకు పంపారు. అయితే, ఫెడరల్ బలగాల మోహరింపును వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై గతంలోనే జిల్లా కోర్టు, అప్పీల్ కోర్టు స్టే ఇచ్చాయి. తాజాగా సుప్రీంకోర్టు కూడా ఆ స్టేను సమర్థిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు తీర్పుపై వైట్ హౌస్ అధికార ప్రతినిధి అబిగైల్ జాక్సన్ స్పందిస్తూ.. ఫెడరల్ భవనాలు, ఆస్తులను అల్లరిమూకల నుంచి రక్షించడానికి, ఫెడరల్ అధికారులకు రక్షణ కల్పించడానికే అధ్యక్షుడు ఈ నిర్ణయం తీసుకున్నారని సమర్థిం చుకున్నారు. బలగాల మోహరింపును మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న ఇల్లినాయ్ డెమొక్రాటిక్ గవర్నర్ జేబీ ప్రిట్జ్కర్, షికాగో మేయర్ ఈ తీర్పును స్వాగతించారు. ఇది ఇల్లినాయ్ రాష్ట్రానికి, అమెరికా ప్రజాస్వామ్యానికి దక్కిన గొప్ప విజయమని అభివర్ణించారు.



## యూనస్ ఏదో ఒకరోజు దేశం వీడి పోవాల్సిందే

### హత్యకు గురైన హాదీ సోదరుడు హెచ్చరిక

**ఢాకా, డిసెంబరు 24:** బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిస్థితులు ఉద్రిక్తంగా మారి హింసాత్మక ఘటనలతో దేశం అట్టుడుకుతోంది. ఇటీవల జరిగిన యువ నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్య దేశవ్యాప్తంగా హింసకు దారితీసింది. తాజాగా హాదీ సోదరుడు ఒమర్ సంచలన ఆరోపణలు చేశారు. హాదీ హత్యలో తాత్కాలిక ప్రభుత్వం పాత్ర ఉందని ఆయన ఆరోపించారు. మీరు హాదీని చంపారు. ఈ ఘటనను వాడుకుని వచ్చే ఏడాది జరగాల్సిన ఎన్నికలను రద్దు చేయాలని చూస్తున్నారు. హాదీని హత్య చేసిన వారిని వెంటనే పట్టుకోండి. హాదీ హత్య విషయంలో న్యాయం జరగకుంటే, తాత్కాలికక ప్రభుత్వ అధినేత ముహమ్మద్ యూనస్ కూడా ఒక రోజు బంగ్లాదేశ్‌ను విడిచి పారిపోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. హాదీ గతేడాది విద్యార్థి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఆ ఉద్యమం షేక్ హసీనా ప్రభుత్వాన్ని దేశం వీడే స్థితికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో, హాదీ హత్య ఘటన బంగ్లాలో ఉత్కంఠకర రాజకీయ పరిణామాలను సృష్టించింది. ఇక, మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీపై తాత్కాలిక ప్రభుత్వం నిషేధం విధించింది. దీని వలన వచ్చే ఏడాది జరగ బోయే పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నిర్ణయంపై అమెరికా చట్ట సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు పారదర్శకంగా, స్వేచ్ఛాయుత విధానంలో ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కు ఉంది. అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ఎన్నికలు నిర్వహించేందుకు తాత్కాలిక ప్రభు త్వం ప్రయత్నించాలి అని వారు సూచించారు. అవామీ లీగ్‌పై విధించిన నిషేధాన్ని పునః సమీక్షించాలని కోరారు.



## ప్రియాంకకు ప్రధాని పదవి ప్రతిపాదనపై బిజెపి ఎద్దేవా

### కాంగ్రెస్‌లో ఎప్పుడూ గందరగోళమే: షెహజాద్ పూనావాలా

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రియాంక గాంధీ ప్రధానమంత్రి అభ్యర్థిగా ఉండాలనే చర్చపై బీజేపీ స్పందించింది. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ గందరగోళంలో ఉంటుందని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనవాలా విమర్శించారు. ఐఎన్‌సీ అంటే సాధారణంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అని కానీ ఈ పేరు కంటే ఐ నీడ్ కన్ఫ్యూజన్ అనే పేరు ఆ పార్టీకి బాగా సరిపోతుందని ఎద్దేవా చేశారు. జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో ముఠా రాజకీయాలు కనిపిస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా షెహజాద్ పూనవాలా పలు అంశాలను ఉదహరించారు. రాజస్థాన్‌లో సచిన్ పైలట్, అశోక్ గెహ్లాట్, హిమాచల్ ప్రదేశ్‌లో ప్రతిభా సింగ్, సుఖ్వీందర్ సింగ్ సఖు, కర్ణాటకలో డీ.కే. శివకుమార్, సిద్ధరామయ్య ఇలా నేతల మధ్య గ్రూపులు ఉన్నాయని గుర్తు చేశారు. ఇప్పుడు జాతీయ స్థాయిలో రాహుల్ కాంగ్రెస్, ప్రియాంక కాంగ్రెస్ వర్గాలుగా చీలి పోయారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రకటనలు రాహుల్ గాంధీపై విశ్వాసం లేనట్లుగా స్పష్టంగా తెలుస్తోందని అన్నారు. కొన్నిసార్లు శశిథరూర్, రాహుల్ గాంధీ ప్రక టనలతో విభేదిస్తారని, ఇమ్రాన్ మసూద్ ప్రి యాంక గాంధీని ప్రధానమంత్రిగా ప్రతిపాది స్తారని, ఆ తర్వాత వివరణ ఇస్తుంటారని వ్యా ఖ్యానించారు. కాంగ్రెస్ నుంచి బహిష్కరించ బడిన మహమ్మద్ మోక్వీమ్ కూడా రాహుల్ గాంధీ నాయకత్వ సామర్థ్యాన్ని ప్రశ్నించారని గుర్తు చేశారు.

ప్రియాంక గాంధీకి పార్టీలో మరింత కీలక పాత్ర ఇవ్వాలని ఆయన సూచించారని గుర్తు చేశారు. ప్రియాంక గాంధీ ప్రధానమంత్రి కావాలనే వ్యాఖ్యలకు రాబర్ట్ వాద్రా కూడా మద్దతు పలికారని, ఇది కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత సంక్షోభాన్ని వెల్లడిస్తోందని పూనవాలా అన్నారు. రాహుల్ గాంధీ సామర్థ్యంపై రాబర్ట్ వాద్రాకు నమ్మకం లేనట్లుగా ఉందని అన్నారు. రాహుల్ గాంధీకి ప్రజల్లోనే కాదు, సొంత పార్టీలో కూడా నమ్మకం లేకుండా పోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక కుటుంబ పార్టీ అని ఆయన విమర్శించారు.

# హెచ్1బి వర్క్ వీసా లాటరీ రద్దు..




**వాషింగ్టన్, డిసెంబరు 24:** అమెరికాలో హెచ్1బీ వర్క్ వీసా విధానాన్ని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం పూర్తిగా మార్చేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకు అమ లులో ఉన్న లాటరీ విధానాన్ని రద్దు చేసి, నైపుణ్యం, అధిక వేత నాల ఆధారంగా వీసాలు కేటా యించే వెయిటెడ్ సెలక్షన్ విధా నాన్ని ప్రవేశపెడుతోంది. కొత్త నిబంధనలు 2026 ఫిబ్ర వరి 27 నుంచి అమల్లోకివస్తాయి. 2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన హెచ్1బీ రిజిస్ట్రే షన్ సీజన్ నుంచే ఈ మార్పులు వర్తిస్తాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకారం ప్రతి ఏడాది సుమారు 85 వేల హెచ్1బీ వీసాల కేటాయింపుపై ఈ విధానం ప్రభావం చూపనుంది. తక్కువ వేతనాలకు విదేశీ కార్మికులను తీసుకొచ్చేందుకు కొందరు యజమానులు లాటరీ వ్యవస్థను దుర్వినియోగం చేశారని యూఎస్‌సీఐఎస్ ప్రతినిధి మాథ్యూ ట్రాగెసర్ ఆరోపించారు. అందుకే అధిక నైపుణ్యం, ఎక్కువ జీతాలు పొందే ఉద్యోగులకు ప్రాధాన్యం ఇస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం భారతీయులపై భారీ ప్రభావం చూపనుంది. హెచ్1బీ వీసా ద్వారా అమెరికాలో ఉద్యోగాలు పొందుతున్న వారిలో భారతీయ టెక్ నిపుణులు, వైద్యులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ముఖ్యంగా కెరీర్ ఆరంభ దశలో ఉన్న యువ భారతీయులకు ఈ కొత్త వేతన ప్రమాణాలు అడ్డంకిగా మారనున్నాయి. ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ వీసాలపై ఏడాదికి అదనంగా 1 లక్ష డాలర్ల ఫీజు విధించే ప్రకటన చేసింది. మరోవైపు ధనవంతుల కోసం 10 లక్షల డాలర్ల 'గోల్డ్ కార్డ్ వీసాను కూడా ప్రవేశపెట్టింది. అమెరికా కంపెనీలు ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధికి హెచ్1బీ వీసాలు కీలకమని సమర్థిస్తుంటే, విమ ర్శకులు మాత్రం ఇవి ఎంట్రీలెవెల్ ఉద్యోగాలకే ఎక్కువగా వెళ్తున్నాయని వాదిస్తున్నారు. మొత్తం మీద ఈ కొత్త విధానం అమెరికా ఉద్యోగ విపణిపైతో పాటు వేలాది భారతీయుల భవిష్య త్తుపై కూడా ప్రభావం చూపనుంది.

# సంక్షిప్తంగా..

## కాలిఫోర్నియాలో 30 మంది భారతీయులు అరెస్టు



**కాలిఫోర్నియా, డిసెంబరు 24:** అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 30 మంది భారతీయులను యుఎస్ బోర్డర్ పెట్రోల్ అధికారులు అరెస్ట్ చేశారు. వీరు కమర్షియల్ డ్రైవర్ లైసెన్సులు (సీడీఎల్) కలిగి ఉండి, భారీ సెమీ ట్రక్ వాహ నాలను నడుపుతున్నట్లు గుర్తించారు. కాలిఫోర్నియాలోని ఎల్ సెంట్రో సెక్టర్‌లో జరిగిన తనిఖీల్లో ఈ అరెస్టులు జరిగాయని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) వెల్లడించింది. నవంబర్ 23 నుంచి డిసెంబర్ 12 వరకు ఇంటర్ స్టేట్ హైవేలు, ఇమిగ్రేషన్ చెక్‌పోస్టుల వద్ద జరిగిన తనిఖీల్లో మొత్తం 42 మంది అక్రమ వలసదారులను పట్టు కున్నారు. వీరిలో 30 మంది భారతీయులు కాగా, మిగిలిన వారు ఎల్‌సాల్వడార్, చైనా, హైటి, మెక్సికో, రష్యా తదితర దేశాలకు చెందినవారు. వీరికి కాలిఫోర్నియా సహా ఫ్లోరిడా, న్యూయార్క్, న్యూజెర్సీ వంటి రాష్ట్రాలు కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

## టొరాంటోలో భారత్ యువతి దారుణ హత్య



**టొరంటో, డిసెంబరు 24:** కెనడాలోని టొరంటోలో భారతసంతతికి చెందిన 30 యేళ్ల యువతి హిమాన్స్ ఖురానా దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటనలో 32 ఏళ్ల అబ్దుల్ గఫూరి అనే వ్యక్తిని ప్రధాన నిందితుడిగా గుర్తించిన పోలీసులు, అతనిపై ఫస్ట్‌డిగ్రీ మర్డర్ కేసు నమోదు చేసి, దేశవ్యాప్తంగా అరెస్ట్ వారెంట్ జారీచేశారు. బాధితురాలు, నిందితుడు ఇద్దరికీ ముందునుంచే పరిచయం ఉం దని, ఇది ఇంటిమేట్ పార్టనర్ వయలెన్స్ (సన్నిహిత భాగస్వామి హింస) కేసుగా పోలీసులు అనుమా నిస్తున్నారు. ఈనెల 19వతేదీ రాత్రి హిమాన్షి ఖురానా కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు అం దింది. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు గాలింపు చర్యలు చేపట్టగా, 20వ తేదీ ఉదయం 6:30 గంటలకు స్ట్రాచన్ అవెన్యూ, వెల్లింగ్టన్ స్ట్రీట్ వెస్ట్ ప్రాంతంలోని ఒక నివాసంలో ఆమె మృతదేహాన్ని కనుగొన్నారు. దీనిని హత్యగా నిర్ధారించిన పోలీసులు, దర్యాప్తును హోమిసైడ్ విభాగానికి అప్పగించారు.

## ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



**నోయిడా, డిసెంబరు 24:** గ్రేటర్ నోయిడాలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మ హత్య చేసుకున్నాడు. చదువులో రాణించలేకపోతున్నానంటూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. చనిపోవడానికి ముందు సూసైడ్ నోట్ రాశాడు. తాను ఓడిపోయానని, చదువుకోసం ఇంకా డబ్బును వృధా చేయాలనుకోవడం లేదని అందులో పేర్కొన్నాడు. ఈ మేరకు తన తల్లిదండ్రులకు క్షమాపణలు కోరాడు. బీహార్‌కు చెందిన ఆకాష్ దీప్.. ఢిల్లీ టెక్నికల్ క్యాంపస్‌లో బీటెక్ (కంప్యూటర్ సైన్స్) మొదటి సంవత్సరం చదు వుతున్నాడు. అతడు గ్రేటర్ నోయిడాలోని నాలెడ్జ్ పార్క్ ప్రాంతంలో గల ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉం టూ చదువును కొనసాగిస్తున్నాడు. అయితే, ఆకాష్ దీప్ మంగళవారం సాయంత్రం రూమ్‌మేట్ బయ టకు వెళ్లిన సమయంలో తన గదిలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

## జామియా మిలియా వర్సిటీ ప్రొఫెసర్ సస్పెన్షన్

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలో ఒక సెమిస్టర్ పరీక్షా పత్రంలో సామాజిక సమస్యలపై అడిగిన ఒక ప్రశ్న అభ్యంతరకరంగా ఉందన్న ఆరోపణలతో ప్రొఫెసర్ వీరేంద్ర బాలాజీ షహారేను యూనివర్సిటీ యాజమాన్యం సస్పెండ్ చేసింది. ఈ వారం ప్రారంభంలో జరిగిన బీఏ (ఆనర్స్) సోషల్ వర్క్ మొదటి సెమిస్టర్ పరీక్షలో భారతదేశంలో సామాజిక సమస్యలు అనే పేపర్‌లో ఒక ప్రశ్న ఇచ్చారు. అందులో భారతదేశంలో ముస్లిం మైనా రిటీలపై జరుగుతున్న అకృత్యాల గురించి తగిన ఉదాహరణలతో చర్చించండి అని 15 మార్కుల ప్రశ్నను అడిగారు. ఈ ప్రశ్నపత్రం ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్ల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఇది ఒక వర్గాన్ని కించపరిచేలా లేదా రాజకీయ ప్రేరేపితంగా ఉం దని పలువురు విమర్శించారు.

## ఎయిరిండియా పైలట్‌కు సంజాయిషీ నోటీసులు

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఐజీఐ)లో ప్రయా ణికుడిపై భౌతికదాడికి పాల్పడిన ఘటనను ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్ తీవ్రంగా పరిగణించింది. సదరు పైలట్‌కు అధికారికంగా షోకాజ్ నోటీసు జారీచేసింది. తన ప్రవర్తనపై 48 గంటల్లోగా వివరణ ఇవ్వా లని, లేనిపక్షంలో కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పైలట్ దురుసు ప్రవర్తన సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసిందని పేర్కొంటూ ఎయిర్ ఇండియాఎక్స్‌ప్రెస్ ఈ నోటీసు ఇచ్చింది. దీనిపై ఆయన ఇచ్చే వివరణ ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయి. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపేందుకు ఈవారమే ఒకఎక్స్‌టర్నల్ ఎంక్వైరీ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఎయిర్ లైన్స్ ప్రక టించింది. బాధితుడు అంకిత్ దేవాన్ ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు ఇప్పటికే పైలట్‌పై స్వచ్ఛందంగా గాయపరచడం, అక్రమంగా అడ్డుకోవడం వంటి అభియోగాల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# గుంటూరు రైల్వే స్టేషన్‌లో స్లీపింగ్ పాడ్స్ సౌకర్యం ఏర్పాటు



గుంటూరు రైల్వే స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్లీపింగ్ పాడ్స్‌ను ప్రారంబిస్తున్న అధికారులు

**తార్నాక, డిసెంబర్ 24 ప్రభాతవార్త :** అతితక్కువ ధరలకు ప్రయాణీకులకు ఈ సౌకర్యం దక్షిణ మధ్య రైల్వేలోని గుంటూరు డివిజన్, ప్రయాణీకుల సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు నాన్‌ఫేర్ ఆదాయాలను పెంచే లక్ష్యంతో గుంటూరు రైల్వే స్టేషన్ ప్రాంగణంలో స్లీపింగ్ పాడ్స్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. స్లీపింగ్ పాడ్స్ సౌకర్యం ప్లాట్‌ఫామ్ నెం. 1, గేట్ నెం. 3 వద్ద ఏర్పాటుచేశారు. ఈ సౌకర్యం ప్రయాణీకులకు, కుటుంబాలకు, మహిళా ప్రయాణీకులకు సురక్షితమైన, ఆధునిక, సరసమైన స్వల్పకాలిక వసతి సౌకర్యాన్ని అందిస్తుంది. ప్రస్తుతం ఇటువంటి సౌకర్యం విశాఖపట్నం, చర్లపల్లి రైల్వే స్టేషన్లలో అందుబాటులో ఉంది. ముఖ్యమైన సౌకర్యాలు.......స్లీపింగ్ పాడ్స్ సౌకర్యం 52 సింగిల్ బెడ్‌లు, 12 డబుల్ బెడ్‌లతో మొత్తం 64 పడకల సామర్థ్యాన్ని కలిగి ఉంది. మొత్తం 64 బెడ్‌లలో, కుటుంబాలు మరియు మహిళలకు బెడ్‌లు కేటాయించబడ్డాయి. వాటిలో 10 డబుల్ బెడ్‌లు, 12 సింగిల్ బెడ్‌లు ఉన్నాయి. ఈ సౌకర్యం ప్రయాణీకులకు అనుకూలమైన అనేక సౌకర్యాలతో కూడి ఉంది. ఇందులో ఉచిత వైఫై సౌకర్యం, వేడి నీటి సరఫరా, స్నాక్స్ బార్, ట్రావెల్ డెస్క్, విశాలమైన మరియు పరిశుభ్రమైన నిద్ర ప్రాంతాలు, శుభ్రమైన టాయిలెట్ సౌకర్యాలు, వస్తువులను సురక్షితంగా నిల్వ చేయడానికి లాకర్ సౌకర్యం ఏర్పాటుచేశారు. దీనికి అతితక్కువ ధరలతో టారిఫ్ నిర్ణయించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రయాణీకులకు అనుకూలమైన స్నేహపూరకమైన చొరవకు ప్రయాణ సమయంలో సౌకర్యవంతమైన బసను అందించినందుకు గుంటూరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్ గుంటూరు డివిజన్ బృందానికి అభినందనలు తెలిపారు. నాన్‌ఫేర్ ఆదాయాన్ని సృష్టించడం కోసం చర్యలు తీసుకున్నందుకు ఆయన డివిజన్ ను అభినందించారు. ఈ చొరవ ప్రారంభం ఆధునిక మౌలిక సదుపాయాల ద్వారా ప్రయాణీకుల సౌలభ్యాన్ని పెంపొందించడానికి దక్షిణ మధ్య రైల్వే చేపట్టిన నిరంతర ప్రయత్నాలను ప్రతిబింబిస్తూ అదే సమయంలో ప్రధాన రైల్వే కార్యకలాపాలకు మించి ఆదాయాన్ని సృష్టిస్తుందన్నారు.

# వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలి

## - పౌరసరఫరాల శాఖ ఎండి ఢిల్లీరావు



వినియోగదారులకు అవగాహనా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఢిల్లీరావు తదితరులు

**విజయవాడ (గన్నవరం), డిసెంబర్ 24, ప్రభాతవార్త :** వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పౌరసరఫరాలశాఖ యండి ఢిల్లీరావు సూచించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి వేడుకలను బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన ఢిల్లీరావు మాట్లాడుతూ వినియోగదారుల్లో ప్రశ్నించేతత్వం పెరగాలని, వినియోగదారులకు నష్టం కలిగితే వెంటనే వినియోగదారులకోరు ్టలో ఫిర్యాదు చేయాలన్నారు. గతంలో వస్తువు కొన్న చోట కేసు పెట్టాల్సి ఉండేదని, ప్రస్తుత చట్టం ప్రకారం వినియోగదారులు నివసించే చోట ఇంటివద్ద నుండే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని, కేసు విచారణకు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా హాజరుఅయ్యే అవకాశం ఉందన్నారు. బిస్‌కేర్ యాప్‌ద్వారా హాల్‌మార్క్, క్వాలిటీ కంట్రోల్ వంటి అంశాలపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ఈ-జాగృతి యాప్‌ద్వారా కేసు స్థితిని తెలుసుకునే అవకాశం ఉందని ఢిల్లీరావు తెలిపారు. నూతన చట్టం ప్రకారం నష్టపరిహారం ఎంతైనా అగడవచ్చని కానీవస్తువు కొనుగోలు కోసం చెల్లించిన విలువ రూ.50లక్షలలోపు ఉండాలన్నారు. వ్యక్తిగత అవసరాల కోసం వస్తువులు కొనుగోలు చేసేవారు మాత్రమే వినియోగదారుల చట్టం పరిధిలోకి వస్తారని, వ్యాపార లావాదేవీల కోసం వస్తువులు కొనుగోలు చేసేవారు ఈచట్టం పరిధిలోకి రారని వివరించారు. పౌరసరఫరాలసంస్థ సంచాలకులు ఆర్.గోవిందరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బంగారు దుకాణాల్లో ఒక మిల్లీగ్రామ్ స్కేల్ ఖచ్చితత్వాన్ని అమలు చేయటం గొప్ప విజయంగా అభివర్ణించారు. దీన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాకలెక్టర్ లక్ష్మీశా మాట్లాడుతూ సమాజంలో ఏవృత్తిలో ఉన్నవారైనా ప్రతి ఒక్కరూ వినియోగదారులేనన్నారు. ఇంటర్నెట్ వినియోగం పెరగటం, స్మార్ట్‌ఫోన్‌ని విరివిగా వాడటం వల్ల సమాజంలో సైబర్‌మోసాలు పెరుగుతున్నాయని, ప్రతిఒక్కరూ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈసందర్భంగా వినియోగదారుల హక్కులపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో బిస్ డైరెక్టర్ ప్రేమ్ సజానీ, లీగల్‌మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ కృష్ణచైతన్య, జేసి ఎస్.ఇలక్కియ, పౌరసరఫరాలశాఖ అదనపు సంచాలకులు కె.రంగకుమారి, డిఈఓ చంద్రకళ, పౌరసరఫరాలశాఖ జిల్లాఅధికారి ఏ.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# అటల్, మోడీ సుపరిపాలన యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన: బిజెపి ఎపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్



విజయవాడ, డిసెంబర్ 24, ప్రభాతవార్తప్రతినిధి: అటల్ మోదీ సుపరిపాలన యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో వాజ్‌పేయి విగ్రహాలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. నేటి తరానికి వాజ్‌పేయి విలువలు ఆదర్శమని అన్నారు. వాజ్‌పేయి గొప్పతనం తెలుసుకుని అందరూ ఆశ్చర్యవ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సుపరిపాలన యాత్ర గురించి సీఎం చంద్రబాబుకు చెప్పిన వెంటనే ఆనందం వెలిబుచ్చారని తెలిపారు. ఈ యాత్రకు కూటమిపరంగా , ప్రభుత్వపరంగా సహకారం అందించారని చెప్పారు. ఈ యత్రలు, సభల్లో కూటమి పార్టీల నేతలను భాగస్వామ్యం చేశారన్నారు. అటల్, చంద్రబాబులకు మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. సైబరాబాద్, శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లకు నాడు వాజ్‌పేయి సహకారం అందించారని గుర్తుచేశారు. సుపరిపాలన యాత్రలో బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారన్నారు. వాజ్‌పేయి ఈ దేశానికి చేసిన సేవకు, త్యాగాలను గురించి అందరూ ముక్త కంఠంతో కీర్తిస్తున్నారని తెలిపారు. ఈనెల 25న వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా అమరావతిలో స్మృతి వనం, విగ్రహాన్ని ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొంటారని తెలిపారు. ధర్మవరం నుంచి అమరావతి వరకు తమ యాత్రకు ప్రజలు నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, గ్రామాలకు రోడ్లు, ఐటీ, టెలికం, పొలిటికల్ కనెక్టివిటీలకు ఆద్యులు వాజ్‌పేయి అని కొనియాడారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా అనే తేడా లేకుండా ప్రజలు నుంచి వస్తున్న స్పందన అపూర్వమన్నారు. నేటి యువతరం, భవిష్యత్తుతరాలు వాజ్‌పేయి గొప్పతనం తెలుసుకోవాలని సూచించారు. తాము ఏర్పాటు చేసిన విగ్రహాలు, యాత్ర ద్వారా వాజ్‌పేయి నుంచి చాలా మంది స్ఫూర్తి పొందుతున్నారన్నారు.

# మోసపూరిత ప్రకటనలపై వినియోగదారులు అప్రమత్తం

## - జిల్లా కన్స్యూమర్ కమిషన్ ఇన్‌ఛార్జి ప్రెసిడెంట్ సలీం

**చిత్తూరు, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** మోసపూరిత ప్రకటనల పట్ల వినియోగదారులు నిత్యం అప్రమత్తంగా వుండాలని జిల్లా కన్స్యూమర్ కమీషన్ ఇన్‌ఛార్జీ ప్రెసిడెంట్ సలీం పేర్కొన్నారు. చిత్తూరు బిఎస్ కన్నన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జాతీయ వినియోగదారుల రక్షణ చట్టం-2025 సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జిల్లా కన్స్యూమర్ కమీషన్ ఇన్‌ఛార్జీ ప్రెసిడెంట్ సలీం పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలన్నారు. వినియోగదారుల సంక్షేమం కోసం వారికి అవగాహన కల్పించడానికి, వారి హక్కులను గుర్తు చేయడం కోసం ప్రతి ఏడాది డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. 2025 సంవత్సరంలో డిజిటల్ న్యాయం ద్వారా సమర్థవంతమైన, వేగవంతమైన తొలగింపు అనే థీమ్‌తో మార్గనిర్దేశం జారీ చేయడం జరిగిందన్నారు. ప్రతి వస్తువు కొనుగోలుపై బిల్లును కచ్చితంగా పొంది మీకు వున్న అధికారంను పొందాలన్నారు. జిల్లా కమీషన్‌లో రూ.50 లక్షల వరకు ఫిర్యాదు చేయవచ్చునని, రూ.2 కోట్ల వరకు రాష్ట్ర కమీషన్‌కు ఫిర్యాదు చేసి సత్వర న్యాయంపొందవచ్చు నన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 19వ తేదీన కన్నన్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు మీడియంల్లో ఒకొక్క విభాగం నుండి ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలును అతిధులు అందజేశారు. జిల్లా స్థాయిలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు 12 బహుమతులు, జూనియర్ కళాశాల విద్యార్థులకు 12 బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శంకరన్, సర్వశిక్షాభియన్ పిఓ వెంకటరమణ, లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ రమాదేవి, బిఎస్ ప్రభుత్వ బిఎస్ కన్నన్ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పల్ సయ్యద్‌మౌలా,



వినియోగదారుల అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కన్స్యూమర్ కమీషన్ ఇన్‌ఛార్జీ ప్రెసిడెంట్ సలీం

బిఎస్ కన్నన్ పాఠశాల హెడ్మాస్టర్ కోమల, పివికెఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్స్‌పల్ డాక్టర్ నాగేంద్ర, చిత్తూరు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నవ్వశ్రీనివాస్, డిటిసి ఎఓ చక్రపాణి, చిత్తూరు అర్బన్ తహసిల్దారు కులశేఖర్, రూరల్ తహసిల్దారు కళ్యాణి,

సమగ్ర శిక్ష అసిస్టెంట్ కమ్యూనిటీ మొబైలైజేషన్ ఆఫీసర్ బి.మధుసూధన్‌నాయుడు, అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి.అరుణ్‌కుమార్, బంగారుపాళ్యం, యాదమరి, పులిచెర్ల, ఐరాల, జిడినెల్లూరు, నగరి కన్స్యూమర్ వాలంటీర్ అర్గనైజేషన్ సభ్యులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి క్యాంటిన్‌లో ఆహార పదార్థాలపై ఎలుకల దాడి



విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలుకలు

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతి నిధి:** విజయవాడలో ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకలి రాజ్యం క్యాంటీన్‌లో విచిత్ర సంఘటన చోటుచేసుకుంది. ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ప్రైవేటు హోటల్లో ఎలుకలు నూడిల్స్ తింటూ కనిపించాయి. ఈ దృశ్యాలను అక్కడ చదువుకుంటున్న ఓ పీజీ విద్యార్థి తన మొబైల్ లో రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇప్పుడు ఆ వీడియో కొన్ని గంటల్లోనే విపరీతంగా వైరల్ అయింది. డ్వాక్రా మహిళల కోటాలో టిఫిన్, భోజనం సరఫరా చేయడానికి విజయవాడ కొత్త గవర్నమెంట్ ఆసుపత్రి ప్రాంగణంలో "ఆకలి రాజ్యం" పేరుతో హోటల్ ని ప్రారంభించారు. అక్కడ కేవలం టిఫిన్ భోజనం సరఫరా చేయడానికి మాత్రమే అనుమతి ఉంది. కానీ నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించి ఫాస్ట్ ఫుడ్ , పిజ్జా నూడిల్స్ కూడా అందుబాటులో ఉంచారు. అయితే అక్కడ ఉన్న సిబ్బంది నిరక్ష ్యంతో ఉడికించిన నూడిల్స్ ను పక్కన ఉంచి.. కనీస శుభ్రత పాటించడం లేదు. ఈ క్రమంలో క్యాంటీన్ లోపల ఉన్న ఎలుకలు వాటిని తినడం ప్రారంభించాయి. అక్కడికి వచ్చిన ఓ పీజీ విద్యార్థి ఆసుపత్రి క్యాంటీన్లో నూడిల్స్ తింటున్న ఎలుకల వీడియో తీసి వైరల్ చేశాడు.

# ఇనుమూరులో మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోండి : సిపిఎం శ్రీనివాసరావు

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏలూరు జిల్లా ఇనుమూరులో గిరిజనులు వేసిన మొక్కజొన్న పంటను ధ్వంసం చేసి అడ్డొచ్చిన గిరిజనులపై, గిరిజన మహిళలపై దాడికి పాల్పడిన పోలీసు, రెవెన్యూ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తక్షణం ఈ విషయంలో పోలీసు జోక్యాన్ని ఆపాలని డిజిపికి ఆయన విజ్ఞప్తి చేశారు. పోలీసులు ఆ గ్రామాన్ని చుట్టిముట్టి భయోత్పాత వాతావరణాన్ని సృష్టిస్తున్నారని, వారిని ఉపసంహరించి పేద గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్.. రెవెన్యూ అధికారుల జోక్యాన్ని ఆపాలన్నారు. గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా పోలీసులు, మండల రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా పంటను ధ్వంసం చేయడం దుర్మార్గమని తెలిపారు. గిరిజన మహిళలపై మగ పోలీసులే దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను గిరిజనులు తమ పూర్వీకుల నుంచి చదును చేసి సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అసైన్‌మెంట్ చేయాలని అధికారులకు దరఖాస్తులు పెట్టుకున్నప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన లేదని తెలిపారు. ఈ సమస్యపై ఇప్పటికే హైకోర్టులో కేసు నమోదై ఉన్నప్పటికీ పోలీసులు భూస్వాముల పక్షం వహించడం కోర్టు ధిక్కరణే అవుతుందని పేర్కొన్నారు. 1/70 చట్టం అమల్లో ఉన్న ఏజెన్సీలో ఈ రకంగా పోలీసు, అధికార యంత్రాంగం వ్యవహరించడం, గిరిజనులపై చట్టవిరుద్ధంగా దాడికి దిగడాన్ని ప్రజలు, ప్రజాతంత్ర వాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యా ప్రమాణాలు మెరుగుకు 'మన బడి మన బాధ్యత'



**విజయవాడ, డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** పాఠశాల విద్యా ప్రమాణాలు మెరుగుకు గుంటూరు జిల్లా యంత్రాంగం వినూత్న కార్యక్రమం ప్రారంభించింది. ముఖ్యంగా తొమ్మిది, పదవ తరగతి విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి, ఉన్నత విద్యా, ఉద్యోగ అవకాశాలు పట్ల అవగాహన కల్పించడం తద్వారా పది పరీక్షలలో శత శాతం ఫలితాలు సాధించడం లక్ష ్యంగా "మన బడి మన బాధ్యత" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో గల 185 ఉన్నత పాఠశాలలకు జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించి ఆయా పాఠశాలల పర్యవేక్షణ చేయుటకు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. తొమ్మిది, పది విద్యార్థుల్లో మానసిక ఆందోళన తగ్గించడం, చదువు పట్ల ఏకాగ్రత కలిగించడం, విద్యార్థులు ఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో గుర్తించి వాటిలో మంచి తర్ఫీదు ఇవ్వడం, అందులో ఉన్న భయం పోగొట్టడం, అదే సబ్జెక్టులో ఉన్నత విద్య అభ్యసించి అందులో నిపుణులుగా తయారు అయ్యే విధంగా మలచడం వంటి అంశాలు పట్ల దృష్టి సారించారు. విద్యార్థులకు ప్రత్యేక అధికారులు మార్గదర్శిగా, కౌన్సిలింగ్ అందించడం చేస్తారు. వివిధ రంగాల్లో విజయాలు సాధించిన వ్యక్తుల జీవిత చరిత్రలు తెలియజేస్తూ ప్రేరణ కలిగించడం జరుగుతుంది. జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ విద్యార్థులు సరైన అవగాహన లేక అనేక అవకాశాలు చేజార్చుకుంటున్నా రన్నారు. విద్యార్థులకు మంచి మార్గదర్శకత్వం, సూచనలు, సలహాలు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు అందించడం వలన భవిష్యత్తుకు గట్టి పునాది పడుతుందన్నారు. అందుకే "మన బడి మన బాధ్యత" కార్యక్రమాన్ని అమలు చేస్తూ జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులు.

# జాతీయ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు రాహుకేతుదోష నివారణ పూజలు

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 24 ప్రభాతవార్త** జాతీయ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధూ కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలను జరిపించుకున్నారు. పివి సింధూ గతంలో కూడా పలుమార్లు శ్రీకాళహస్తీశ్వరుని సేవలో పాల్గొన్నారు. బుధవారం సింధూ కుటుంబసభ్యులతో రాగా ఆమెకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో వేదపండితులతో ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ స్వాగతం పలికారు. ఏర్పాట్లను ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలు స్వాగతం పలికారు. ఆమె ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణపూజలు జరిపించుకోవాలని

కోరగా అలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఎపిఆర్ఓ రవి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామి సహస్రలింగేశ్వరాలయం వద్ద వేదపండితులతో ఏర్పాటు చేసారు. పూజల అనంతరం ఆమెకు అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలుఅందించారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.



**చైర్మెన్‌చే సన్మానం:** భారతదేశంలో క్రీడల ప్రాధాన్యత మహిళల కు అవకాశాలకు హద్దులేదని నిరూపించిన పివి సింధూ కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి రాగా ఆమెకు సాదర స్వాగతాలు ఏర్పాటు చేయటమే కాకుండా శ్రీకాళహస్తి ప్రాధాన్యతను వివరిస్తూ ఆమెను దుశ్శాలువతో సత్కరించారు.

# విజయవాడ- గూడూరు మధ్య నాలుగో రైల్వేలైన్ నిర్మాణం!

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి డీపీఆర్ సిద్ధమవుతుంది. దీని వలన ప్రయాణం కుడా సులభతరం అవుతుంది. గూడ్స్ రవాణాలో విజయవాడ డివిజన్ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ప్యాసింజర్ రైళ్లతో కలిపి రోజుకు సగటున 170 వరకు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. రద్దీని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే విజయవాడ నుంచి గూడూరు మధ్య రూ.6,238 కోట్లతో 280 కి.మీ. మూడో రైల్వేలైను నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో 260 కి.మీ. పూర్తయ్యింది. త్వరలోనే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. తీరం వెంబడి సరకు రవాణాను మరింతగా పెంచడం కోసం ఇప్పటికే కేంద్రం పారిశ్రామిక కారిడార్లకు రూపకల్పన చేసింది. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని నాలుగో రైల్వేలైను నిర్మాణానికి సెమీ హైస్పీడ్ ప్రాజెక్టులో భాగంగా రైల్వేశాఖ డీపీఆర్‌ను సిద్ధం చేస్తోంది. రానున్న బడ్జెట్‌లో కేంద్రం దీనికి నిధులు కేటాయించే అవకాశం ఉంది. వందేభారత్ వంటి హైస్పీడ్ రైళ్లు కూడా పెరగనున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని విజయవాడ నుంచి గూడూరు మధ్య మూడో లైన్ వెంబడి 293 కి.మీ. మేర కొత్తగా నాలుగో లైన్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మూడు, నాలుగు లైన్ల నిర్మాణం పూర్తయితే విజయవాడగూడూరు మధ్య ప్రయాణ సమయం మరింతగా తగ్గుతుంది. గూడ్స్ రైళ్లు సాఫీగా వెళ్లే అవకాశం కూడా ఉంది. హైస్పీడ్ రైళ్లు గంటకు 200 కి.మీ. వేగంతో పరుగులు తీయనున్నాయి. ప్రస్తుతం మూడోలైను పక్కనే నాలుగో లై ను అవసరాలకు అనుగుణంగా వంతెనలను, ఆర్వోబీలను నిర్మిస్తున్నారు. దీంతో నాలుగోలైన్ పూర్తిగా కార్యరూపం దాల్చితే ట్రాక్ పనులు వేగంగా జరిగే అవకాశం ఉంటుంది. తీరం వెంబడి సరకు రవాణాను మరింతగా పెంచడం కోసం ఇప్పటికే కేంద్రం పారిశ్రామిక కారిడార్లకు రూపకల్పన చేసింది. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని నాలుగో రైల్వేలైను నిర్మాణానికి సెమీ హైస్పీడ్ ప్రాజెక్టులో భాగంగా రైల్వేశాఖ డీపీఆర్‌ను సిద్ధం చేస్తోంది. రానున్న బడ్జెట్‌లో కేంద్రం దీనికి నిధులు కేటాయించే అవకాశం ఉంది. వందేభారత్ వంటి హైస్పీడ్ రైళ్లు కూడా పెరగనున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని విజయవాడ నుంచి గూడూరు మధ్య మూడో లైన్ వెంబడి 293 కి.మీ. మేర కొత్తగా నాలుగో లైన్ ఏర్పాటుకు సన్నాహాలు.

# సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిది : మంత్రి నారాయణ

**నెల్లూరు కార్పోరేషన్, డిసెంబర్ 24 ప్రభాతవార్త :** సిఎం సహాయనిధి పేదలకు ఒక వరంలాంటిదని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాకటర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా కార్పోరేషన్ కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి నారాయణ పంపిణీ చేశారు. 29మందికి 22,42,308రుపాయల చెక్కులు అందజేశారు. సిఎంఆర్ఎఫ్ మంజూరుకు సహకరించిన మంత్రి నారాయణకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. సిఎం చంద్రబాబు పదికాలాలుపాటు ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ సిఎం సహాయనిధి పేదల పాలిట సంజీవనిల మారిందన్నారు. పేదల ప్రాణరక్షణకు సిఎం రిలీఫ్‌ఫండ్ అండగా నిలుస్తొందన్నారు. అనారోగ్యంతో బాదపడుతున్న పేదల ప్రణాలకు భరోసా కల్పిస్తొందన్నారు. దరఖాస్తు చేసుకొన్న వారందరికి సిఎం సిఎం సహాయనిధి మంజూరు చేస్తున్నారని తెలిపారు. సిటీ నియోజకవర్గంలో ఏడాదిలో 292మందికి 3కోట్ల2లక్షల 12వేల 700రుపాయల చెక్కులు అందచేస్తామని పేదల సంక్షేమానికి సిఎం చంద్రబాబు నాయుడు గారు అత్యధిక ప్రాదాన్యత ఇస్తున్నారన్నారు. మాటమీద నిలబడే ప్రభుత్వం మాదని ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఈకార్యక్రమంలో కమీషనర్ నందన్, రాష్రట వక్ఫ్‌బోర్డ్ చైర్మెన్ అబ్దుల్ అజీజ్, ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, రాష్ట్ర వేర్‌హౌస్ కార్పోరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జడ్పిటిసి విజేతారెడ్డి, నగరపార్టీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పోరేటర్లు, డివిజన్ ముఖ్య నేతలుపాల్గొన్నారు.

# అటవీశాఖ భూములకు రెవెన్యూ పట్టాలు

## పెన్సింగ్ తొలగించి నిమ్మ, మామిడి చెట్లు నాటారంటూ అటవీశాఖకు ఫిర్యాదు

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 24 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలంలోని సింహాచల కండ్రిగలో ఎంతో కాలంగా రగులుతున్న అటవీభూముల వివాదం రోజు రోజుకు ముదురుతుంది. ఈ వివాదాలకు సంబంధించి కోర్టులో స్టేటస్‌కో అమలులో ఉంది. వివాదాస్పదమైన భూముల్లో ప్రవేశించి అటవీశాఖ అస్తులను ధ్వంసం చేసినారంటూ అటవీశాఖ సెక్షన్ అధికారి గిరిశం ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు 27మందిపై కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ వెంకటేశ్ బుధవారం వివరించారు. శ్రీకాళహస్తి అటవీశాఖ పరిధిలో సింహాచల కండ్రిగ గ్రామానికి సమీపంలో అటవీ భూములున్నాయి. ఈ భూములకు గతంలో రెవెన్యూ శాఖ రైతులకు పట్టాలుజారి చేసారు. అయితే ఈ భూములకు సంబంధించి అటవీశాఖ పేచీ పెట్టింది. దాంతో ఈ సమస్య కోర్టుకు వెళ్ళింది. పలు పరిశీలనల తరువాత ఈ భూములు అటవీశాఖకు చెందినవే అంటూ కోర్టు తీర్పు చెప్పింది. ఈ భూముల్లో చెట్టను నాటటానికి నిధులు మంజూరు చేసింది. ఈ పనులకు వెళ్ళినపుడు ఆర్నెల్ల క్రితం పట్టాలు పొందిన వారు అడ్డుకున్నారు. దాంతో ఈ సమస్య రాజకీయంగా మారింది.. మండలంలోని సింహాచల కండ్రిగ గ్రామంలో అటవీశాఖకు చెందిన భూములున్నాయి. ఇక్కడి అటవీభూములకు గతంలో పని చేసిన రెవెన్యూ అధికారులు కొందరు రైతులకు పట్టాలు ఇచ్చారు. దాంతో గ్రామస్తులు అటవీశాఖకు మధ్య పోరు ప్రారంభం అయ్యింది. ఈ పోరు శాంతి భద్రతల సమస్యగా మారింది. ఈ సమస్యకు సంబంధించి ఒక దశలో స్థానిక నాయకుడు ఒకరు కల్పించుకున్నారనే విమర్శలు చోటు చేసుకున్నాయి. సింహాచల కండ్రిగకు సంబంధించి అటవీభూములకు సంబందించి గ్రామస్తుల మధ్య వివాదం చోటు చేసుకోగా సమస్యను పెంచకుండా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్‌ను రప్పించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు. వివాదాలకు సంబంధించిన సింహాచలకండ్రిగ వాసులకు, అటవీ ఉన్నత శాఖ అధికారులను రప్పించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానికులను ఓదార్చారు. ప్రత్యామ్నాయం భూముల ఇస్తామని నమ్మబలికారు. అయితే గ్రామస్తులకు సమీపంలో ఇస్తామన్న హామీని అమలు చేయటానికి సాధ్యం కాలేదు. రెవెన్యూ శాఖకు అందుబాటులో ఉన్న 6కిలో మీటర్ల దూరంలోని ఆంజనేయ పురం గ్రామానికి సమీపంలో ఇచ్చారు. అయితే బాధితులు అందుకు అంగీకరించక మళ్ళీ కోర్టును ఆశ్రయించారు. దాంతో సమస్య మొదటికి వచ్చింది. కానీ కోర్టులో ఈ భూముల కు సంబంధించి స్టేటస్‌కో ఉన్నా గ్రామస్తులు భూముల్లోకి ప్రవేశించి అటవీశాఖ నాటిన చెట్లను తొలగించి తమ చెట్లను నాటుకొని తమ ఫెన్సింగ్‌ను వేసుకున్నారు. అయితే అటవీశాఖ అధికారులు ఫిర్యాదుతో సరిపెట్టుకున్నారు.

# వాయులింగేశ్వరుని సేవలో సుప్రీం కోర్టు జడ్జి

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 24 ప్రభాతవార్త** సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కుటుంబసభ్యులతో కలసి బుధవారం వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ మేరకు దక్షిణ గోపురం వద్ద ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో వేదమంత్రాలతో ఘనస్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఇఓ టి.బాపిరెడ్డి వారికి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించగా వేదపండితులతో వేదమంత్రాలతో ఆశీర్వదించారు.



# 15 గ్రామాల్లో మహిళలు స్మార్ట్‌ఫోన్ వినియోగంపై నిషేధం

## రాజస్థాన్ జాలోర్ జిల్లాలో గ్రామపెద్దల 'ఫోన్' పంచాయితీ

**జాలోర్(రాజస్థాన్), డిసెంబరు 24:** ప్రపంచం మొత్తం 6జివైపు దూసుకుపోతుంటే రాజస్థాన్‌లోని జాలోర్ జిల్లాలోని 15 గ్రామాలు మాత్రం స్మార్ట్‌ఫోన్ వినియోగంపై ఆంక్షలు పెట్టాయి. గ్రామాల్లోని మహిళలు కేవలం కీప్యాడ్‌ఫోన్లు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. సంధమాత పట్టి పంచాయత్‌లోని చౌదరి కమ్యూనిటీ ఈమేకు మహిలలు, బాలికలు స్మార్ట్‌ఫోన్లు వినియోగించకూడదని నిషేధం విధించింది. దీనివల్ల మొబైల్‌ఫోన్లకు బానిసలవుతున్నారని గ్రామపెద్దలు ఆరోపిస్తు చిన్నారుల్లో కంటిచూపులోపాలు కూడా పెరుగుతున్నట్లు చెప్పారు. వచ్చేనెల 26వ తేదీనుంచి ఈ నిషేధం నిర్ణయాలు అమలులో ఉంటాయి. మహిలలు కేవలం కీపాడ్‌ఫోడ్లు మాత్రమే వినియోగించాలి. అలాగే పెళ్లిళ్లు ఇతర శుభకార్యాలయాలకు ఫోన్లు కూడా తీసుకువెళ్లకూడదు. ఇరుగుపొరుగు ఇళ్లకు వెళ్లినా వెంట ఫోన్లు తీసుకెళ్లకూడదని ఆంక్షలు విధించారు. ఇందుకు సంబంధించిన పంచాయతీ తీర్మానం చదువుతున్న పెద్దతోపాటు ఇతర పెద్దల విడియో ఆన్‌లైన్‌లో వైరల్ అయింది. కెమేరా ఉన్న ఫోన్లు మహిలలు వాడకూడదు. మాట్లాడేందుకు కెమేరాలేని కీపాడ్‌ఫోన్లుమాత్రమే వాడాలి. విద్యార్థినులు ఇళ్లనుంచి వెళ్లేటపుడు బయటకు ఫోన్లు తీసుకెళ్లకూడదు. పాఠశాల వెళ్లే బాలికలు మాత్రం ఇంట్లో ఫోన్లు వాడుకోవచ్చు. బయటి ఫంక్షన్లకు వీటిని తీసుకెళ్లకూడదు. మహిళలకు స్మార్ట్‌ఫోన్లు ఉండటం వల్ల పిల్లలు వాటిని తీసుకుని బానిసలవుతున్నారని అందువల్లకంటిచూపు లోపిస్తోందని పెద్దలు చెపుతున్నారు. గాజీపూర్‌గ్రామంలోజరిగినీ పంచా యతీలో తీర్మానం చేసారు. పట్టి కులానికి చెందిన అద్యక్షుడు సుజన్‌రామ్ చౌదరి ఈ తీర్మానం ప్రతిపాదించారు. ఈ కులపెద్దల నాయకత్వం ప్రకారం పంచ్ హిమమ్మతరం ఈ తీర్మానాన్ని చదివి వినిపించారు. ఈ నిర్ణయం ఇతర గ్రామాల్లోకూడా అమలుచేస్తున్నారు. భిన్మల్ ప్రాంతంలోని ఘాజిపూర్, పావాలి, కల్డా, మనోజ్‌ఉయావాస్, రాజికవాస్, దాట్లవాస్, రాజ్‌పుర, కోడి, సిద్‌రోడి, ఆల్డి, రోప్సి, ఖండేల్వాల్, సావిధర్, హత్మికి ధని, ఖాన్‌పూర్ తదితర పంచాయితీల్లోకూడా ఈతీర్మానం అమలవుతోంది. సోషల్ మీడియాలో తీవ్రస్థాయి విమర్శలు వెల్లువెత్తాయి. మహిళా హక్కుల సంఘా లు కూడా విమర్శించాయి. మహిళా వ్యతిరేకిగా ఈ తీర్మానం ఉందని, మహిళలపై ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు పెరిగాయి.

# తైవాన్‌లో తీవ్రస్థాయి భూకంపం

## రిక్టర్ స్కేలుపై 6.1గా నమోదు

**తైపేయి, డిసెంబరు 24:** తైవాన్‌లో భారీ భూకంపం సంభవించింది. ఆగ్నే య తీరప్రాంత కౌంటీ అయిన టైటుంగ్‌లో బుధవారం భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 6.1గా నమోదైంది. ఈ ప్రభావంతో రాజధాని తైపీ లో భవనాలు కుప్పకూలిపోయాయి. అయితే, ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ ప్రకారం.. భూకంపం భూమికి 11.9 కిలో మీటర్ల లోతులో నమోదైంది. స్థానిక మీడియా సంస్థ తైవాన్ న్యూస్ ప్రకారం.. భూకంపం కేంద్రం టైటుంగ్ కౌంటీ హాల్‌కు ఉత్తరాన 10 కిలోమీటర్ల దూరంలో ఉంది.

# కొత్త సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వాడకంపై ఈగల్ ఫోర్స్ నజర్

## బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్, న్యూఇయర్ వేడుకల నిర్వాహకులు డ్రగ్స్ వాడరాదని హెచ్చరిక

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** ఈ నెల 31వ తేదీ రాత్రి నూతన సంవత్సరం సందర్భంగా జం ట నగరాలు, శివార్లలో జరిగే వేడుక లపై ఈగల్ ఫోర్స్ (పూర్వపు టి.నాబ్) దృష్టి సారిం చింది. న్యూ ఈయర్ వేడుకల్లో మాదకద్రవ్యాల వాడకాన్ని ఎవరూ ప్రోత్సహించరాదని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించే నిర్వాహకు లతో పాటు పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్ల యజమానులు ఈ విషయంలో కచ్చితంగా వుండాలని ఎవరైనా డ్రగ్స్ వాడకాన్ని ప్రోత్సహించినా, అ మ్మకాలు జరిపినా వెంటనే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్‌తో పాటు ఈ సిగరెట్లను కూడా నిషేధించామని, వీటిని ఎవరూ వాడవద్దని ఆ యన కోరారు. ఈ విషయంలో ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. పబ్‌లతో పాటు బార్ అండ్ రెస్టారెంట్లలో మైనర్లకు మద్యం అందుబాటులో వుంచకూడదని ఆయన తెలిపారు. ఒకవేళ ఎక్కడైనా మైనర్లు మద్యం సేవించి పట్టుబడితే వారితో పాటు వారికి మద్యం సర ఫరా చేసిన వారు కూడా అరెస్టవుతారని ఆయన హెచ్చరించారు.
తెలంగాణ రాష్ట్రాన్ని నిషా విముక్త్ ప్రాంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈగల్ ఫోర్స్ పనిచేస్తుందని, దీనికి అన్ని వర్గాల మద్దత్తు కావాలని ఆయన కోరారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వాడకంపై ఉక్కుపాదం మోపేందుకు ట్రై కమిషనరేట్ల పోలీసులు ఇప్పటికే ప్రత్యేక బృందాలను రంగంలో దించారని, దీనికి అదనం గా ఈగల్ ఫోర్స్ తరపున మాదకద్రవ్యాల స్మగ్లర్ల భరతం పట్టేందుకు సొంత బృందం రంగంలో దిగుతోందని సందీప్ శాండిల్యా తెలిపారు. నూతన సంవతన్సర వేడుకల్లో ఎవరైనా డ్రగ్స్ వాడితే వె ంటనే 8712671111కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

# నేను కాంగ్రెస్ ఎమ్మెల్యేనే.. నా ప్రయాణం కాంగ్రెస్‌తోనే

## ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), డిసెంబరు 24, ప్రభాతవార్త:** తాను పక్కాగా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, అందులో ఎలాంటి సందేహం లేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. తాను ఏ పార్టీలో ఉంటే అదే గెలుస్తుందని, అదే తన స్పెషాలిటీ అని ఆయన ఛలోక్తి విసిరారు. బంజారాహిల్స్ జహీరానగర్, సింగాడిబస్తీలో జలమండలి అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వచ్చిన ఆయన పలు అంశాలపై మాట్లాడారు. కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా వచ్చే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో హైదరాబాద్ నగరంపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే తమ లక్ష్యంగా పని చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం నగరం మొత్తం కలియతిరిగి పార్టీని బలోపేతం చేస్తానని ప్రకటించారు. ఎంఐఎంతో కలిసి ప్రచారం చేసి నగరంలోని దాదాపు 300 డివిజన్లలో తాను పర్యటిస్తానని దానం తెలిపారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీతోపాటు, మిత్ర పక్షంగా ఉన్న ఎంఐఎం అభ్యర్థుల గెలుపు కోసం కూడా తాను ప్రచారం చేస్తానని ఆయన వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల కూటమి సత్తా చాటుతుందని, ప్రజల మద్దతు తమకే ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఇంత బడ్జెట్ ఇచ్చి, అభివృద్ధి కార్యక్రమాలఉుల చేస్తుంటే కాంగ్రెస్ కాకుండా మరో పార్టీ ఎలా గెలుస్తుందన్నారు. ఫిరాయింపులపై సెటైర్లు, పార్టీ మార్పుల గురించి వస్తున్న వార్తలపై ఆయన తనదైన శైలిలో స్పందించారు. ఇతర ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో, ఎటు వెళ్తున్నారో తనకు తెలియదని, కానీ తాను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నానని స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రయాణం కాంగ్రెస్‌తోనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు రాములు చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులు లేని 1,441 పాఠశాలలు తాత్కాలిక మూసివేత

## ఆయా ప్రాంతాల్లో తల్లిదండ్రులు కోరితే మళ్లీ తెరవడానికి సిద్ధం

## తెలంగాణ పాఠశాల విద్యా శాఖ కీలక నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 24:** రాష్ట్రంలో విద్యార్థులు లేని జీరో ప్రభుత్వ పాఠశాలలపై పాఠశాల విద్యా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు లేని పాఠశాలలను తాత్కాలికంగా మూసివేయనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి వాటిని ఏకీకృత జిల్లా పాఠశాల విద్యా సమాచారం గణాంకాల్లో చూపిం చరు. ఒక్క విద్యార్థి కూడా లేని ప్రభుత్వ పాఠశా లల సంఖ్య తెలంగాణలో అధికంగా ఉంది. 2024-25 విద్యా సంవత్సరపు లెక్కల ప్రకారం తెలంగాణలో ఇలాంటి పాఠశాలలు 2,245 ఉన్నాయి. పాఠశాల విద్యా శాఖ పరిధిలో 2 వేలకు పైగా పాఠశాలలు ఉండగా, వాటిలో 1,441 చోట్ల విద్యార్థులు లేరు.
ఉపాధ్యాయ పోస్టులు కూడా లేవు. మరో 600 పాఠశాలల్లో విద్యార్థులు లేకున్నా ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతానికి 1,441 పాఠశాలలను తాత్కాలికంగా మూసి వేయనున్నారు. మిగిలిన పాఠశాలలకు సంబంధించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఈ పాఠశాలలు పని చేయడం లేనందున తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.
గ్రామస్థులు తమ పిల్లలను బడికి పంపిస్తామని కోరితే పాఠశాలలను తిరిగి తెరుస్తామని, ఉపాధ్యాయులను కూడా నియమిస్తామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. మారు మూల శివారు తండాల్లో కూడా తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది 200 పాఠశాలలను కొత్తగా ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తు చేస్తున్నారు.

# నేను తెలంగాణ ప్రజల బాణాన్ని

## నన్ను ఎవరూ ఆపరేట్ చేయలేరు

## జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజల బాణానని, తనను ఎవరూ ఆపరేట్ చేయడం లేదని జాగృతి వ్యవస్థాపకురాలు కవిత స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించిన జాగృతి జనం బాట కార్యక్రమంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 2029 ఎన్నికలు వస్తాయని భావిస్తున్నామని, ఆ ఎన్నికల్లో జాగృతి కచ్చితంగా బరిలో ఉంటుందని తెలిపారు. బీఆర్ఎస్ నుంచి తనను ఎందుకు సస్పెండ్ చేశారో ఇప్పటివరకు పార్టీ స్పష్టమైన కారణం చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉరి వేసే వ్యక్తికైనా కారణం చెబుతారని, కానీ తన విషయంలో మాత్రం ఎలాంటి వివరణ ఇవ్వలేదని వ్యాఖ్యా నించారు. బీఆర్ఎస్‌లో జరిగిన తప్పులకు ఆ పార్టీలో ఉన్న సమయంలో తానూ భాగస్వామి నేనని ఒప్పుకుంటూ, ప్రజలకు జరిగిన అన్యాయానికి క్షమాపణలు తెలిపారు. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్‌లో పెద్దల భూములను కాపాడేందుకు పేదల భూములను బలి పెడుతున్నారని ఆరోపిం చారు. నాయకుల అవినీతి కోసం ఇష్టాను సారం ఆలైన్‌మెంట్లు మార్చారని తెలిపారు. దీనిపై జాగృతి తరఫున క్షేత్రస్థాయిలో ఉద్యమ పోరాటాలు నిర్వహిస్తామని ఆమె హెచ్చరించారు. జనవరి 5న హైదరాబాద్‌లో బాధిత రైతులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్ట్‌లో భాగంగా బస్వాపూర్ రిజర్వాయర్ సామర్థ్యాన్ని 11.7 టీఎంసీకి పెంచినా ఇప్పటివరకు చుక్క నీరు కూడా రాలేదన్నారు. కెనాల్స్, డిస్ట్రిబ్యూటరీ ఛానెల్స్ పూర్తి కాలేదని, 96 ఎకరాల భూములకు ఎలాంటి పరిహారం ఇవ్వకుండా తీసుకున్నారని విమర్శిం చారు. కలెక్టర్ చొరవ తీసుకుని వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జాగృతి ఓట్ల కోసం వచ్చిన సంస్థ కాదని, ప్రజల సమస్యలపై పోరాడే ఉద్యమని కవిత స్పష్టం చేశారు. 19 ఏళ్లుగా జాగృతి పేరుతో ప్రజల్లో ఉన్నానని, తెలంగాణ భాష, యాస, సంస్కృతి కోసం ఉద్యమం చేశామని గుర్తు చేశారు. బతుకమ్మ, బోనాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందేలా కృషి చేశామని తెలిపారు. భువనగిరిలో ఏర్పాటు చేసిన ఎయిమ్స్‌లో ఇప్పటికీ ఎమర్జెన్సీ మందులు లేని పరిస్థితి ఉందని తెలిపారు. కేంద్రం నుంచి రూ.750 కోట్లు వచ్చినా భవన నిర్మాణాలు ఆలస్యం అవుతున్నాయని విమ ర్శించారు. భవనాలను త్వరగా పూర్తి చేసి, ఎయిమ్స్‌లో వచ్చే ఉద్యోగాల్లో 80 శాతం స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకా యిలు వెంటనే చెల్లించకుండా పేద విద్యార్థులను ప్రభుత్వం అవమానిస్తోందని ఆరోపించారు.
ఈ విషయంలో ముఖ్యమంత్రి మాట తప్పారని విమర్శించారు. ఎక్కడ జాగృతి పర్యటన చేసినా అక్కడి సమస్యలను ఫాలోఅప్ చేస్తామని, పటిష్టమైన క్యాడర్‌ను నిర్మించి ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తామని కవిత స్పష్టం చేశారు.



యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించిన జాగృతి జనం బాట కార్యక్రమంలో మీడియాతో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

# గర్భిణి పై దాడి చేసిన అజయ్‌కు జనసేన పార్టీకి ఎటువంటి సంబంధం లేదు

## - తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికిన జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి భైరవ ప్రసాద్




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భైరవ ప్రసాద్

**కదిరి, డిసెంబర్ 24 ప్రభాతవార్త** తనకల్లు మండలం ముత్యాల వారి పల్లెలో జగన్ బర్త్డే వేడుకల్లో నిండు గర్భిణీ పై దాడి చేసిన అజయ్‌కు జనసేన పార్టీకి ఎటువంటి సంబంధం లేదని అజయ్ కు జనసేన పార్టీలో సభ్యత్వం కూడా లేదని... అజయ్ పక్కా వైసీపీ కార్యకర్త అని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భైరవ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసిపిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బర్త్ డే వేడుకల్లో పాల్గొనేది వైసిపి కార్యకర్తలని ఆ విషయం గ్రహించాలని హితువు పలికారు. స్టార్ హీరో పవన్ కళ్యాణ్ కు అభిమానులు అన్ని పార్టీల్లో ఉంటారన్నారు. పనిగట్టుకొని వైసీపీ సోషల్ మీడియా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. వైసీపీ అనుకూల మీడియా తప్పుడు ప్రచారాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు అజయ్ అనే వ్యక్తి ఏ రోజు జనసేన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేదన్న విషయం తెలుసుకోవాలన్నారు. ఒక వ్యక్తిని ట్రాప్ చేసి ఆ వ్యక్తి మాటలు పరిగణలోకి తీసుకొని దుష్ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మహిళలను గౌరవించే పార్టీ జనసేన పార్టీ అని నిండు గర్భిణీ పై వైసీపీ కార్యకర్త దాడి చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తప్పుడు ప్రచారాలు తప్పుడు మాటలు మాట్లాడటం వైసిపికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. మహిళల జోలికి వస్తే తాట తీయమని చెప్పింది డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అని తెలిపారు. వైసీపీ కార్యకర్తపై పోలీసుల స్పెషల్ ట్రీట్మెంట్ పూర్తి స్థాయిలో సమర్థిస్తున్నామన్నారు
ఇప్పటికైనా వైసీపీ సోషల్ మీడియా కొందరు జర్నలిస్టులు వాస్తవాలు తెలుసుకుంటే మంచిది అన్నారు. జనసేన పార్టీ పై బురద చల్లాలని చూస్తే అంతే స్టైల్ లో బదులిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ భైరవ ప్రసాద్ హితువు పలికారు.

# దేశ సంపదను కొల్లగొట్టి దోపిడి దారులకు కాపలాకాయడం ధ్యేయంగా మోడీ పాలన సాగుతోంది

## - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**కదిరి, డిసెంబర్ 24 ప్రభాతవార్త** దేశ సంపదను కొల్లగొట్టి దోపిడి దారులకు కాపలాకాయడం ధ్యేయంగా మోదీ పాలన సాగుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. బుధవారం పట్టణంలోని ఎన్జీఓ హోంలో సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి వేమ యాదవ్ అధ్యక్షతన జిల్లా స్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ..భారత కమ్యునిస్టు పార్టీ శ్రమ జీవుల సమరాలకు వెన్నుదన్నుగా నిలుస్తూ వంద సంబరాలు పూర్తి చేసుకుని 101లోకి అడుగు పెడుతున్నామన్నారు. బ్రిటీష్ పాలనను పూర్తిగా తిరస్కరించాలని దేశ ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించి రాజ్యాంగ అసెంబ్లీ ఏర్పాటు కోసం దేశ నలుమూలల నుంచి అంకిత భావం గల కమ్యునిస్టులంతా సమీకృతులై సీపీఐ పార్టీని స్థాపించారన్నారు. స్వాతంత్రర్య పోరాటంలో ఏ మాత్రం పాత్రలేని పార్టీలు నేడు అధికారాన్ని కౌవసం చేసుకుని దేశ రాజకీయ వ్యవస్థను ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. దేశ సంపదను క ఒల్లగొట్టడం, దోపిడీ దారులకు కాపలాకాయడం ద్యేయంగా మోదీ పాలన సాగుతోందని ఆరోపించారు. దేశంలో మత వాద శక్తులు రోజురోజుకు తమ ప్రభావాన్ని పెంచుకుంటూ లౌకిక ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమిస్తున్నాయన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దున్నేవాడిదే భూమి అంటూ వీధి పోరాటాల నుంచి పార్లమెంట్ వరకు పోరాటాలు చేసిన ఘనత భారత కమ్యునిస్టు పార్టీకే దక్కిందన్నారు. మణిపూర్‌లో మహిళ వివస్త్రను చేసి హింసకు గురి చేసి ప్రధాని నోరు ఉండి మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీ వికసిత్ భారత్ అంటూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్నారు తప్పా ఎక్కడా పురోగతి సాధించింది లేదని, కార్మికుల పని 8 గంటల పనిదినాల కోసం సిపిఐ అనేక పోరాటాలతో సాధ్యమైందన్నారు.
ఏ ముఖ్యమంత్రినో..ఏ ప్రధానినో..ఇచ్చింది కాదన్నారు. 18 సంవత్సరాలు నిండిన అందరికీ ఓటు హక్కు కల్పన కోసం సిపిఐ విశేష కృషి చేసిందన్నారు. మోదీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, విమాన, బ్యాంకులు, ఎల్ఐసి వంటి వాటిని విక్రయానికి పెట్టిందే తప్పా సాధించింది శూన్యం అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి విధానంతో ప్రైవేటీకరణ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. జనవరి 18న కమ్మంలో జరిగే శత వసంత వేడుకలకు ఐదు లక్షల మందితో కమ్మంలో కదం తొక్కుదామని ఆయన పిలుపునిచ్చారు.
సమావేశం కంటే ముందు సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక మదనపల్లి రోడ్డులోని పివిఆర్ ఫంక్షన్ హాల్ నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్, రామచంద్రయ్య, సిపిఐ నాయకులు కాటమయ్య, జింక చలపతి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

# రెండు వారాల్లో యుపిఎస్‌సికి డిజిపి ఎంపిక ప్యానెల్

## ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశంజనవరిలో జాబితాను పంపనున్న సర్కారు?

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఎంపికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో బుధవారం మరోసారి విచారణ జరిగిందఇ. శివధర్ రెడ్డి ఎంపిక నిబంధనల మేరకు జరగలేదని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం యుపిఎస్‌సికి ఎలాంటి జాబితాను పం పలేదని పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది తెలిపారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, డిజిపి ఎంపిక నిబంధనల మేరకు మరోసారి జరపా లని ఆయన కోరారు. దీనిపై వారం రోజుల క్రితం విచారణ చేసిన హైకోర్టు బుధవారం నాడు మళ్లీ విచారించింది. అనంతరం దీనిపై రాష్ట్ర ప్రభు త్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. డిజిపి ఎంపికకు సంబంధించిన జాబితాను సీనియారిటీ ప్రకారం యుపిఎస్‌సికి పంపాలని ప్రభుత్వాన్ని ఆదే శించింది. అయితే డిజిపిగా శివధర్ రెడ్డి నియామకం విషయంలో తాము జోక్యం చేసుకోబోమని పేర్కొన్న హైకోర్టు దీనిపై విచారణను రెండు వా రాలు వాయిదా వేసింది. కాగా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో డిజిపి ఎంపికకు సంబంధించిన జాబితాను సీనియారిటీ ప్రకారం యుపిఎస్‌సి పంపేం దుకు సర్కారు సిద్దమవుతోంది. పోలీసు శాఖలో సీనియారిటీ ప్రకారం 1991 బ్యాచ్ అధికారి హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి ఆనంద్ సీనియర్. ఆయన తరువాత 1994 బ్యాచ్‌లో కేంద్ర సర్వీసులో వున్న వినాయక్ ప్రభాకర్ ఆప్టే ద్వితీయ స్థానంలో వున్నారు. వీరిద్దరి తరువాత ఇ దే బ్యాచ్‌కు చెందిన డిజిపి శివధర్ రెడ్డి మూడవ స్థానంలో వున్నారు. వీరి తరువాత ఇదే బ్యాచ్‌కు చెందిన తెలంగాణ పోలీసు అకాడమి డైరక్టర్ అ భిలాష్ బిస్త్, ఆమె తరువాత జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా, ఆమె తరువాత తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్‌గా వున్న శిఖా గోయల్ సీనియర్లుగా వున్నారు. అయితే డిజిపి ఎంపికలో కేంద్ర సర్వీసులో వున్న వినాయక్ ప్రభాకర్ ఆప్టే పేరును పరిగణలోకి తీసుకునే అవకాశాలు లేవని తెలిసింది. దీంతో మిగతా వారి పేర్లను మాత్రమే పరిగణలోకి తీసుకునే వీలుంది. ఈ లెక్కన డిజిపి ఎంపికలో నలుగురి పేర్లను ప్రభుత్వం యుపిఎ స్‌సికి పంపాలని అనుకుంటే ఆనంద్, శివధర్ రెడ్డి, అభిలాష్ బిస్త్, సౌమ్యా మిశ్రా పేర్లను పంపే వీలుంది. ఒకవేళ ఐదుగురి పేర్లను పంపాలని అ నుకుంటే వీరితో పాటు శిఖా గోయల్ పేరును కూడా పంపే వీలుంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన పేర్లలో ముగ్గురిని యుపిఎస్‌సి ఎంపిక చేసి ఈ జా బితాను తిరిగి రాష్ట్రానికి పంపుతుంది. ఇదంతా నిబంధనల మేరకు జరిగే ప్రక్రియ. ఈ జాబితా నుంచి ఒకరిని రాష్ట్రం డిజిపిగా ఎంపిక చేసుకునే వీలుంది. రాష్ట్రం నుంచి వచ్చే జనవరిలో యుపిఎస్‌సికి డిజిపి ఎంపికకు సంబంధించిన జాబితా వెళ్లే వీలుంది. అనంతరం అదే నెలలో యుపిఎస్ సి నుంచి ఎంపికకు సంబంధించిన జాబితా తిరిగి వచ్చే వీలుంది. దీని తరువాత డిజిపి ఎంపిక ఖరార వుతుంది. గతంలో అనురాగ్ శర్మ, మహేం దర్ రెడ్డిల విషయంలో ఇలాగే జరిగింది. ఈ కారణంగా అనురాగ్ శర్మ మూడేళ్లకు పైగా మహేందర్ రెడ్డి ఐదేళ్లకు పైగా డిజిపిగా విధులు నిర్వహిం చ గలిగారు. ఒకవేళ శివధర్ రెడ్డిని యుపిఎస్‌సి పంపిన జాబితా నుంచి రాష్ట్రం ఎంపిక చేస్తే ఆయన కచ్చితంగా రెండేళ్ల పాటు డిజిపిగా విధులు ని ర్వహించాల్సి వుంటుంది. ఆయన వచ్చే యేడాది ఏప్రిల్‌లో పదవీ విరమణ చేయనున్నారు. ఆయన మళ్లీ పూర్తిస్థాయి డిజిపిగా పదవీబాధ్యతలు చేబడితే మరో రెండేళ్లపాటు ఆ పదవిలో వుంటారు. ఎపి డిజిపి హరీష్‌గుప్తా ఇలాగే కొనసాగుతున్నారు.

# హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం

## ప్రియుడు, ప్రియురాలు అరెస్ట్‌కాకినాడ యువతి హైదరాబాద్‌లో డ్రగ్స్ అమ్మకం

**హైదరాబాద్ (చిక్కడపల్లి) డిసెంబర్ 24, ప్రభాతవార్త :** మహానగరం క్రమంగా మత్తు పదార్థాల ప్రభావంలో చిక్కుకుంటోంది. తాజా లెక్కల ప్రకారం హైదరాబాద్‌లోనే 10 వేల మందికి పైగా మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు అంచనా ఉంది. ఇప్పటి వరకు డ్రగ్స్ సరఫరాలో నైజీరియన్ గ్యాంగులు, అంతర్రాష్ట్ర ముఠాలే ప్రధానంగా ఉన్నప్పటికీ, ఇప్పుడు చదువుకున్న, ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నవారే డ్రగ్స్ విక్రయాల్లోకి రావడం నగరాన్ని కలవరపెడుతోంది. బీటెక్ పూర్తి చేసి, ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఓ యువతి డ్రగ్స్ అమ్మకాల్లో పాల్గొని పోలీసులకు చిక్కడం ప్రస్తుతం హైదరాబాద్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఏపీలోని కాకినాడకు చెందిన సుస్మిత అనే యువతి హైదరాబాద్‌కు వచ్చి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తోంది. ఆమె తన బాయ్‌ఫ్రెండ్ ఇమ్మాన్యుయెల్‌తో కలిసి డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వీరిద్దరితో పాటు మరో ఇద్దరిని చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఎండీఎంఏ, ఎల్ఎస్డీ బాటిళ్లు, ఓజీ కుష్ వంటి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.4 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ సిటీ పోలీసులు - హెచ్ఎన్ఈడబ్ల్యూ, చిక్కడపల్లి పోలీసులతో కలిసి సంయుక్త ఆపరేషన్ నిర్వహించి, (01) స్థానిక డ్రగ్ పెడ్లర్, (02) స్థానిక డ్రగ్ సబ్‌పెడ్లర్లు మరియు (01) వినియోగదారుడిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి 22 గ్రాముల ఓజీ (హైడ్రోఫోనిక్ గంజాయి), 5 గ్రాముల ఎండిఎంఏ, 5.57 గ్రాముల ఎక్స్‌టసీ మాత్రలు, 06 ఎల్ఎస్‌డి బ్లాట్స్, 04 మొబైల్ ఫోన్లు, రూ. 50,000/ నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో కొండాపూర్ ప్రాంతానికి చెందిన ఈవెంట్ మేనేజర్ ఉమ్మిడి ఇమ్మాన్యుయేల్( (25 ), స్థానిక డ్రగ్ సబ్‌పెడ్లర్ల చోడవరపు సుస్మితా దేవి లిల్లీ ( 21 ) , రాపిడో స్విగ్గీ డెలివరీ బాయ్ గోర్ల సాయి కుమార్ ( 28 ), వినియోగదారుడు, చిక్కడపల్లి ప్రాంతానికి చెందిన తలబత్తుల తారక లక్ష్మీ మకాంత్ అయ్యప్ప, ( 24 ) లను పోలీసులు అరెస్ట్ చేశారు. డ్రగ్స్ లావాదేవీల కోసం గతంలో ఫోన్ కాల్స్, వాట్సాప్ వంటివి ఉపయోగించేవారు. అయితే వాటిని గుర్తించే అవకాశం ఎక్కువగా ఉండటంతో ఇటీవల టెలిగ్రామ్ యాప్ ద్వారా రహస్యంగా వ్యవహారాలు నడుపుతున్నట్లు తెలుస్తోంది. చదువుకున్న యువతే ఈ తరహా నేరాల్లో భాగస్వాములవడం హైదరాబాద్‌లో డ్రగ్స్ మాఫియా ఎంత లోతుగా విస్తరించిందో చెబుతోంది.

# పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర చిన్నారుల విక్రయ ముఠా

**హైదరాబాద్ (గచ్చిబౌలి), డిసెంబరు 24, ప్రభాతవార్త:** రోజుల వయస్సు ఉన్న చిన్నారులను వి క్రయిస్తున్న అంతరాష్ట్ర ముఠా సైబరాబాద్ పోలీసుల చేతికి చిక్కింది. ఈ ముఠాలోని మొత్తం 11మందిని అరెస్టు చేసిన పోలీసులు వీరి వద్ద నుంచి 10 రోజుల వయస్సు ఉన్న ఇద్దరు శిశువులను కాపాడి శిశువిహార్‌కు తరలించారు. గతంలో నగరంలోని గోపాలపురంలో సంచలనం స ృష్టించిన స ృష్టి కేసులో నిందితులుగా ఉన్న పలువురు ఈ ముఠాలో కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు. పాత కేసుల్లో బెయిలు మీద విడుదలైన నిందితులు మరోసారి పిల్లల అక్రమ రవాణా చేపడుతూ మియాపూర్ పోలీసులకు చిక్కారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం మాదాపూర్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిసిపి రితురాజ్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ పరిధిలోని కడప జిల్లాకు చెందిన వి.బాబురెడ్డి(49) నగరానికి వచ్చి మేడ్చల్‌లో నివాసం ఉంటూ ఐవిఎఫ్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈస్ట్‌గోదావరి జిల్లా నుంచి నగరానికి వచ్చి సికింద్రాబాద్‌లో నివాసం ఉంటున్న వి.గంగాధర్‌రెడ్డి(39) సైతం గతంలో ఐవిఎఫ్ ఏజెంట్‌గా పనిచేశాడు. వీరు తమ అనుచరులతో గ్యాంగ్‌లను ఏర్పాటు చేసుకొని శిశువుల అక్రమ రవాణా, అక్రమ విక్రయాలకు పాల్పడసాగారు. వీరు స్పెమ్ డొనేషన్, ఐవిఎఫ్ ఏజెంట్, సరోగసి ఏజెంట్లుగా సైతం వ్యవహరించారు. తమ అనుచరులతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులలో ఉండి అప్పుడే ప్రసవించిన కుటుంబాలను కలిసి డబ్బు ఆశ చూపించి శివుశులను కొనుగోలు చేస్తుంటారు. అనంతరం పిల్లలు లేక ఇబ్బందులు పడుతున్న వారికి లక్షల రూపాయలకు సదరు శిశువులను విక్రయించసాగారు. గంగాధర్‌రెడ్డి గతంలో నగరంలోని గోపాలపురం స ృష్టి కేసులో అరెస్టయి జైలుకు వెళ్లాడు. గతంలో ఇతనిపై 13 కేసులు నమోదయ్యాయి. బాబు రెడ్డి మీద సైతం గతంలో రెండు కేసులు ఉండగా, అరెస్టయి జైలుకు వెళ్లాడు. గతకొన్ని రోజుల క్రితం జైలు నుంచి విడుదలైన వీరు తమ అనుచరులతో కలిసి మరోసారి చిన్నారుల అక్రమ రవాణా చేపడుతున్నారు.

# వరల్డ్ కప్ కోసం ఆల్‌ఫార్మాట్ ప్లేయర్లకే ఛాన్స్

## టీమిండియా భవిష్యత్‌కు మెగా ప్లాన్






**న్యూఢిల్లీ:** వన్డే ప్రపంచ కప్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడతారా లేదా అనేది ఇంకా సస్పెన్స్ గానే ఉంది. ఒకవేళ వారు రిటైర్మెంట్ ప్రకటించక పోతే, జట్టులో కచ్చితంగా మార్పులు ఉంటాయి. కానీ మేనేజ్‌మెంట్ మాత్రం యశస్వి జైస్వాల్, తిలక్‌వర్మ వంటి యువకులను 50 ఓవర్ల ఫార్మాట్ కోసం సిద్ధం చేస్తోంది. భారత క్రికెట్‌లో సీనియర్ల శకం ముగియనుండటంతో, వన్డే ఫార్మాట్ కోసం ప్రత్యేకంగా యువ జట్టును సిద్ధం చేయాలని సెలక్టర్లు భావిస్తున్నారు.

కేవలం రాబోయే టి20 ప్రపంచ కప్ 2026 పైనే కాకుండా, దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచ కప్ 2027 పై కూడా దృష్టి సారించాయి. భారత్ జట్టులో ఉండే ఆటగాళ్లలో కేవలం ఐదు గురు మాత్రమే వన్డే వీటికి ఎంపికయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రపంచ కప్ జట్టులోని అందరు ఆటగాళ్లు వన్డే ఫార్మాట్‌కు సరిపోరని, అందుకేకేవలం ఆల్‌ఫార్మాట్ ప్లేయర్లను మాత్రమే కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకు జరుగుతున్న కసరత్తులో ఐదుగురు ప్లేయర్లకు వాటిల్లో చోటు దక్కే అవకాశాలను సెలక్ట్ కమిటీ చర్చిస్తోంది. వీరిలో టీమ్ ఇండియా ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా నమ్మదగ్గ బౌలర్‌గా ఉండగా, ఆల్‌రౌండర్‌గా జట్టుకు సమతుల్యతను అందించే కీలక ఆటగాడు. హార్దిక్ పాండ్యా పేరు పరిశీలనలో ఉంది. అలాగే నిలకడైన ప్రదర్శనతో టీ20 వైస్ కెప్టెన్‌గా ఎదిగిన అక్షర్ పటేల్ వన్డేల్లోనూ కీలకంగా ఉన్నాడు. మరో పక్క టీ20 జట్టులో చోటు కోల్పోయినప్పటికీ, వన్డేల్లో భారత్‌కు కాబోయే కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ పరిగణి స్తున్నారు.

ఇక స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్ చైనామన్ బౌలింగ్ వన్డే ఫార్మాట్‌కు అత్యంత అవసరం. కాగా టి20ల్లో ప్రపంచ నంబర్ 1 బ్యాటర్‌గా, జట్టు కెప్టెన్‌గా ఉన్న సూర్యకుమార్ యాదవ్ వన్డే ప్రపంచ కప్ రేసులో వెనుకబడినట్లు కనిపిస్తోంది. అతని వయస్సు (35 ఏళ్లు), గత వన్డే రికార్డులను పరిగణనలోకి తీసుకుంటే, 2027 నాటికి అతను వన్డే జట్టులో ఉండటం కష్టమేనని భావిస్తున్నారు. ఈ మెగా ప్లాన్ టీమిండియాను భవిష్యత్తులో మరింత బలోపేతం చేస్తుందని బోర్డు భావిస్తోంది. 2026 టీ20 వరల్డ్ కప్ ముగిసిన వెంటనే వన్డే జట్టుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.




## విజయ్ హజారే ట్రోఫీ..
# రోహిత్, కోహ్లీ సెంచరీలు

**న్యూఢిల్లీ:** విజయ్ హజారే ట్రోఫీ పునరాగమనంలో రోహిత్, కోహ్లీ సెంచరీలు బాదారు. ఇద్దరు ఆటగాళ్లు తమ ప్రత్యర్థులపై ఆధిపత్యం చెలాయించారు. ఈ టోర్నీ తొలి రోజు బుధవారం మొదటి అర్ధభాగం అంతా రికార్డు సెంచరీలతో సాగగా, టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రెండవ అర్ధభాగంలో తమ తమ సెంచరీలతో అందరి దృష్టిని ఆకర్షించారు. బుధవారం ముంబై తరఫున ఏడు సంవత్సరాల తర్వాత తన తొలి విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లో సెంచరీ సాధించి, రోహిత్ దేశీయ క్రికెట్‌లోకి సంచలనాత్మక పునరాగమనం చేశాడు. సిక్కింపై ముంబై తరఫున రోహిత్ కేవలం 62 బంతుల్లోనే అద్భుతమైన 155 పరుగుతో సెంచరీ సాధించాడు. జైపూర్‌లో సిక్కిం జట్టు 236 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రోహిత్ ఆత్మవిశ్వాసంతో ఆరంభించాడు, వరుసగా సిక్సర్లు, ఫోర్లు బాదడంతో లక్ష్యాన్ని సులభంగా చేరుకునే అవకాశం లభించింది. 50 ఓవర్ల ఫార్మాట్‌లో 14,000 పరుగులకు చేరుకున్న రోహిత్ సెంచరీ లిస్ట్ ఎ క్రికెట్‌లో 37వ సెంచరీగా నిలిచింది, ఇది భారత్ తరపున అతని 33 అంతర్జాతీయ సెంచరీల సంఖ్యకు జోడించింది. ఇక కోహ్లీ కూడా ఆంధ్రప్రదేశ్‌పై 83 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. బెంగళూరులో ఆంధ్రతో జరిగిన 299 పరుగుల ఛేదనలో కోహ్లీ 15 సంవత్సరాల తర్వాత విజయ్ హజారే ట్రోఫీకి తిరిగి వచ్చాడు. కోహ్లీ తన సాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అద్భుతమైన సెంచరీని సాధించాడు. ఇది అతని 58వ లిస్ట్ ఎ సెంచరీ. ఈ నెల ప్రారంభంలో దక్షిణాఫ్రికా సిరీస్ తర్వాత నాలుగు ఇన్నింగ్స్‌లలో అతని మూడవ సెంచరీ. ఇన్నింగ్స్‌లో తన తొలి పరుగుతోనే కోహ్లీ లిస్ట్ ఎ లో 16,000 పరుగులు సాధించిన తొమ్మిదవ ఆటగాడిగా ఎలైట్ క్లబ్‌లో చేరాడు.

## ఐసిసి ర్యాంకింగ్స్‌లో..
# శుభ్‌మాన్‌కు ఎదురుదెబ్బ



**న్యూఢిల్లీ:** ఐసిసి వరల్డ్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో శుభ్‌మాన్ గిల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. భారత టెస్ట్, వన్డే కెప్టెన్ ఇప్పుడు ఐసిసి టాప్10 టెస్ట్‌బ్యాట్స్‌మన్ ర్యాంకింగ్స్ నుండి తప్పుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లోని రెండు మ్యాచ్‌లలో బ్యాటింగ్ చేయలేకపోయిన పరిణామాలను గిల్ ఎదుర్కొన్నాడు. గతవారం వరకు, టెస్ట్‌ర్యాంకింగ్స్‌లో గిల్ 10వ స్థానంలో ఉన్నాడు. కానీ బుధవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో, అతను ఒక స్థానం దిగజారి టాప్10 నుండి తప్పుకున్నాడు. టాప్10లో మిగిలి ఉన్న ఏకైక భారతీయ బ్యాట్స్‌మన్ యశస్వి జైస్వాల్ ఇప్పుడు 8వ స్థానంలో ఉన్నాడు. అడిలైడ్‌లో జరిగిన మూడవ యాషెస్ టెస్ట్‌లో పేలవమైన ప్రదర్శన ఇచ్చినప్పటికీ ఇంగ్లాండ్ దిగ్గజ బ్యాట్స్‌మన్ జోరూట్ నెంబర్ 1 స్థానంలో కొనసాగుతున్నాడు. అడిలైడ్ టెస్ట్‌లో ఆస్ట్రేలియా జట్టులో స్టీవ్ స్మిత్ స్థానంలో వచ్చిన ఉస్మాన్ ఖవాజా మూడు స్థానాలు ఎగబాకి ఇప్పుడు 20వ స్థానంలో ఉన్నాడు. టాప్ 10లో ఉన్న ఇతర బ్యాట్స్‌మెన్‌లలో హెడ్, కారీ మరియు జైస్వాల్ కాకుండా, జో రూట్ నంబర్ వన్ స్థానంలో, న్యూజిలాండ్‌కు చెందిన కేన్ విలియమ్సన్ రెండవ, ఆస్ట్రేలియాకు చెందిన స్టీవ్ స్మిత్ మూడవ, ఇంగ్లాండ్‌కు చెందిన హ్యారీ బ్రూక్ ఐదవ, శ్రీలంకకు చెందిన కమిందు మెండిస్ ఆరవ, దక్షిణాఫ్రికాకు చెందిన టెంబా బావుమా ఏడవ, పాకిస్తాన్‌కు చెందిన సౌద్ షకీల్ పదవ స్థానంలో ఉన్నాడు.

# గ్లోబల్ చెస్ లీగ్ ఛాంపియన్‌గా ఆల్పైన్ పైపర్స్

**న్యూఢిల్లీ:** గ్లోబల్ చెస్ లీగ్-2025 ఛాంపియన్‌గా ఆల్పైన్ ఎస్‌జి పైపర్స్ నిలిచింది. రెండు సార్లు డిఫెండింగ్ ఛాంపియన్స్ త్రివేణి కాంటినెంటల్ కింగ్స్‌ను ఓడించిన ఆల్పైన్ టైటిల్ గెలుచుకుంది. గుకేశ్ దొమ్మరాజుకు చెందిన పిబిజి అలస్కాన్ నైట్స్ మూడో స్థానంలో నిలిచింది. పైపర్స్ మొదటి రాపిడ్ మ్యాచ్‌ను నల్లటి పావులతో 4-2 తేడాతో గెలవగా. తరువాత తెల్లటి పావులతో 4.5-1.5 తేడాతో విజయం సాధించింది. టైబ్రేక్‌లో గ్యాంజెస్ గ్రాండ్‌మాస్టర్‌లను ఓడించి పిబిజి అలాస్కాన్ నైట్స్ మూడవ స్థానంలో నిలిచింది. త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ ఫేవరెట్‌గా ఫైనల్‌లోకి ప్రవేశించింది. కానీ లీగ్ దశ రెండవ భాగంలో ఫామ్‌తో ఉన్న పైపర్స్‌లో నినో బాట్సియాష్విలి, లియోన్ ల్యూక్ మెండోంకాలు గెలవడం ద్వారా జట్టు ఆధిపత్యంలోకి వచ్చింది.

బిషప్‌నైట్ ఎండ్‌గేమ్‌లో నినో అలెగ్జాండ్రా కోస్టెనిక్‌పై విజయం సాధించగా, మెండోంకా 52 ఎత్తుగడల తర్వాత మార్క్ ఆండ్రియా మోరిజ్జీని వెనుకబడేలా చేశాడు. కాంటినెంటల్ కింగ్స్ స్టార్ ప్లేయర్ అలిరేజా ఫిరోజ్జా ఐకాన్ బోర్డులో ఫాబియానో కరువానాను ఓడించి తన జట్టును తిరిగి పోటీలోకి తీసుకువచ్చాడు. కానీ అనిష్ గిరి వీయిపై విజయం సాధించడంతో పైపర్స్ మొదటి మ్యాచ్‌ను 4-2 తేడాతో కైవసం చేసుకున్నాడు. మ్యాచ్‌లో సజీవంగా ఉండటానికి కాంటినెంటల్ కింగ్స్ 4 పాయింట్లు సాధించాల్సి ఉండగా, ఆర్ ప్రజ్ఞానంద పైపర్స్‌కు విదిత్ గుజరాతీపై విజయంతో తొలి ఆధిక్యాన్ని అందించాడు. మరియు అనీష్ గిరి ఆ తర్వాత వీ యిపై రెండవ విజయాన్ని నమోదు చేశాడు. గుకేష్‌పై ఆనంద్ 49 ఎత్తుగడలలో గెలిచి ఆల్పైన్ ఎజీ పైపర్స్‌కు ట్రోఫీని రావడంలో కీలకంగా వ్యవహరించాడు.




## సబ్ జూనియర్ పురుషుల హాకీ..
# పంజాబ్, ఎస్ఎజి, సెయిల్ విజయాలు

**న్యూఢిల్లీ:** హాకీ ఇండియా సబ్‌జూనియర్ మెన్ అకాడమీ ఛాంపియన్‌షిప్ 2025-జోన్ ఎ, బిలో రెండవ రోజు నామ్‌ధారి, రౌండ్‌గ్లాస్ పంజాబ్ హాకీ క్లబ్ అకాడమీ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్ హాకీ అకాడమీ, మరియు సెయిల్ హాకీ అకాడమీ కీలక విజయాలు నమోదుచేశాయి. గుజరాత్‌లో బుధవారం పూల్ డి మ్యాచ్‌తో ప్రారంభమైంది, నామ్ ధారి జట్టు ఎస్‌జిపిసి హాకీ అకాడమీపై 2-1 తేడాతో విజయం సాధించింది. విజేతల తరపున కెప్టెన్ గంగా సింగ్ (21వ నిముషం), కరణ్‌బీర్ సింగ్ (22) గోల్స్ చేయగా, ఎస్‌జిపిసి తరపున సుఖ్‌ప్రీత్ సింగ్ (60) గోల్స్ చేశారు. అలాగే పూల్ సిలో రౌండ్‌గ్లాస్ పంజాబ్ హాకీక్లబ్ అకాడమీ 18-1 తేడాతో సాల్యూట్ హాకీ అకాడమీపై విజయం సాధించింది. వరిందర్ సింగ్ (10, 15, 20, 42, 51), అర్జన్‌దీప్ సింగ్ (24, 27, 31, 49, 58) ఐదు గోల్స్ సాధించగా, మన్వీర్ సింగ్ (7, 22, 34, 60+) నాలుగు గోల్స్ సాధించారు. అర్ష్‌దీప్ సింగ్ (24, 36), శామ్యూల్ (3), షన్ముఖ్ సింగ్ (25) కూడా రౌండ్‌గ్లాస్ పంజాబ్ హాకీ క్లబ్ అకాడమీకి తమ వంతు సహకారం అందించారు. సాల్యూట్ హాకీ అకాడమీ తరపున అరుణ్ (18) ఏకైక గోల్ సాధించాడు. ఇదే పూల్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్ హాకీ అకాడమీ చీమా హాకీ అకాడమీపై 2-1 తేడాతో విజయం సాధించింది. చీమా హాకీ అకాడమీ తరపున గురుప్రీత్ సింగ్ (54) గోల్స్ సాధించారు. ఇక ఈ రోజు జరిగిన చివరి మ్యాచ్‌లో సెయిల్ హాకీ అకాడమీ జట్టు పూల్ బి పోరులో రిపబ్లికన్ స్పోర్ట్స్ క్లబ్‌పై 5-0 తేడాతో విజయం సాధించింది. విజేతల తరపున షాహిద్ మహ్మద్ (15+), కునాల్ కవ్రే (34), మిలన్ అథోక్‌పామ్ (43), సుమన్ కిండో (48), మరియు బికాష్ స్పైన్ (54) గోల్స్ చేశారు.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps